గురువారం
18•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 23
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతోనే కాళేశ్వరం సాకారం

- తక్కువ వరద సమయంలోనే 11 టీఎంసీల ఎత్తిపోత
- సమృద్ధిగా ఇన్‌ఫ్లో వస్తే తెలంగాణ సస్యశ్యామలం
- ఉద్యమ నాయకుడే సీఎం కావడం వల్ల చేకూరిన లబ్ధి
- ట్విట్టర్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దార్శనికత వల్లనే దేశంలోనే అద్భుతమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సాకారం అయిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు చెప్పారు. గత కొన్నిరోజులుగా కాళేశ్వరం ఎత్తిపోతలలో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి గోదావరి జలాల ఎత్తిపోత కొనసాగుతున్న విషయం తెలిసిందే. నిరంతరాయంగా సాగుతున్న ఈ ప్రక్రియతో పాటు మేడిగడ్డ బరాజ్‌లోనూ గోదావరి జలాల్ని ఒడిసిపట్టడంతో మునుపటికి భిన్నంగా కిలోమీటర్ల మేర గోదావరి సజీవంగా దర్శనమిస్తున్నది. ఈ క్రమంలో ట్విట్టర్ ద్వారా స్పందించిన కేటీఆర్.. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి కావడం వల్ల తెలంగాణకు చేరిన లబ్ధి ఇది అంటూ పేర్కొన్నారు. 'ఇంత తక్కువ వర్షాలు పడుతున్న కాలంలో, అసలు గోదావరిలో ఏమాత్రం వరద రాని సీజన్‌లో ప్రాణహిత నదిలో వస్తున్న వరద నీటిని అయిదు మోటర్ల ద్వారా ఎత్తిపోసి.. పది రోజుల్లో 11 టీఎంసీల నీటిని ఒడిసిపట్టి నిలువ చేశాం. దీనితో కనీసం లక్షన్నర ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. ఇది ప్రారంభం మాత్రమే. వర్షాలు కురిసి, వరద పెరిగి అన్ని మోటర్లు మొదలైతే తెలంగాణలో బీళ్లన్నీ గోదావరి నీటితో సస్యశ్యామలం అవుతాయి. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి కావడం వల్ల తెలంగాణకు చేకూరిన లబ్ధి ఇది' అని ట్విట్టర్‌లో తన అభిప్రాయాన్ని పంచుకొన్నారు. అదేవిధంగా దేశంలోని చాలా మెట్రోపాలిటన్ నగరాల్లో తాగునీటి సమస్య తీవ్ర స్థాయిలో ఉన్నదని, అయితే హైదరాబాద్ నగరానికి మాత్రం అలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశమే లేదన్నారు. కాళేశ్వరం ప్రారంభమైన దరిమిలా ఆ జలాలతో హైదరాబాద్ నీటి అవసరాలు కూడా తీరుతాయని, చెన్నై తరహా నీటి కష్టాలు హైదరాబాద్‌కు ఎప్పుడూ రాకుండా చూసుకోవచ్చని కేటీఆర్ పేర్కొన్నారు.

'నీటి కష్టాల' వార్తలు అవాస్తవం

- సినీ దర్శకుడు మారుతి ట్వీట్‌కు కేటీఆర్ స్పందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌కు నీటి కష్టాలు వస్తాయంటూ సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్లో నిజంలేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. 48 రోజుల తర్వాత హైదరాబాద్ నగరంలో నీరుండదని, చెన్నై మాదిరి కరువును ఎదుర్కోవాల్సి వస్తుందన్న వార్తలపై సినీ దర్శకుడు మారుతి సైతం స్పందిస్తూ 'ఈ వార్త నిజమేనా సర్' అంటూ ట్విట్టర్ ద్వారా కేటీఆర్‌ను అడిగారు. కేటీఆర్ స్పందిస్తూ.. 'ఆ వార్తలన్నీ అవాస్తవం. రెండువారాల్లో కాళేశ్వరం నీరు ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి వస్తుంది. తద్వారా హైదరాబాద్‌కు రోజూ 172మిలియన్ గ్యాలన్ల నీరు అందుతుంది. ప్రజలు కూడా నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి' అని పేర్కొన్నారు.

డీఎస్పీ భూకబ్జాలపై డీజీపీ ఆగ్రహం!

- నమస్తే తెలంగాణ కార్యాలయానికి డీఎస్పీ శంకర్
- ఎవరి భూమినీ కబ్జా చేయలేదని వివరణ

డీఎస్పీ శంకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏఆర్ డీఎస్పీ శంకర్ భూకబ్జా వ్యవహారాలపై డీజీపీ మహేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారని సమాచారం. నల్లగొండ జిల్లాకేంద్రంలో పేదల భూమిని డీఎస్పీ శంకర్ అండదండలతో ఆయన కుటుంబస భ్యులు కబ్జాచేయడంపై నమస్తే తెలంగాణ ధర్మగంటలో వరుస కథనాలు రావడంతో ఈ విషయంపై శాఖాపరంగా డీజీపీ ఆరాతీశారని తెలిసింది. ఇదిలా ఉంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎస్పీ శంకర్ బుధవారం నమస్తే తెలంగాణ కార్యాలయానికి వచ్చారు. తాను ఎవరి భూమినీ కబ్జా చేయలేదని తెలిపారు. 1996లోనే తాము స్టాంప్ పేపర్‌పై విక్రయ దస్తావేజు రాసుకున్నామని చెప్పారు. సదరు మహిళలే తమపై దౌర్జన్యం చేశారని తన అన్న పెద్దులు డీజీపీకి ఫిర్యాదుచేశారని చెప్తూ.. ఫిర్యాదు కాపీని నమస్తే తెలంగాణ ప్రతినిధికి చూపించారు. రెండుమూడ్రోజుల తర్వాత తన సోదరుడు పెద్దులు అన్ని కాగితాలు తీసుకుని వచ్చి వివరణ ఇస్తారని చెప్పారు. తాము సర్వేకు దరఖాస్తు చేసుకున్నామంటూ రసీదులు చూపించారు. సర్వేలో వారి భూమి అని తేలితే.. వారికి ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

1996లో భూమిని కొనుగోలుచేస్తే ఇప్పటివరకు ఎందుకు పట్టా చేయించుకోలేదు? సాదాబైనామా కొనుగోళ్ల క్రమబద్ధీకరణకు అనేకసార్లు ప్రభుత్వాలు దరఖాస్తులు ఆహ్వానించినా ఎందుకు దరఖాస్తు చేసుకోలేదు? తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సాదాబైనామా క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించినా, ఎందుకు దరఖాస్తు చేసుకోలేదు? బాధితులకు చాలాఏండ్లనుంచి 1(బీ) పట్టా, పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్నాయి. రికార్డుల ప్రక్షాళన తర్వాత కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకం ఇచ్చారు. రైతుబంధు కూడా బాధితులకు ఇచ్చారు. ఈ భూమి డీఎస్పీ కుటుంబానిదే అయితే ఇన్నేండ్లలో ఎందుకు పట్టా చేసుకోలేకపోయారు? ఈ ప్రశ్నలు అలాగే ఉన్నాయి.

కన్నెపల్లిలో ఇక ఆటోమోడ్

- మన ఇంజినీర్లే మోటర్లను నడిపే అవకాశం
- ఇప్పటికే ఆటోమోడ్‌లోకి ఒకటో మోటర్
- పూర్తిస్థాయి నిల్వసామర్థ్యానికి చేరువగా అన్నారం
- బరాజ్‌లో 5.65 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- కన్నెపల్లి వద్ద తాత్కాలికంగా మోటర్ల నిలిపివేత
- మేడిగడ్డ బరాజ్‌లో 7.26 టీఎంసీల నిల్వ

అన్నారం బరాజ్ కింద పొలాలను సాగుకు సిద్ధం చేసుకొంటున్న రైతులు .. గోదావరి జలాలతో కళ కళ లాడుతున్న అన్నారం బరాజ్ .. (ఇన్‌సెట్) కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి విడుదలవుతున్న గోదావరి నీరు

కాళేశ్వరం/మహదేవపూర్: గత ఐదారు రోజులుగా మోటర్లను నిర్విఘ్నంగా నడుపుతున్న కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లను ఆటోమోడ్‌లో పనిచేయించేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు మాన్యువల్‌గా మోటర్లను నడుపగా.. ఇకపై ఆటోమోడ్‌లో రన్ చేసేందుకు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, అండ్రీజ్, ఏబీబీ కంపెనీ ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందుకోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తేబోతున్నారు. ఆస్ట్రియా, ఫిన్‌లాండ్ దేశాలనుంచి ప్రత్యేకంగా ఇంజినీరింగ్ అధికారులను రంగంలోకి దింపారు. వారు కాళేశ్వర్వానికి చేరుకుని పనులను మొదలుపెట్టారు. ఆటోమోడ్‌లోకి తేవడంతో మన ఇంజినీర్లు సైతం మోటర్లను నడిపే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఒకటో నంబర్ మోటర్‌ను మాన్యువల్ నుంచి ఆటోమోడ్‌లోకి తెచ్చారు.

పూర్తిస్థాయి నిల్వ సమీపానికి అన్నారం

ప్రాణహిత జలాలను పంప్‌హౌస్ నుంచి నిరవధికంగా ఎత్తిపోయడంతో అన్నారం బరాజ్‌లో నీటినిల్వ 5.65 టీఎంసీలకు చేరుకున్నది. బరాజ్ దాదాపు నిండుతుండటం, ఆటోమోడ్‌లోకి మోటర్లను తెచ్చే పనితో అధికారులు బుధవారం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటర్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ఉదయంవరకు నాలుగు మోటర్లు నడువగా, 9 గంటలకు 1, 4వ నంబర్ మోటర్లను నిలిపివేశారు. తదుపరి 11.30కు 3వ, 5వ మోటర్లు ఆఫ్‌చేశారు. నాలుగు మోటర్ల నుంచి సుమారు 4000 క్యూసెక్కులను గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌లోకి పంపారు. 2వ నంబర్ మోటర్‌తో ఏ క్షణంలోనైనా నీటిని ఎత్తిపోసే అవకాశాలున్నాయి. గురువారం 2వ, 6వ పంప్ నుంచి అన్నారం బరాజ్‌కు నీటిని తరలించనున్నారు. మాన్యువల్ నుంచి ఆటోమోడ్‌లోకి తెచ్చేక్రమంలో మోటర్లను నిలిపివేశామని ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. అన్నారం పంప్‌హౌస్‌లోకి గోదావరి నీరు చేరడంతో ఒకట్రెండురోజుల్లో నీటిని ఎత్తి సుందిల్ల బరాజ్‌కు తరలించనున్నారు. కాళేశ్వరంవద్ద 10,000 క్యూసెక్కుల వరకు ప్రవాహం ఉన్నదని ఇంజినీర్లు తెలిపారు. మేడిగడ్డ బ్యాక్‌వాటర్ 28 కిలోమీటర్లకు చేరుకున్నాయి.

మేడిగడ్డలో 7.26 టీఎంసీలు

మేడిగడ్డ బరాజ్‌లో నీటి నిల్వ బుధవారం సాయంత్రానికి 7.26 టీఎంసీలకు చేరుకున్నది. మంగళవారం నుంచి ఎలాంటి నీటి ప్రవాహం రాలేదని, బరాజ్‌లో నీటి నిల్వ నిలకడగానే ఉన్నదని డీఈ సురేశ్ తెలిపారు. ప్రతి రోజూ బరాజ్‌లో నీటిమట్టంపై ఇంజినీర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఎప్పటికప్పుడు అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇదిలాఉంటే.. మంగళవారం రాత్రి మేడిగడ్డ బరాజ్‌లోని 40 గేట్లను ఐదు నిమిషాలపాటు సైరన్ కూతతో ఎత్తి పరీక్షలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన గిరిజన విద్యార్థికి చెక్ అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్‌దత్ ఎక్కా, క్రిస్టినా చోంగ్తూ తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

- ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక సౌకర్యాలు: మంత్రి కొప్పుల
- 10 జీపీఏ సాధించిన 15 మందికి రూ.50 వేల చొప్పున అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన చిన్నారులకు విద్యావకాశాలు కల్పించి, నాణ్యమైన బోధన అందించాలని ప్రభుత్వం భావిస్తున్నదని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఎన్ఏసీ కన్వెన్షన్ సెంటర్లో గతేడాది పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఎస్టీ ఆశ్రమపాఠశాల విద్యార్థులను మంత్రి సత్కరించారు. 10 జీపీఏ సాధించిన 15మందికి రూ.50 వేల నగదు, ప్రతిభా పురస్కారాలను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించి ఫలితాలు సాధించేందుకు సంక్షేమశాఖ చర్యలు చేపట్టిందన్నారు. పాఠశాల స్థాయిలోనే సామాజిక అంతరాలను తొలగించి ప్రతీ ఒక్కరికి ఆర్థిక, సామాజిక న్యాయం అందించాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, సీఎం ఆదేశాల మేరకు గిరిజనుల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. ప్రతి గిరిజన బిడ్డకు కేజీ నుంచి పీజీ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, నాణ్యమైన విద్య, పోషకాలతో కూడిన ఆహారం, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినా ఝడ్ చోంగ్తూ, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్మట్టి నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఆల్మట్టికి 57 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కనీసం 30-40వేల క్యూసెక్కులున్నా జూరాలకు వారంపదిరోజుల్లో నీరు

హైదరాబాద్/మహబూబ్‌నగర్ ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ: కృష్ణాబేసిన్‌లో ఎగువన ఉన్న కర్ణాటక ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టికి 57,086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో జలాశయంలో నీటిమట్టం పెరుగుతున్నది. రాబోయే నాలుగురోజుల్లో ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే ఆల్మట్టి, నారాయణపూర్ నిండే అవకాశం ఉన్నది. గత రెండ్రోజుల్లో ఇన్‌ఫ్లో తగ్గిన నేపథ్యంలో ప్రస్తుతం వస్తున్న వరద కొనసాగుతుందా లేదా అనే అంశంపైనే ఇది ఆధారపడి ఉన్నది. గురువారం ఇన్‌ఫ్లో 50వేల కంటే కొంచెం తగ్గే అవకాశం ఉన్నదని ఆల్మట్టి అధికారులు చెప్తున్నారు. కనీసం 30-40వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా.. ఎనిమిది రోజుల్లో ఆల్మట్టి, నారాయణపూర్ నిండి, జూరాలకు నీరు వచ్చే అవకాశం ఉంటుందని జూరాల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హెచ్‌టీ శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం ఆల్మట్టి రిజర్వాయర్‌లో 129.721 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికిగాను 107 టీఎంసీల పైగా నీరు చేరుకున్నది. దిగువకు 22,836 క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్‌కు అదేస్థాయిలో ఇన్‌ఫ్లో వస్తుండగా.. 37.464 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయం 31.31 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యాంకు కూడా ఇన్‌ఫ్లో తగ్గుతున్నది. ప్రస్తుతం 10,776 క్యూసెక్కుల వరద వస్తున్నది. భీమాకు ఇంకా ఆశించిన మేర వరద రావడంలేదు. ఉజ్జయిని ప్రాజెక్టు సామర్థ్యం 117.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 47.75 టీఎంసీల సామర్థ్యానికి చేరుకున్నది. ప్రస్తుతం 4270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. మరోవైపు గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. కడెంకు 109, ఎల్లంపల్లికి 475 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. ధవళేశ్వరం వద్ద 44,219 క్యూసెక్కులుగా నమోదైంది.

'మల్లన్నసాగర్' ఇంజినీర్లకు ఊరట

- ధిక్కరణ కేసులో శిక్షపై స్టే విధించిన డివిజన్ బెంచ్

సిద్దిపేట, నమస్తే తెలంగాణ: మల్లన్నసాగర్ రిజర్వాయర్ పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. ధిక్కరణ కేసులో రెండునెలల జైలు, జరిమానా విధిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం బుధవారం స్టే విధించింది. సిద్దిపేట జిల్లా తొగుటలో ఆర్ అండ్‌ఆర్ చట్టం ప్రకారం ప్యాకేజీ పూర్తిగా చెల్లించకుండా పనులు చేపట్టొద్దని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును అధికారులు పాటించడంలేదంటూ పలువురు హైకోర్టులో వ్యాజ్యం దాఖలుచేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. నీటిపారుదల, ఆయకట్టు ప్రాంత అభివృద్ధిశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీ వేణు, డివిజన్ 7 ఈఈ జీ బద్రీనారాయణ, తొగుట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి జైలుశిక్ష విధించింది. దీనిపై అధికారులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసుకోగా.. శిక్షపై స్టే విధించింది. విచారణను నాలుగు వారాల పాటు వాయిదావేసింది.

పలు మున్సిపాల్టీల ఎన్నికలపై హైకోర్టు స్టే

మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్‌తోపాటు పలు మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రక్రియపై హైకోర్టు బుధవారం స్టే విధించింది. తెలంగాణ మున్సిపాల్టీల చట్టానికి విరుద్ధంగా, స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా వార్డులు విభజించారంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఆయా మున్సిపాల్టీల్లో వార్డుల విభజన ప్రక్రియను పరిశీలించిన కోర్టు.. పలు మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రక్రియపై స్టే విధించింది.

'బిగ్‌బాస్'కు ఊరట

స్టార్ మా టీవీలో ప్రసారం కానున్న బిగ్‌బాస్-3 నిర్వాహకులకు హైకోర్టులో ఊరట లభించింది. యాంకర్ శ్వేతా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బంజారాహిల్స్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ 637ను కొట్టేయాలని బిగ్‌బాస్ నిర్వాహకుడు అభిషేక్‌ముఖర్జీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని, క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుచేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

భూపతిరెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనర్హతకు గురైన ఎమ్మెల్సీ భూపతిరెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. తనపై అనర్హత వేటు రాజ్యాంగ విరుద్ధమంటూ ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది. ఈ విషయంలో అప్పటి మండలి చైర్మన్ చట్టప్రకారమే వ్యవహరించారని స్పష్టంచేసింది. టీఆర్ఎస్ తరఫున ఎన్నికైన ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్ పార్టీ మారారని టీఆర్ఎస్ఎల్పీ చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి శాసనమండలి చైర్మన్ వారిపై అనర్హత వేటువేశారు. దీనిపై ఆ ముగ్గురు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇటీవల రాములునాయక్, యాదవరెడ్డి పిటిషన్లను కొట్టేయగా, తాజాగా భూపతిరెడ్డి పిటిషన్‌ను కూడా కొట్టేసింది. నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి టీఆర్ఎస్ తరఫున ఎన్నికైన భూపతిరెడ్డి.. కాంగ్రెస్‌లో చేరారని, పార్టీ మారిన విషయాన్ని ఆయనే స్వయంగా మండలి చైర్మన్ ఎదుట అంగీకరించారని అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రారావు హైకోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన కథనాల ప్రతులను, వీడియోలను ధర్మాసనం ముందుంచారు. గత ఏడాది రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భూపతిరెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీచేశారని, అన్ని అంశాలను పరిశీలించాకే చైర్మన్ ఆయనపై అనర్హత వేటువేశారని కోర్టుకు వివరించారు.

నల్లమలలో యురేనియం సర్వేకు బ్రేక్?

- కఠిన ఆంక్షలు విధించిన రాష్ట్ర అటవీశాఖ
- ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్‌కు లేఖ
- తక్షణమే నిలిపివేయాలన్న జల్ బిరాదరి కన్వీనర్

వెంటనే పనులు ఆపండి: జల సంఘం కన్వీనర్

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: నల్లమల అడవుల్లో యురేనియం నిక్షేపాల సర్వేకు బ్రేక్ పడనున్నది. అటవీశాఖ విధించిన ఆంక్షలు కఠినంగా ఉండటంతో తవ్వకాలకు అనుమతి లభించడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తున్నది. దాంతో 'ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్' కోసం జరుపతలపెట్టిన తవ్వకాలు నిలిచిపోనున్నాయి. నల్లమలలో యురేనియం నిక్షేపాలను కనుగొనేందుకు చేపట్టే తవ్వకాలు పూర్తిగా పర్యావరణహితంగా ఉండాలని ఆటామిక్ మినరల్స్ డైరెక్టరేట్‌కు రాసిన లేఖలో రాష్ట్ర అటవీశాఖ స్పష్టంచేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుంచి 2011 వరకు యురేనియం నిక్షేపాల కోసం నాగార్జునసాగర్ అటవీ ప్రాంతాల్లో ఆటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ సర్వే నిర్వహించింది. అప్పట్లో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు, వివిధ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. చివరకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సర్వే కోసం మరోసారి కేంద్రానికి దరఖాస్తు పెట్టుకొన్నారు. కొన్ని షరతులకు లోబడి సర్వే జరిపేందుకు స్టేట్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సంస్థ 2016 డిసెంబర్‌లో, నేషనల్ బోర్డ్ 2017 ఏప్రిల్‌లో అంగీకారం తెలిపాయి. ఈ ఏడాది మే నెలలో కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి సూచనప్రాయంగా అనుమతి లభించింది.

కఠిన షరతులు విధింపు

నల్లమల అడవుల్లో యురేనియం నిక్షేపాలను గుర్తించేందుకు జరిపే సర్వే నిమిత్తం రాష్ట్ర అటవీశాఖ కఠినమైన ఆంక్షలు విధించింది. అడవుల్లో ప్రస్తుతం ఉన్న బండిబాటలు, కాలిబాటలను, పిల్లదారులను మాత్రమే సర్వేకు ఉపయోగించాలని, భారీ వాహనాలను అసలే వాడొద్దని, చెట్లను నరికివేయవద్దని షరతులు విధించారు. సర్వే పనులు సాయంత్రం వరకు జరుపాలని, అటవీ సిబ్బంది, అధికారులు వెంట ఉన్నప్పుడు మాత్రమే సర్వే చేయాలని పేర్కొన్నది. వీటికి సమ్మతిస్తే పూర్తివివరాలతో ఫారం-సీ నింపి పంపాలని ఆటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్‌కు పంపిన లేఖలో రాష్ట్ర అటవీశాఖ స్పష్టంచేసింది.

నల్లమలలో సర్వే కోసం కేంద్రం ముందస్తు అనుమతులు ఇవ్వడం పట్ల జల్ బిరాదరి (జల సంఘం) జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మైనింగ్ వల్ల అమ్రాబాద్ ప్రాంతంలో నివసించే ప్రజల ఉనికే ప్రశ్నార్థకంగా తయారవుతున్నందున వెంటనే సర్వే పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్‌రూం దేశానికే ఆదర్శం

- రూ.1.2 లక్షలతో కేంద్రం నిర్మించే ఇంట్లో ఎలా ఉంటారు?
- లోక్‌సభలో ప్రశ్నించిన టీఆర్ఎస్ పక్షనేత నామా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో పేదల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని రూ.5 లక్షలతో చేపడుతున్నదని, దీని ద్వారా ఆ కుటుంబమంతా సౌకర్యంగా నివాసం ఉండగలుగుతుందని పేర్కొన్నారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా బుధవారం నామా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2022 నాటికి పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, అయితే రూ.1.2 లక్షలతో ఒక్క గది మాత్రమే నిర్మించగలుగుతారని చెప్పారు. అందులో నలుగురు సభ్యుల కుటుంబం ఎలా ఉంటుందని కేంద్రాన్ని ప్రశ్నించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద కేంద్రం ఐదెకరాలకు ఏడాదికి రూ.6వేలు మాత్రమే విడుతల్లో ఇస్తున్నదని చెప్పారు. కానీ, తెలంగాణ ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు సాయం చేస్తున్నదని నామా పేర్కొన్నారు.

రాష్ట్రాల హక్కును హరిస్తున్నారు: ఎంపీ కేకే

నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ (ఎన్ఐఏ) చట్ట సవరణ బిల్లులోని అంశాలు దుర్వినియోగమయ్యేలా ఉన్నాయని టీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యసభలో బుధవారం చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ చట్టం సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల హక్కులను కూడా కాపాడాల్సి ఉంటుందని.. కానీ, ఈ బిల్లులో రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోలేదని చెప్పారు. ఎన్ఐఏ లాంటి కీలకమైన సంస్థకు సంబంధించిన అంశాల్లో రాష్ట్రాలను పక్కన పెడుతూ.. వారి హక్కులను హరిస్తున్నారని విమర్శించారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుచేయండి: ఎంపీ బండా ప్రకాశ్

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుచేయాలని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశానికి కాజీపేట ముఖద్వారం లాంటిదని చెప్పారు. బుధవారం రాజ్యసభలో జీరోఅవర్‌లో మాట్లాడుతూ.. కాజీపేటలో డీజిల్, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లు, ప్యూయల్ రీఫిల్లింగ్ కేంద్రం, బ్యాగేజ్ షెడ్లు ఉన్నాయని తెలిపారు. దక్షిణమధ్య రైల్వేలో సికింద్రాబాద్ రైల్వే డివిజన్ నుంచే 60 శాతం ఆదాయం వస్తున్నదని, ఇందులో 80 శాతం ఉత్తర తెలంగాణ నుంచే సమకూరుతున్నదని పేర్కొన్నారు. కాజీపేట స్టేషన్‌ను డివిజన్‌గా మారిస్తే ఉద్యోగులకు, కుటుంబసభ్యులు, పిల్లలకు ఎన్నో సౌకర్యాలు మెరుగుపడుతాయని చెప్పారు. విభజన చట్టంలోని కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కూడా పెండింగ్‌లో ఉన్నదన్నారు.

గురువారం
18•7•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in

వయోపరిమితి 57 ఏండ్లకు తగ్గింపు

జూన్ నుంచి పెంచిన పింఛన్లు

ఈ నెల 20న ప్రొసీడింగ్స్
వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు

- పింఛన్లు వెయ్యి నుంచి రూ.2016కు
- దివ్యాంగులు, వృద్ధ కళాకారులకు రూ.1500ల నుంచి రూ.3016కు
- పీఎఫ్ కటాఫ్ డేట్ తొలిగింపు
- పురపాలక చట్టం బిల్లుకు ఆమోదం

నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు
ఆమోదానికి మున్సిపల్ బిల్లు
భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ

రాష్ట్రంలో పెంచిన పింఛన్లు అమల్లోకి రానున్నాయి. ఇందుకోసం ఈ నెల 20న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. గురు, శుక్రవారాల్లో నిర్వహించే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే కొత్త మున్సిపల్ చట్టం బిల్లుకు ఆమోదం తెలిపింది. బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో వీటితోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.1000 నుంచి రూ.2016కు, దివ్యాంగులు, వృద్ధ కళాకారుల పెన్షన్‌ను రూ.1500 నుంచి రూ.3016కు పెంచాలని నిర్ణయించారు. పెంచిన పింఛన్లను 2019 జూన్ నుంచి అమలుచేస్తారు. జూన్ నెల పెన్షన్‌ను ఈ జూలైలోనే లబ్ధిదారులకు అందుతుంది. పెంచిన పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 20న అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులకు అందిస్తారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు పాల్గొంటారు. ప్రొసీడింగ్స్ అందజేసేందుకు సమావేశాలు ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం కోరింది. ప్రొసీడింగ్స్ పంపిణీ ముగిసిన వెంటనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు. పెంచిన పింఛన్లు అందించటానికి సంవత్సరానికి రూ.12 వేల కోట్లు ఖర్చు అవుతుంది. దీంట్లో రూ.11,800 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 4వ పేజీలో

బుధవారం కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌లోకి గ్రావిటీ ద్వారా ఉరకలేస్తున్న గోదావరి జలాలు

బుధవారం తెలంగాణభవన్‌లో పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం రూ.60 లక్షల చెక్కును మంత్రి ఈటల రాజేందర్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య

మీరే వారధులు

- ప్రజలతో నిత్యం మమేకంకావాలి
- మున్సిపల్ ఎన్నికలు ముగిశాక పాలనపైనే పూర్తిస్థాయిలో దృష్టి
- దసరాకల్లా జిల్లా పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణం పూర్తిచేయాలి
- మంత్రులు, పార్టీ కార్యాలయాల నిర్మాణ ఇంచార్జులతో కేసీఆర్
- కార్యాలయాల నిర్మాణాలకోసం రూ.60 లక్షల చొప్పున చెక్కులు అందజేత

4

టీఆర్ఎస్ దూకుడు

జోరుగా సాగుతున్న సభ్యత్వ నమోదు
స్వచ్ఛందంగా చేరుతున్న ప్రజలు

7

కొత్తగా ఆరు మున్సిపల్ కార్పొరేషన్లు!

ప్రతిపాదనలు సిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరో ఆరు కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్లతోపాటు కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, ఖమ్మం కార్పొరేషన్లు ఉన్నాయి. కాగా, హైదరాబాద్ నగర శివారులోని ఆరు మున్సిపాలిటీలను అప్‌గ్రేడ్ చేసి కార్పొరేషన్లుగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. కొత్త మున్సిపల్ కార్పొరేషన్లుగా మారనున్నవాటిలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపాలిటీలు ఉన్నట్టు సమాచారం.

కూరెళ్ల విఠలాచార్యకు

దాశరథి పురస్కారం

- దశాబ్దాలుగా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న మధుర కవి
- 22న దాశరథి జయంతి కార్యక్రమంలో అవార్డు ప్రదానం
- కూరెళ్ల ఎంపికతో సాహితీలోకం హర్షాతిరేకాలు

హైదరాబాద్/యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలుగు ఆణిముత్యం మురిసింది.. సాహితీలోకం గర్వపడింది.. వెల్లంకి గ్రామం ఆనందపడ్డది.. యాదాద్రి భువనగిరి జిల్లా సగర్వంగా మరోసారి తెలుగు సాహిత్యంలో తన విశిష్టతను చాటుకున్నది. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన సాహిత్య ప్రపూర్ణ, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేసే దాశరథి సాహితీ పురస్కారం -2019కి ఎంపికయ్యారు. ఈ నెల 22న ప్రముఖ అభ్యుదయ కవి

మిగతా 4వ పేజీలో

కన్నడ సర్కార్ కథ కంచికి!

- రెబల్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రావాలని ఒత్తిడి చేయరాదు
- వారి రాజీనామాలపై నిర్ణయాధికారం స్పీకర్‌దే: సుప్రీంకోర్టు తీర్పు
- కుమారస్వామి ప్రభుత్వానికి నేడు విశ్వాస పరీక్ష.. తగ్గిన అధికారపక్ష బలం
- విశ్వాస పరీక్షను వాయిదా వేయించే ప్రయత్నాల్లో కాంగ్రెస్-జేడీఎస్

కర్ణాటకలో కాంగ్రెస్-జేడీ(ఎస్) నేతృత్వంలోని సంకీర్ణ సర్కార్ పతనం అంచుకు చేరినట్టు కనిపిస్తున్నది. రెండువారాలుగా ఆ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలకు సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడే అవకాశాలున్నాయి. తమ సభ్యత్వాలకు రాజీనామా చేసిన 15 మంది రెబల్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రావాలని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు బుధవారం తీర్పు చెప్పింది. ఈ తీర్పు గురువారం అసెంబ్లీలో విశ్వాస పరీక్షను ఎదుర్కోబోతున్న కుమారస్వామి ప్రభుత్వానికి సంకట స్థితిని తెచ్చింది. రాజీనామా చేసిన రెబల్ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకపోతే ప్రభు త్వం మైనార్టీలో పడిపోయి విశ్వాస పరీక్షలో ఓడిపోయే ప్రమాదం నెలకొన్నది. దీంతో కొన్ని సాంకేతిక కారణాలను చూపించి బలపరీక్షను వాయిదా వేయించేందుకు అధికార పార్టీల నేతలు స్పీకర్‌తో భేటీ అయ్యారు. స్పీకర్ తీసుకునే నిర్ణయంపైనే కుమారస్వామి సర్కార్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఎమ్మెల్యేల రాజీనామాల ఆమోదంపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పును స్వాగతించిన స్పీకర్ రమేశ్‌కుమార్ రాజ్యాంగ సూత్రాలను అనుసరించి వ్యవహరిస్తానని పేర్కొన్నారు. కోర్టు నిర్ణయం ప్రజాతీర్పును వమ్ము చేసిన ఎమ్మెల్యేలకు రక్షణ కల్పించేదిగా ఉన్నదని కాంగ్రెస్ వ్యాఖ్యానించగా, ఇది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి లభించిన విజయమని బీజేపీ ప్రశంసించింది.

9

బుధవారం విధానసౌధలో స్పీకర్ రమేశ్‌కుమార్‌ను కలిసి బయటికి వస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి

జాదవ్ మరణశిక్షపై పునఃసమీక్షించండి

- పాకిస్థాన్‌కు అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశం
- శిక్ష అమలుపై స్టే కొనసాగింపు
- తీర్పును స్వాగతించిన భారత్

9

చికెన్ ధరలు (వెన్‌కాబ్)	(రూ.)		
ఫారం ధర	70.00	రిటైల్ లైవ్	92.00
డ్రెస్‌డ్	133.00	స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు)	(రూ.)		
హైదరాబాద్	375.00	రంగారెడ్డి	375.00
మెదక్	375.00	కరీంనగర్	378.00
వరంగల్	378.00	రిటైల్ ప్రైస్	4.35

పడావుగా ఉన్నదని

పట్టా మార్చేశారు!

పదకొండున్నర ఎకరాలు కబ్జా

వన్‌బీని మార్చి వత్తాసు పలికిన రెవెన్యూ అధికారులు
కొత్తపాస్ పుస్తకం.. రైతుబంధు చెక్కు అందజేత
బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన అసలు వారసుడు
తాసిల్దార్ కార్యాలయం చుట్టూ వారసుడి భార్య ప్రదక్షిణలు

ధర్మగంట

తల్లిపేరిట ఉన్న భూమికి తానే వారసుడనే విషయం ఆలస్యంగా తెలుసుకున్న కుమారుడు సొంతూరు వెళ్లాడు. అప్పటికే ఆ భూమి కబ్జాకు గురైందని తెలిసి తన భూమిని తనకు దక్కేలా చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. ఏండ్ల తరబడి తిరిగినా తాసిల్దార్ పట్టించుకోలేదు. ఈలోగా ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోవడంతో ఉపాధి కోసం గల్ఫ్ బాటపట్టాడు. భూ ప్రక్షాళన సమయంలో అతడి తల్లి పేరుమీదనే వన్‌బీ ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. ఆ తరువాత కబ్జాదారుడి పేరుమీదకు పట్టామార్చి కొత్త పాస్‌పుస్తకం ఇచ్చేశారు. భర్త గల్ఫ్‌కు వెళ్లడంతో.. అతని భార్య భూమికోసం పోరాడుతున్నారు. రెవెన్యూ అధికారులు కనికరించకపోవడం, కబ్జాదారుడి బెదిరింపులు ఎక్కువ కావడంతో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కరత్వాడ గ్రామానికి చెందిన రూప 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

5

15వ ఆర్థిక సంఘం కాలవ్యవధి పొడిగింపు
నవంబర్ 30దాకా పెంచిన కేంద్రక్యాబినెట్

11

పట్టా ఇచ్చారు
'నాభూమిని మరొకరికి పట్టా చేశారు' కథనానికి స్పందించిన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ తాసిల్దార్

5

ఆవులొద్దు.. గొర్రెలనే త్యాగంచేయండి

బక్రీద్ సందర్భంగా ముస్లింలకు హోంమంత్రి మహమూద్ అలీ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆగస్టులో వచ్చే బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను కాకుండా గొర్రెలను త్యాగంచేయాలని హోం మంత్రి మహమూద్ అలీ ముస్లింలకు పిలుపునిచ్చారు. బుధవారం చార్మినార్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హిందువులు ఆవును ఎంతో గౌరవిస్తారని, అందుకే ఆవులను త్యాగానికి వాడొద్దని, గొర్రెలు, ఇతర జంతువులను త్యాగంచేయాలని సూచించారు. తెలంగాణలో ప్రశాంతమైన వాతావరణం ఉన్నదని స్పష్టంచేశారు. చార్మినార్‌లోని నాలుగు మినార్లు హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతాలకు ప్రతీకలని తెలిపారు. కులీ కుతుబ్‌షాహీ నిర్మించిన చార్మినార్ అన్ని మతాలను ఒక దగ్గరకు చేర్చిందని పేర్కొన్నారు. కుతుబ్‌షాహీ తర్వాత అన్ని మతాలను, వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన నేత సీఎం కేసీఆర్ అని కొనియాడారు.

టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల నిర్మాణం కోసం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌రావులకు చెక్కులు అందజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

కట్టుదిట్టంగా మున్సిపల్ చట్టం!

- జిల్లా కలెక్టర్లకే సంపూర్ణ బాధ్యతలు
- ప్రజాప్రతినిధులకు కోడ్ ఆఫ్ కాండక్ట్ వర్తింపు
- కొత్తగా ప్రాపర్టీ ట్యాక్స్ బోర్డు ఏర్పాటు!
- ప్రతి పట్టణానికి విడిగా పారిశుద్ధ్య ప్రణాళిక
- నేడు అసెంబ్లీలో మున్సిపల్ కొత్త చట్టంపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టనున్న మున్సిపల్ చట్టాన్ని కట్టుదిట్టంగా రూపొందించారని తెలిసింది. ఈ చట్టంలో హరితహారానికి పెద్దపీట వేస్తున్నారని సమాచారం. ఇందుకోసం మున్సిపాలిటీల్లో కలెక్టర్ నేతృత్వంలో గ్రీన్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలు తయారయ్యాయి. కొత్త చట్టంలో పురపాలక ఉద్యోగులకు ఏకీకృత మున్సిపల్ నిబంధనలు, మున్సిపాలిటీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కోడ్ ఆఫ్ కాండక్ట్ వర్తింపజేసేలా చట్టంలో మార్పులు తీసుకొస్తున్నట్టు తెలిసింది. మున్సిపల్ కమిషనర్లు, ఉద్యోగుల్ని సస్పెండ్ చేసే అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెట్టనున్నారని అధికార వర్గాల సమాచారం. తోటి సభ్యులతోగానీ, ఉద్యోగులతోగానీ తప్పుగా ప్రవర్తించినా, దాడికి పాల్పడినా, మున్సిపాలిటీ ఆస్తులను ధ్వంసంచేసినా చైర్మన్లు, వైస్‌చైర్మన్లను సస్పెండ్ చేసే అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెట్టే అంశాన్ని ప్రధానంగా చట్టంలో చేర్చనున్నట్టు తెలిసింది.

బాధ్యతలూ ఉన్నాయ్

ప్రతి కౌన్సిలర్/ కార్పొరేటర్ నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలతోపాటు పౌరులు చెల్లించాల్సిన ఫీజులు, పన్నులు, జరిమానాలు గురించి చట్టంలో స్పష్టంగా పేర్కొనే అవకాశమున్నది. ఆస్తి పన్ను వసూళ్లు, మున్సిపాలిటీలకు మార్గదర్శనం చేయడానికి ప్రాపర్టీ ట్యాక్స్ బోర్డు ఏర్పాటుపై నిర్ణయం తీసుకొన్నట్టు తెలిసింది. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ తాపత్రయానికి అనుగుణంగా ప్రతి పట్టణానికి పారిశుద్ధ్య ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సమాచారం. అన్ని మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపెడుతున్న నేపథ్యంలో ఇందుకోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయనున్నట్టు తెలిసింది.

పౌరసేవలకు పెద్దపీట

కొత్త మున్సిపల్ చట్టంలో పౌరసేవలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ స్థలాల్లో పౌరుల కోసం మూత్రశాలలు, రెస్ట్ రూములను నిర్మించాలనే నిబంధనను కొత్త మున్సిపల్ చట్టంలో పొందుపరిచారని సమాచారం. పబ్లిక్ మార్కెట్లు, మున్సిపల్ షాపులు, ప్రైవేటు మార్కెట్లు వంటి వాటిని కేటాయించే విషయాన్ని చట్టంలో పొందుపరిచే ప్రతిపాదనలున్నాయి. ప్రజలు ప్రశాంతంగా నివసించడానికి అవసరమయ్యేలా కట్టుదిట్టమైన చర్యల్ని చట్టంలో పేర్కొన్నారని తెలిసింది. ప్రతి పట్టణంలో లేఅవుట్లు, అపార్టుమెంట్లు, మల్టీప్లెక్సులు వంటివి అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే నిబంధనలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీలో పాటించాల్సిన నిబంధనలు వంటివి కొత్త చట్టంలో ప్రతిపాదించారని సమాచారం. అక్రమ నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యల్ని కట్టుదిట్టంగా పేర్కొంటున్నట్టు తెలిసింది. పట్టణ ప్రజలకు అందించాల్సిన పౌరసేవల గురించి, ఏయే సేవలను ఎప్పటిలోగా పౌరులకు అందించాలో చట్టంలో స్పష్టంగా పేర్కొన్నట్టు సమాచారం.

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య మీరే వారధులు

బుధవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధినేత, సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

ప్రజలతో నిత్యం మమేకంకావాలి

- మున్సిపల్ ఎన్నికలు ముగిశాక పాలనపైనే పూర్తిస్థాయిలో దృష్టి
- దసరాకల్లా జిల్లా పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణం పూర్తిచేయాలి
- మంత్రులు, పార్టీ కార్యాలయాల నిర్మాణ ఇంచార్జులతో కేసీఆర్
- కార్యాలయాల నిర్మాణాలకోసం రూ.60 లక్షల చొప్పున చెక్కులు అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పార్టీ నాయకులు ఉండాలని టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. పార్టీ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలతో మమేకంకావాలని, వారి సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే దసరాకల్లా పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని సూచించారు. వీటికోసం బాధ్యులకు రూ.60 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. బుధవారం తెలంగాణభవన్‌లో రాష్ట్ర మంత్రులు, పార్టీ కార్యాలయాల నిర్మాణ ఇంచార్జులతో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జాతీయపార్టీలకు స్థానంలేదని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలు ముగియగానే పూర్తిస్థాయిలో పార్టీ, ప్రభుత్వ కార్యకలాపాలపై దృష్టి పెడుదామన్నారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో ప్రాంతీయ పార్టీ అయిన టీఆర్ఎస్ బలంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకంతో ఇంకా బాగా పనిచేద్దామన్నారు. రాష్ట్రంలో అన్నిరంగాలకు 24గంటలపాటు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గతంలో విద్యుత్ సరఫరా ఎలా ఉన్నదో, ఇప్పుడెలా ఉన్నదో ప్రజలంతా ప్రత్యక్షంగా చూస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా ద్వారా సురక్షిత మంచినీటిని అందిస్తున్నామన్నారు. అనే కరకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశానికే ఆదర్శమయ్యాయని చెప్పారు. ఇలా ప్రజల అవసరాలను తీర్చేలా పథకాలను ప్రవేశపెడుతున్నాం కాబట్టే వారి మనసుల్లో చెరగని ముద్ర వేశామని, అందుకే మనల్ని ఆదరిస్తున్నారని అన్నారు.

దసరాకల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణం

పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలను దసరాకల్లా పూర్తిచేయాలని నిర్మాణ ఇంచార్జులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. అన్ని జిల్లాల పార్టీ కార్యాలయాలు ఒకేవిధంగా ఉండేలా నమూనాలను రూపొందించామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును త్వరగా పూర్తిచేయాలని, ఆ తర్వాత కమిటీలను వేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే సభ్యత్వ నమోదు పూర్తికావచ్చిందని, పార్టీ నాయకులు చురుకుగా పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయడం కూడా పూర్తయిందని తెలిపారు.

రూ.60 లక్షల చొప్పున చెక్కులు అందజేత

పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణాలకు అవసరమయ్యే నిధులను పార్టీయే చెల్లిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ మేరకు రూ.60లక్షల చొప్పున చెక్కులను పార్టీ భవనాల ఇంచార్జులకు ఆయన అందజేశారు. పార్టీ కార్యాలయాల నమూనాలను కూడా అందించారు. కొత్తగా నిర్మించుకునే కార్యాలయాల్లో పార్టీ క్యాడర్‌కు శిక్షణాకార్యక్రమాలు ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గస్థాయిలోనూ పార్టీ కార్యాలయాలను నిర్మించుకుందామన్నారు. సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయానికి ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు

ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ క్యాడర్ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం కేసీఆర్ చెప్పారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవాలన్నారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మెరుగైన పాలనను అందిద్దామని పిలుపునిచ్చారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నదని సీఎం చెప్పారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణలో కరువు ఉండదని అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం అమలుచేయని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను తీర్చేలా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులందరితోపాటు రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యాలయాలున్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జోగురామన్న, టీ హరీశ్‌రావు, దాసరి మనోహర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, దివాకర్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గంపగోవర్ధన్, భూపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పోడుభూములకు శాశ్వత పరిష్కారం

సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు • మీడియాతో ఎమ్మెల్యే వనమా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు భరోసా ఇచ్చారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పోడు భూముల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన చెప్పారు. సమావేశం అనంతరం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోడు భూములపై అటవీశాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, వారు సంయమనం పాటించాలని కోరామని చెప్పారు. పట్టాలిచ్చిన భూములకు సంబంధించిన ఆదివాసులను కూడా వేధిస్తున్నారని, కొంతమంది ఆదివాసులను జైలుకు కూడా పంపించారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకు వస్తానని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారని వనమా చెప్పారు. అప్పటివరకు ఎవరూ ఏ భూమినీ ముట్టుకోవద్దని అధికారులతో చెప్పాలని.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి సూచించారని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల పేరు మీద అటవీ భూములు ఉంటే విచారణ చేసి స్వాధీనం చేసుకోవచ్చని వనమా స్పష్టంచేశారు. కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి ఆరోపణలను ఖండిస్తున్నామని చెప్పారు. గిరిజనులకు, ఆదివాసులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం తనకు ఉన్నదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

అవి చారిత్రక కట్టడాలు కావు

ఎర్రమంజిల్‌పై హైకోర్టులో ప్రభుత్వ వాదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎర్రమంజిల్ ప్యాలెస్ హెరిటేజ్ కట్టడం కాదని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఎర్రమంజిల్‌లో నూతన అసెంబ్లీని నిర్మించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లలో ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు బుధవారం వాదనలు ప్రారంభించారు. హుడా జోనింగ్ రెగ్యులేషన్లలోని సెక్షన్ 13ను ప్రభుత్వం జీవో 183 ద్వారా తొలిగించిందని, ఎర్రమంజిల్ భవనం హెరిటేజ్ కిందకు రాదని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకొన్న ధర్మాసనం ఒకసారి చట్టం ప్రకారం రక్షణ లభించాక ఎలా తొలిగిస్తారని ప్రశ్నించింది. సెంట్రల్ జనరల్ క్లాసెస్ యాక్ట్ సెక్షన్ 6 ప్రకారం.. చట్టంలోని అంశాలకు రక్షణ ఉంటుందని పేర్కొన్నది. యాక్ట్ కోణంలో వాదనలు వినిపించాలని ఏఏజీకి సూచించిన ధర్మాసనం..విచారణను 22కు వాయిదా వేసింది.

2,166 మందిపై అనర్హత వేటు

మున్సిపల్ ఎన్నికల వ్యయం చూపనివారిపై ఎస్ఈసీ మూడేండ్ల నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసి ఎన్నికల వ్యయాన్ని చూపించని అభ్యర్థులను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వచ్చేఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించింది. మూడేండ్లపాటు ఎన్నికలకు అనర్హులుగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీచేసింది. 27 జిల్లాల్లోని 49 మున్సిపాలిటీల్లో 2,166 మందిని అనర్హులుగా తేల్చింది. 2014లో జరిగిన పురపాలక ఎన్నికల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీచేసిన అభ్యర్థులు నిబంధనల ప్రకారం.. ఎన్ని నిధులు ఖర్చుచేశారనేది ఎస్ఈసీకి ఇవ్వాల్సి ఉంటుంది. పలువురు అభ్యర్థులు ఖర్చు వివరాలను అధికారులకు అప్పగించలేదు. అలాంటివారిని ఎన్నికల సంఘం పోటీకి అనర్హులుగా ప్రకటించింది. అత్యధికంగా పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 363 మందిని ఎస్ఈసీ అనర్హులుగా ప్రకటించింది. కొందరిని ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు, మరికొందరిని 2020 డిసెంబర్ 22వ తేదీవరకు అనర్హులుగా ప్రకటించింది.

24 నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్

29న సీట్ల కేటాయింపు.. రిపోర్టింగ్‌కు 31 వరకు గడువు

రెండోవిడుత షెడ్యూల్ విడుదలచేసిన అడ్మిషన్ కన్వీనర్ నవీన్‌మిట్టల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి ఈ నెల 24 నుంచి రెండోవిడుత ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు ఎంసెట్ అడ్మిషన్ కన్వీనర్ నవీన్ మిట్టల్ బుధవారం షెడ్యూల్‌ను విడుదలచేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో స్లాట్ బుకింగ్, కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాలి. 26న సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 24 నుంచి 27 వరకు వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. 29న సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులు 29 నుంచి 31 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి, కళాశాలల్లో 30, 31 తేదీల్లో రిపోర్ట్ చేయాలి. దాదాపు 26 వేల ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలివిడుత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో 65,444 సీట్లు ఉండగా, 49,012 సీట్లు భర్తీ అయ్యాయి. 16,432 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థుల్లో దాదాపు 10 వేలమంది కళాశాలల్లో రిపోర్ట్ చేయలేదని సమాచారం. సీట్లు అందుబాటులో ఉన్నందున కళాశాలల్లో, కోర్సుల్లో సీట్లు పొందడానికి వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ఈసెట్ స్పాట్ కౌన్సెలింగ్ ప్రారంభం

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో డిప్లొమా విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం (లాటరల్ ఎంట్రీ) ప్రవేశాల కోసం బుధవారం స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రారంభించారు. గురు, శుక్రవారాల్లో (18, 19 తేదీల్లో) కళాశాలలవారీగా విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. 20న స్పాట్‌లో అడ్మిషన్లు ఖరారు చేస్తారు. పూర్తి వివరాలకు https://tsecetd.nic.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఈసెట్ అడ్మిషన్ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు.

ముహూర్తం

సూర్యోదయం: 5.55 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, విదియ, నక్షత్రం: శ్రవణం, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.03 నుంచి 3.39 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.59 నుంచి 3.36 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 5.07 వరకు, వర్జ్యం: తె.జా. 3.25 నుంచి 5.01 వరకు.

నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

- భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రధానంగా నూతన మున్సిపల్ చట్టానికి ఆమోదం తెలిపేందుకు ఈ సమావేశాలను ఏర్పాటుచేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభంకాగానే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కొత్త మున్సిపల్ చట్టం బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు. బిల్లుపై అధ్యయనానికి ఒకరోజు సమయం ఇవ్వనున్నారు. శుక్రవారం ఉదయం శాసనసభ తిరిగి సమావేశం కానుంది. బిల్లుపై చర్చించి, ఆమోదం తెలుపనున్నది. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందగానే శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు శాసనమండలిలో ప్రవేశపెట్టి, చర్చించి ఆమోదిస్తారు. ఉభయసభల్లో బిల్లు ఆమోదం పొందిన తరువాత కొత్త మున్సిపల్ చట్టం అమలులోకి వస్తుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో భద్రతాఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పోలీసు ఉన్నతాధికారులతో అసెంబ్లీలోని తన చాంబర్‌లో సమీక్షించారు. సమావేశాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లుచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు శాసనసభ పరిసరాల్లో వాహనదారులకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పోలీసుశాఖ తరపున తీసుకుంటున్న చర్యలను ఆ శాఖ ఉన్నతాధికారులు స్పీకర్‌కు వివరించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాల సందర్భంగా బుధవారం పోలీస్ అధికారులతో సమావేశమైన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

జూన్ నుంచి పెంచిన పింఛన్లు

మూడోపేజీ తరువాయి...

భరిస్తుండగా కేంద్రం రూ.200 కోట్లను ఇస్తున్నది. వృద్ధాప్య పెన్షన్ల అర్హత వయో పరిమితిని 65 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గిస్తామనే టీఆర్ఎస్ ఎన్నికల హామీని అమలుచేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 57 సంవత్సరాలు నిండిన పేద వృద్ధుల జాబితాను వెంటనే రూపొందించాలని అధికారులను మంత్రివర్గం కోరింది. వీలైనంత త్వరలో లబ్ధిదారుల జాబితాను రూపొందించి, దాని ప్రకారం పెంచిన పెన్షన్ అందించనున్నారు. బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ డేట్‌ను తొలిగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. 2019 జూలై 17 వరకు పీఎఫ్ ఖాతా ఉన్న కార్మికులకు పెన్షన్ అందించాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది.

లోకం పోకడ

ఇక నుంచి మమ్మల్ని కొట్టేముందు మీ గుర్తింపుకార్డు చూపెట్టాలి.. మీరు అసలో, నకిలీయో తెలుసుకోవాలి గదా!

కూరెళ్ల విఠలాచార్యకు దాశరథి పురస్కారం

మూడోపేజీ తరువాయి...

దాశరథి కృష్ణమాచార్య 95వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో విఠలాచార్యకు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానంచేయనున్నారు. తెలంగాణ సాకారమైన తర్వాత మన కవులకు దక్కుతున్న గౌరవం చూసి సాహితీలోకం మురిసిపోతున్నది. నల్లగొండ జిల్లా వెల్లంకిలో జన్మించిన విఠలాచార్య పద్యం, గద్యం, నాటకం, బుర్రకథ, వ్యాసం, బాలసాహిత్యంతోపాటు పలు సాహితీప్రక్రియల్లో రచనలు చేశారు. సుమారు 70 వేల పుస్తకాలతో వెల్లంకిలో గ్రంథాలయం నెలకొల్పారు. 2018లో ప్రముఖ కవి వర్ధుల శివకుమార్‌కు, 2017లో ఆచార్య ఎన్ గోపికి, 2016లో ప్రముఖ కవి బాపురెడ్డికి, 2015లో తిరుమల శ్రీనివాసాచార్యకు దాశరథి అవార్డులను అందజేసిన సంగతి తెలిసిందే.

నిత్య సాహితీకృషీవలుడు

తెలుగు సాహిత్యానికి కూరెళ్ల విఠలాచార్య చేసిన సేవ అంతాఇంతా కాదు. అందుకు ఆయనను ఎన్నో సాహిత్య పురస్కారాలు, బిరుదులు వరించాయి. తెలుగు పాండిత్యంలో ఆయనది అందెవేసిన చెయ్యి. దాదాపు ఎనిమిది పత్రికలు స్థాపించి, నిర్వహించి తెలుగు సాహిత్యాన్ని నలుమూలలకు వ్యాప్తిచేశారు. ఎన్నో సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలు నెలకొల్పారు. ప్రస్తుతం కూరెళ్ల వయసు 81 సంవత్సరాలు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో కూరెళ్ల లక్ష్మమ్మ, వెంకటరాజయ్య దంపతులకు జూలై 9, 1938లో జన్మించిన విఠలాచార్య.. ఎంఏ (తెలుగు), బీఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విశారద (హిందీ) విద్యనభ్యసించారు. విశ్రాంత తెలుగు ఉపన్యాసకులైన ఆయన పఠనం, పరిశోధన, రచన, సాహిత్య, సాంస్కృతిక, విద్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాల నిర్వహణ, పల్లెపట్టుల్లో విద్యావ్యాప్తికి, సాహిత్యవ్యాప్తికి, గ్రంథాలయాల నిర్మాణానికి కృషిచేస్తున్నారు. అభినవ పోతన, మధురకవి, సుధీతిలక, సాహిత్యబ్రహ్మ, ఆచార్య, తెలంగాణ వేమన, నల్లగొండ కాళోజీ, అక్షరకళాసమ్రాట్టు, కవితాశ్రీ, కవిభూషణ, సాహిత్యప్రపూర్ణ, మధురకవితా కళానిధి తదితర బిరుదులు ఆయనను వరించాయి. బాపూ భారతి, మన తెలుగు తల్లి, వలి వెలుగు, మన పురోగమనం, చిరంజీవి, ప్రియంవద, ముచికుంద, లేఖిని వంటి పత్రికలను ఆయన స్థాపించి, నిర్వహించారు. తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణం పేరిట పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని, తెలుగులో గొలుసుకట్టు నవలలు పేరిట ఎంఫిల్ సిద్ధాంతగ్రంథాన్ని కూరెళ్ల వెలువరించారు. స్వాతంత్ర్యోద్యమం- ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం, విర్థలేశ్వర శతకం (సామాజిక స్పృహ నిండిన సచిత్ర పద్యకృతి), మధురకవి కూరెళ్ల పీఠికలు (సంపాదకులు దాసోజు జ్ఞానేశ్వర్), స్మృత్యంజలి, కవితాచందనం, కూరెళ్ల నానీలు, గో విలాపం తదితర గ్రంథాలు, పుస్తకాలు రచించారు.

వెల్లంకిలో కూరెళ్ల గ్రంథాలయం వద్ద విఠలాచార్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ తదితరులు

'పండు పండిన తల్లి పడకపై ఒకవైపు..
అస్వస్థతయైన భార్య ఒకవైపు
మనుసుకు నులిపెట్టు మా అల్లుడొకవైపు
కండ్ల పిచాశము గ్లకోమా ఒకవైపు
పనివాళ్లు పెట్టు తిప్పలొకవైపు
బలహీనపర్చిన వార్ధక్యమొకవైపు
తలకు మించిన బాధ్యతలొకవైప

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

పడావుగా ఉన్నదని.. పట్టా మార్చేశారు

పదకొండున్నర ఎకరాలు కబ్జా ■ వన్‌బీని మార్చి వత్తాసు పలికిన రెవెన్యూ అధికారులు
కొత్తపాస్ పుస్తకం.. రైతుబంధు చెక్కు అందజేత ■ బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన అసలు వారసుడు
తాసిల్దార్ కార్యాలయం చుట్టూ వారసుడి భార్య ప్రదక్షిణలు ■ ధర్మగంటను ఆశ్రయించిన ఆదిలాబాద్ జిల్లా బోథ్ బాధితురాలు

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కరత్వా శివారులో నారంశెట్టి గంగారెడ్డి పేరుపై 74 సర్వేనంబర్‌లో 11.20 ఎకరాల భూమి ఉన్నది. 1975లో గంగారెడ్డి చనిపోయాడు. ఆ సమయంలో నిండు గర్భిణీ అయిన ఆయన భార్య పోసాని కుటుంబంలో గొడవల కారణంగా కరత్వా నుంచి బోథ్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. అక్కడే ఆమెకు కుమారుడు జన్మించాడు. కరత్వాడలో ఉన్న భూమిని గురించి పట్టించుకోని పోసాని.. ఆ విషయాన్ని తన కుమారుడికి కూడా చెప్పలేదు. 1994లో ఆమె మరణించింది. 2003 కరత్వాలో చెరువు నుంచి వెళ్లే కాల్వ నారంశెట్టి పోసాని గంగారెడ్డికి చెందిన భూమిలో నుంచి వెళ్లింది. ఈ భూమికి సంబంధించిన వారసులు ఎవరైనా ఉంటే పరిహారం అందజేస్తామంటూ రెవెన్యూ అధికారులు గ్రామంలో నోటీసులు అంటించారు. గ్రామస్తులు కొందరు బోథ్‌లో ఉండే రమేశ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో తనకు భూమి ఉన్నట్టు తెలుసుకున్న అతడు కరత్వా వచ్చి పరిహారం తీసుకున్నారు. అయితే, అదే సమయంలో తన భూమి కబ్జాలో ఉన్నట్టు గుర్తించాడు. తల్లిపేరుమీద ఉన్న భూమిని కబ్జా నుంచి విడిపించాలని, తన పేరిట వారసత్వ పట్టాచేయాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా కావడం రమేశ్ గల్ఫ్‌కు వెళ్లారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా కరత్వాలో సమగ్ర సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు.. 74 సర్వేనంబర్‌లోని భూమికి సంబంధించి నారంశెట్టి పోసాని పేరుమీద వన్‌బీ ఇచ్చారు. ఇది గమనించిన కబ్జాదారుడు తక్కల గంగారెడ్డి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయి వారికి లంచం ముట్టజెప్పి.. 74 సర్వే నంబర్‌లోని భూమిని కొనుగోలు చేసినట్టు డాక్యుమెంట్లు తయారుచేశారు. నారంశెట్టి పోసాని పేరుపై ఆన్‌లైన్‌లో భూమి ఉండగా.. తక్కల గంగారెడ్డి పేరుపై పట్టాచేసి.. రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకాలు కూడా జారీచేశారు. రైతుబంధు చెక్కులు కూడా తక్కల గంగారెడ్డి పేరుమీదే వచ్చాయి. రమేశ్ గల్ఫ్‌కు వెళ్లడంతో ఆయన భార్య రూప కొన్నేండ్లుగా వారసత్వ భూమి కోసం పోరాటం చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అధికారుల కాళ్లావేళ్లా పడినా కనికరించడం లేదు. దీంతో తమ భూమి ఇప్పించాలని వేడుకుంటూ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

ఏండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు

కరత్వా శివారులో అత్తమామల పేరుమీద 11.20 ఎకరాల భూమి ఉన్నది. దీనిని తక్కల గంగారెడ్డి ఆక్రమించడంతోపాటు, నకిలీపత్రాలు సృష్టించి పట్టా చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో మా అత్త నారంశెట్టి పోసాని గంగారెడ్డి పేరుపై ఇప్పటికీ ఉన్నది. నోటిఫైడ్ ఏరియాలో వారసత్వంగా ఈ భూమిని నా భర్త రమేశ్ పేరుపై పట్టాచేయాలి. కానీ, రెవెన్యూ అధికారులు తక్కల గంగారెడ్డి వద్ద డబ్బులు తీసుకొని ఆయనకే పట్టాచేశారు. రైతుబంధు కూడా ఆయనే తీసుకుంటున్నారు. మా భూమి మాకే చెందాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే తక్కల గంగారెడ్డిపేరుపై ఉన్న పట్టాను రద్దుచేసి నా భర్త రమేశ్‌పై పేరుపై ఇవ్వాలి.

- నారంశెట్టి రూప, బోథ్, ఆదిలాబాద్ జిల్లా

పట్టా ఇచ్చారు

'నాభూమిని మరొకరికి పట్టా చేశారు' కథనానికి స్పందించిన తాసిల్దార్



మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పాతర్ల గంగాధర్ అనే రైతు భూ సమస్య 'ధర్మగంట' ద్వారా పరిష్కారమయింది. గంగాధర్‌కు గుండిలి శివారులోని సర్వేనంబర్ 198 వీ లో 36 గుంటల వ్యవసాయభూమి ఉండగా అందులో 12 గుంటల భూమి రికార్డుల్లోకి ఎక్కలేదు. రెవెన్యూ అధికారులు దానిని ఇతరుల పేరిట పట్టాచేయడంతో ఆయన ధర్మగంటను ఆశ్రయించాడు. ఈ నెల 11న 'ధర్మగంట'లో 'నాభూమిని మరొకరికి పట్టా చేశారు' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్పందించిన మాక్లూర్ తాసిల్దార్ భూపతి.. రైతు గంగాధర్‌ను బుధవారం కార్యాలయానికి పిలిపించి ఆన్‌లైన్ పహాణీలను పరిశీలించారు. ఖాతా నంబర్ 72, సర్వేనంబర్ 198/అ/పి 2/1లో 24 గుంటలు, అలాగే 198/ఆ/పి 2 లో 12 గుంటలు కలిపి.. మొత్తం 36 గుంటల విస్తీర్ణం భూమిని పాతర్ల గంగాధర్ పేరిట రికార్డుల్లోకి ఎక్కించి పట్టాచేశారు.

పదర తాసిల్దార్ సస్పెన్షన్

పదర: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల తాసిల్దార్ మల్లికార్జున్‌రావును సస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్టు ఆర్డీవో పాండు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదర మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున్‌రెడ్డి భూ పట్టాలు చేయిస్తానని చెప్పి దాదాపు 25 మంది గ్రామస్తుల నుంచి రూ.1500 నుంచి 2 వేల వరకు డబ్బులు వసూలు చేసిన మొత్తం తాసిల్దార్‌కు అందజేస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టిన కలెక్టర్ శ్రీధర్.. తాసిల్దార్ మల్లికార్జున్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మల్లికార్జున్ స్థానంలో ఆమ్రాబాద్ మండల తాసిల్దార్ సురేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తెలిపారు.

భూమి ఒకరిది.. పాస్‌బుక్ మరొకరిది

భూమిలేని వ్యక్తి పేరు మీద జారీ అయిన పాస్‌బుక్కు ఇదే

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఓ రైతు పేరు మీద ఉన్న పట్టాభూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేరిట పాస్‌బుక్కును జారీచేసి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన గునమోని కర్రె నాగన్న తండ్రి చిన్న నర్సింహకు గత 40 ఏండ్ల క్రితం అదే గ్రామంలోనే ఎందుకు పనికిరాని పడావులో రాళ్లు రప్పలతో ఉన్న 1.3 ఎకరాల కొండ భూమిని సర్వే 3/ఆ లో ప్రభుత్వం అందించింది. ఈ భూమిని సాగులోకి తీసుకొచ్చి దానిపై ఆధారపడి జీవిస్తున్నాడు. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా కొత్త పాస్‌బుక్ (టీ 03120071104, ఖాతా నంబర్ 3000)ను తీసుకొన్న నాగన్న కొడుకు మల్లేశ్ అందులో తన తండ్రి పేరు బదులు మరొకరి పేరు నమోదుకావడంతో అవాక్కయ్యాడు. ఈ భూమితో ఎలాంటి సంబంధం లేని గొల్ల నడిపి నాగన్న పేరుతో పాస్‌బుక్ వచ్చింది. పట్టాదారు ఫొటో తోపాటు, తండ్రిపేరు, ఆధార్ నంబర్‌ను కూడా తప్పుగా ముద్రించారు. ఈ విషయాన్ని పెద్దకొత్తపల్లి మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ బాలరాజు దృష్టికి 'నమస్తే తెలంగాణ' తీసుకుపోగానే స్పందిస్తూ అప్పటికప్పుడు దిద్దుబాటు చర్యను చేపట్టారు. రెండు మూడు రోజుల్లోనే సవరించిన కొత్త పాస్‌బుక్కు అందుతుందని డీటీ చెప్పారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరిగిన లోపమని వివరణ ఇచ్చారు.

పట్టాభూమిని తొలగించి.. అడ్రస్‌లేని వ్యక్తికి రిజిస్ట్రేషన్

- పాస్‌పుస్తకంలో పన్నెండెకరాలు.. మోఖాపై తొమ్మిదెకరాలు
- తాసిల్ కార్యాలయం ముందు రైతు ఆత్మహత్యాయత్నం

ఏన్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న సురేశ్

వైరా, నమస్తే తెలంగాణ: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రైతు సుంకర రామయ్య కుమారుడు సుంకర సురేశ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తల్లాడ మండలం నర్సింహరావుపేటకు చెందిన సుంకర రామయ్యకు ఏన్కూరు మండలం జన్నారం రెవెన్యూపరిధిలో 1952 నుంచి వారసత్వంగా 14.14 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిలో 1.14 ఎకరాలను రామయ్య.. సుదా రామయ్యకు విక్రయించాడు. మిగిలిన 13 ఎకరాలకు గాను రెవెన్యూ అధికారులు 12 ఎకరాలకు మాత్రమే పాస్‌పుస్తకాన్ని ఇచ్చారు. మిగిలిన ఎకరం పొలాన్ని మద్దెకుంట శ్రీనివాసరావు అనే పేరుతో రెవెన్యూ అధికారులు పట్టా చేశారు. విచిత్రమేమిటంటే మద్దెకుంట శ్రీనివాసరావు అనేపేరుగల వ్యక్తి ఎవరనేది నేటివరకు రెవెన్యూ అధికారులకు కూడా తెలియదు. మద్దెకుంట శ్రీనివాసరావు అడ్రస్ కోసం రైతు సుంకర రామయ్య సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ కార్యాలయంలో ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు రామయ్యకు ఉన్న 12 ఎకరాల్లో మూడెకరాల పొలాన్ని ఆంధ్రాకు చెందిన ఓ వ్యక్తి కబ్జాచేశాడు. పాస్‌పుస్తకంలో 12 ఎకరాలు కనిపిస్తున్నా.. మోఖాలో 9 ఎకరాలే ఉన్నది. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రామయ్య కుటుంబసభ్యులు ఏడాదికాలంగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల వైఖరితో విసిగివేసారిన రామయ్య కుమారుడు సురేశ్ బుధవారం ఏన్కూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట విషగుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏన్కూరు పోలీసులు సురేశ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రైతు బంధువులు, మిత్రులు ఏన్కూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు రామయ్య మాట్లాడుతూ.. ఏడాది కాలంగా రెవెన్యూ అధికారులు తమ సమస్యల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

మాట్లాడుతున్న టేకులపల్లి సంచార జాతుల సంఘం నాయకులు

పక్కా ఆధారాలున్నా పట్టా ఇస్తలేరు

పెనుబల్లి: భూములకు పక్కా ఆధారాలున్నప్పటికీ తమకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడంలేదని ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన సంచార జాతులు, గంగిరెద్దుల సంఘం జిల్లా అధ్యక్షులు పంకు గోపి, పంకు అంజయ్య, పంకు సత్యం, మాదాసు కృష్ణయ్య, పంకు కృష్ణలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టేకులపల్లి గ్రామంలో ధర్మగంటకు వారు తమ గోడు వెల్లబోసుకున్నారు. భూముల ప్రక్షాళనచేసి కొత్త పాస్‌పుస్తకాల ద్వారా రైతుబంధు పథకం అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినా.. పెనుబల్లి రెవెన్యూ అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా పైసలిస్తేనే పనిచేస్తాం, పైసలిస్తేనే పట్టాలిస్తాం అంటూ పక్కా రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలు ఉన్నప్పటికీ కొత్త పాస్‌పుస్తకాలు అందించేందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టేకులపల్లి రెవెన్యూ అధికారి అదిగో,ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని చెప్పారు. తండ్రి బతికున్నప్పుడు మంజూరైన పాస్‌పుస్తకం తండ్రి మరణానంతరం వారసులకు విరాసత్ చేయడానికి కూడా కష్టపెడుతున్నారన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభంలోనే ముగ్గురు రైతులు అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కనికరించి తమకు పాస్‌పుస్తకాలు మంజూరుచేయాలని కోరారు.

వారసత్వ భూమికి రెక్కలు!

సాగుచేస్తున్న భూమి అక్రమంగా ఇతరులకు బదలాయింపు
రెండెకరాల కోసం రెండేండ్లుగా తిరుగుతున్నా స్పందన లేదు
'ధర్మగంట'ను ఆశ్రయించిన అశ్వారావుపేట మండల రైతు భూలక్ష్మి

రెవెన్యూ అధికారులు ఇచ్చిన పహాణీ చూపుతున్న మహిళారైతు భూలక్ష్మి

అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లికి చెందిన ఎనుముల భూలక్ష్మి మామయ్యకు సర్వేనంబర్లు 64/అ లో 1.20 ఎకరాలు, 65/ఆ లో 2.04 ఎకరాలు.. మొత్తం 3.24 ఎకరాల భూమి ఉన్నది. భర్త ఎనుముల వెంకయ్యతో కలిసి కొన్నేండ్లు పంటలు సాగుచేసుకొంటూ జీవనం సాగించారు. భర్త మృతిచెందిన కొంతకాలానికి పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రావు కూడా చనిపోయారు. దీంతో కోడలు.. అత్తను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. చిన్న కుమారుడు వెంకట్రావు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో భూలక్ష్మి తనకు ఉన్న భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో తన మామ పేరున ఉన్న 2 ఎకరాల భూమిని వారసత్వ పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు వారసత్వ బదలాయింపు చేయకపోవడంతో రైతుబంధు సాయం కోల్పోయారు. వారసత్వ బదలాయింపు చేసి, రైతుబంధు ఇప్పించాలని మొరపెట్టుకుంటున్న ఆమెకు.. రెవెన్యూ అధికారులు మరో అన్యాయంచేశారు. సాగు చేసుకొంటున్న భూమికి రెవెన్యూ అధికారులు ఆమె సమీప బంధువు పేరిట హక్కుపత్రాలు కల్పించి అక్రమంగా వారసత్వం బదలాయించారు. దీంతోపాటు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేశారని తెలుసుకొని బాధితురాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వారసత్వంగా వచ్చిన ఆ భూమి మాత్రమే తనకు జీవనాధారమని, రెవెన్యూ అధికారులు తన వారసత్వంపై సమగ్ర విచారణ జరిపి న్యాయంచేయాలని భూలక్ష్మి కోరుతున్నారు.

ఫిర్యాదుచేస్తే పరిష్కరిస్తాం

అక్రమంగా వారసత్వ భూమిని బంధువు పేరిట బదలాయించిన విషయమై బాధితురాలు మౌఖికంగా ఫిర్యాదుచేశారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- వేమిరెడ్డి రాఘవరెడ్డి, అశ్వారావుపేట తాసిల్దార్

పట్టాభూమిగా మారిన ఇనాం

సేవా భృతికింద నిజాం ఇచ్చిన భూమి కబ్జాదారులకు రిజిస్ట్రేషన్
మ్యుటేషన్ కూడా చేసిన రెవెన్యూ అధికారులు
ముప్పై ఏండ్లుగా తాసిల్ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
భూమిలో అడుగుపెడితే చంపుతామంటూ కబ్జాదారుల బెదిరింపులు
ధర్మగంటను ఆశ్రయించిన నిజామాబాద్ బాధితులు

నిజాం ప్రభుత్వంలో పదవీవిరమణ పొందిన ఉద్యోగికి సేవా భృతి కింద ఇచ్చిన 8.20 ఎకరాల ఇనాం భూమిని రెవెన్యూ అధికారులు పట్టాభూమిగా మార్చేశారు. కబ్జాదారులకు రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు, మ్యుటేషన్ కూడా చేశారు. నిజాం ఇచ్చిన ఇనాం భూమికి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జారీచేసిన అసల్ షేత్వార్, తమవద్ద ఉన్న రికార్డులతో సదరు ఉద్యోగి వారసులు ముప్పై ఏండ్లుగా తాసిల్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మోఖా మీదకు వెళ్తే కబ్జాదారులు చంపేస్తామంటూ బెదిరిస్తున్నారనీ.. రెవెన్యూ అధికారులు వారికే కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో చేసేదిలేక నిజామాబాద్‌కు చెందిన బెంగళూరు నారాయణస్వామి వారసులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్‌కు చెందిన బెంగళూరు నారాయణస్వామి నిజాం ప్రభుత్వంలో గార్డెనర్‌గా, సూపర్‌వైజర్‌గా పనిచేశారు. 1942లో పదవీ విరమణ పొందిన ఆయనకు నిజాం ప్రభుత్వం సేవాభృతి కింద నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ శివారు ప్రాంతంలో సర్వే నంబర్లు 350, 351, 352లలో 8.20 ఎకరాల భూమిని ఇనాంగా ఇచ్చింది. అప్పటినుంచి నారాయణస్వామి అతని కుమారులు శంకర్‌స్వామి, బసవయ్య, మహాదేవ్ ఆ భూమిలో 1970 వరకు పూర్తిస్థాయిలో పంటలు సాగుచేశారు. 1977లో నారాయణస్వామి మరణించారు. 1970 తరువాత ఆ భూమిని బీడుగా ఉంచడంతో కొంతకాలానికి కబ్జాకు గురియింది. విషయం తెలిసిన శంకర్‌స్వామి, బసవయ్య 1987లో మోఖామీదికి వెళ్లగా.. కబ్జాదారులు బెదిరింపులకు పాల్పడ్డారు. న్యాయం కోసం తాసిల్ కార్యాలయానికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు శంకర్‌స్వామి, బసవయ్యపై దాడిచేసి చంపేస్తామంటూ బెదిరించారు. బెదిరింపులు ఎక్కువ కావడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో శంకర్‌స్వామి, బసవయ్య ఉపాధి కోసం 1996లో హైదరాబాద్‌కు వలసవెళ్లారు. తమ భూమిని ఇప్పించాలంటూ తరచూ నిజామాబాద్ కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్లకు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

అసల్ షేత్వార్ జారీచేసిన ఏపీ సర్కారు

కంఠేశ్వర్ శివారులో ఉన్న సర్వే నంబర్లు 350, 351, 352లలో నిజాం ప్రభుత్వం ఇనాంగా ఇచ్చిన 8.20 ఎకరాల భూమిని నారాయణస్వామి సాగుచేసుకొంటున్నారని గుర్తిస్తూ నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అసల్ షేత్వార్ జారీచేసింది. రెవెన్యూ సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉన్నతాధికారులు ఇనాం భూమికి సంబంధించిన అసలు షేత్వార్ పత్రాన్ని అందజేశారు. ఈ భూమిపై కన్నేసిన గౌతంరెడ్డి, రవీందర్‌రెడ్డి అనే వ్యక్తులు ఎలాగైనా తమపేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమమార్గాలను అన్వేషించారు. ముందుగా ఈ భూమిని 1992లో శ్రీరాములుశర్మ పేరిట పట్టాభూమిగా మార్చి తప్పుడు రికార్డు సృష్టించారు. 1992 నుంచి 1997వరకు శ్రీరాములుశర్మ పేరిట పట్టాభూమిగా ఉన్నట్టు రికార్డుల్లో చూపించారు. 1997లో దీనిని రవీందర్‌రెడ్డి, గౌతంరెడ్డి.. శ్రీరాములుశర్మ వారసుల నుంచి అక్రమమార్గంలో జీపీఏ చేయించుకొన్నారు. తర్వాత రికార్డుల్లో ఇది పట్టా మ్యుటేడ్‌గా చూపిస్తున్నది. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు పెద్ద ఎత్తున సొమ్ములు ముట్టజెప్పినట్టు తెలిసింది.

మోఖాపై ఇనాం భూమి.. రికార్డుల్లో పట్టా భూమిగా మార్పిడి

సర్వే నంబర్లు 350, 351, 352లలోని 8.2 ఎకరాల ఇనాం భూమిగా మోఖాపై ఉన్నప్పటికీ కబ్జాదారులు మాత్రం అధికారుల అండదండలతో రికార్డుల్లో పట్టాభూమిగా మార్చారు. ఒకే సర్వే నంబర్లలోని భూమినే ఇనాంగా, పట్టా భూమిగా ఎలా పేర్కొంటారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇనాం భూమిని 1987 వరకు సొంతదారుడి కుటుంబీకులు సాగుచేస్తూ మోఖాలో ఉన్నట్టు రెవెన్యూ రికార్డులు స్పష్టంచేస్తున్నాయి. ఆ తర్వాత నుంచి ఆ భూమిలో పంట సాగుచేసిన దాఖలాలు లేవు.

అక్రమంగా 4.20 ఎకరాలు పట్టా

అధికారులను అడ్డం పెట్టుకొని అక్రమమార్గంలో కబ్జాదారులు ఇనాం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. ఇనాం భూమిని కబ్జాదారులు ఆక్రమించారనే నెపంతో సమీపంలో ఉండే ఎస్సీ కాలనీవాసులు దాదాపు 4.20 ఎకరాల భూమిని శ్మశానం కోసం ఆక్రమించారు. దీనిపై కోర్టులో కేసు కూడా నడుస్తున్నది. మిగిలిన 4 ఎకరాలను రవీందర్‌రెడ్డి, గౌతంరెడ్డి 2015లో తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్టు రికార్డులు పేర్కొంటున్నాయి. ఇనాం భూమి సొంతదారుడి కుటుంబీకులు తీసుకొన్న ఈసీలో 2014 వరకు నిల్‌గా ఉన్నట్టు వచ్చింది. ఆ తర్వాతే కబ్జాదారులు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్టు తెలుస్తున్నది. నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఈ సర్వే నంబర్లలోని కొంత భూమిపోగా.. రూ.13.25 లక్షల చొప్పున నష్ట పరిహారం కూడా కబ్జాదారులే పొందారు.

భూమి ఇప్పించి న్యాయంచేయండి

నిజాం ప్రభుత్వం మా తండ్రి నారాయణస్వామికి ఇచ్చిన 8.20 ఎకరాలను 1987 వరకు సాగుచేశాం. తర్వాత రవీందర్‌రెడ్డి, గౌతంరెడ్డి దౌర్జన్యంగా కబ్జాచేశారు. 2014లో 20 మందితో మాపై దాడి చేయించారు. ఇనాం భూమి ఇచ్చినట్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమికి సంబంధించిన అసల్ శేతువార్ కూడా ఇచ్చింది. మాకు జరిగిన అన్యాయంపై రెండు నెలల కింద ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విన్నవించాం. ఆయన నిజామాబాద్ కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్‌కు కిందిస్థాయి అధికారులకు చెప్పినా.. ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు.

- బెంగళూరు బసవయ్య

32 ఏండ్లుగా తిరుగుతున్నా..

మా తాత పేరిట ఉన్న ఇనాం భూమిని ఇప్పించాలంటూ 30 ఏండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. కబ్జాదారులు భూమిలో అడుగుపెట్టకుండా భయాందోళనకు గురిచేస్తున్నారు. భూమి కోసం ఎన్నేండ్లయినా న్యాయపోరాటం చేసేందుకు మా కుటుంబం సిద్ధంగా ఉన్నది. ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు చొరవ చూపి కబ్జాదారుల నుంచి మా భూమిని మాకు ఇప్పించాలని విజ్ఞప్తిచేస్తున్నాం.

- బెంగళూరు శివకుమార్, నారాయణస్వామి మనుమడు

దరఖాస్తు చేస్తే పరిశీలించి న్యాయం చేస్తాం

ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా నేను ఇక్కడికి బదిలీపై వచ్చా. గతంలో ఏం జరిగిందనే విషయం నాకు తెలియదు. గతంలో ప్రభుత్వ భూమి ఇచ్చినట్టు డాక్యుమెంట్లతో కూడిన దరఖాస్తు ఇస్తే మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా. అనంతరం భూమి కబ్జాకు గురైనట్టు తేలితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచన మేరకు చర్యలు తీసుకుంటా.

- విష్ణుసాగర్, నిజామాబాద్ నార్త్ తాసిల్దార్

PALAMURU UNIVERSITY
MAHABUBNAGAR-509001 (T.S)
Ph.D ADMISSION NOTIFICATION - 2019-20
Applications are invited for the admission into the following Ph.D Programme. The Application Form, Eligibility Criteria and the Rules and Regulations can be downloaded from the University website www.palamuruuniversity.ac.in. Filled-in Application form should reach the office of the Registrar, Palamuru University, Mahabubnagar on or before 22nd July, 2019.
SUBJECTS: CHEMISTRY, MICRO-BIOLOGY, PHYSICS, ENGLISH, TELUGU, POLITICAL SCIENCE, COMMERCE & BUSINESS MANAGEMENT
Date: 15.07.2019 Sd/- Registrar

ప్రభుత్వం తలపెట్టిన నూతన విద్యావిధానంలోని త్రిభాషా సూత్రం విద్యార్థులకు భారం. చిన్న వయస్సులో మూడు భాషలు నేర్చుకోవాలనటం భావ్యం కాదు. అలాగే ఒకే ఉపాధ్యాయుడున్న పాఠశాలలను మూసేస్తారట. అలాగైతే ఆ విద్యార్థులు ఎక్కడికి పోతారు? మొదట ప్రభుత్వం అందరికీ విద్య అందించటానికి ప్రయత్నించాలి.

సూర్య, ప్రముఖ నటుడు

కొంతమంది భావప్రకటనా స్వేచ్ఛ ఉన్నదనే పేర తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల పట్ల ప్రాథమిక జ్ఞానం లేకుండానే మాట్లాడుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

తమిళిసాయి సౌందరరాజన్, బీజేపీ నాయకురాలు తమిళనాడు

చరిత్రలో నేడు

1914

వర్ణ వివక్షకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటాల అనంతరం దక్షిణాఫ్రికా నుంచి పయనమైన మహాత్మా గాంధీ.

1925

హిట్లర్ ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' ప్రచురణ.

1947

భారత్‌కు స్వాతంత్ర్యాన్నిచ్చే చట్టం 'ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్'పై సంతకం చేసిన బ్రిటిష్ రాజు జార్జ్-VI

దశాబ్దకాలంగా పెరుగుతున్న జనాభా పట్ల ఆందోళన వ్యక్తం చేసినవారు ప్రస్తుత జనన రేటును చూసి మరింత ఆందోళన చెందే పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలంగా శిశు జననాల రేటు బాగా పడిపోయింది. అందులో ఆడ శిశువుల జననాలు మితంగా తగ్గిపోయాయి. 2015-17 సంవత్సరాలను తీసుకుంటే వెయ్యిమంది శిశువుల్లో ఆడశిశువుల సంఖ్య 896 మాత్రమే ఉంటున్నది. సామాజిక, ఆరోగ్య భద్రతా కార్యక్రమాలతో జీవితకాలం పెరుగుతున్న నేపథ్యంలో జననాల రేటు తగ్గిపోతే అది మరో సామాజిక సంక్షోభానికి దారితీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కొన్నేండ్లుగా వృద్ధిరేటుతో దూసుకుపోయి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ఎదిగిన చైనా ఈ త్రైమాసికంలో కనిష్ఠ వృద్ధిరేటును చవిచూసిం ది. గత 27 ఏండ్ల కాలంలో అతి కనిష్ఠంగా 6.2 వృద్ధిరేటును మాత్రమే సాధించటం ఇదే తొలిసారి. ఇదంతా ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలు, పెంచిన సుంకాల కారణంగా ఏర్పడింది. చౌకగా అందుబాటులో ఉన్న మానవ శ్రమ, ఆధునిక టెక్నాలజీ సాయంతో ఎగుమతులతో ప్రపంచదేశాలను వణికించిన చైనా ఇప్పుడు ఆర్థిక సంక్షోభ స్థితిని ఎదుర్కొంటున్నది.

ది హిందూ

కుల్‌భూషణ్‌కు ఊరట

పాకిస్థాన్ చెరలో ఉండి, మెడపై ఉరితాడు ఊగిసలాడుతున్న కుల్‌భూషణ్ జాదవ్‌కు అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పుతో ఊరట లభించడం హర్షణీయం. కుల్‌భూషణ్‌కు పడిన శిక్షను తగు రీతిలో సమీక్షించి, పునఃపరిశీలించాలని న్యాయస్థానం ఆదేశించింది. అప్పటివరకు శిక్షను నిలిపివేసింది. కుల్‌భూషణ్‌కు భారత దౌత్యకార్యాలయాన్ని సంప్రదించే హక్కు ఉందని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. పాకిస్థాన్ వియెన్నా ఒడంబడికకు భంగం కలిగించిందని కూడా న్యాయస్థానం తప్పుబట్టింది. కుల్‌భూషణ్‌కు పడిన మరణశిక్షను రద్దుచేసి స్వదేశానికి రానివ్వాలన్న భారత్ విజ్ఞప్తిని న్యాయస్థానం ఆమోదించలేదు. అయినప్పటికీ కుల్‌భూషణ్‌కు ఊరట కల్పిస్తూ వచ్చిన ఈ తీర్పు భారత్ సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. మొత్తం పదహారు మంది న్యాయమూర్తులలో పాకిస్థాన్ మినహా మిగతా అందరూ ఏకాభిప్రాయంతో ఈ తీర్పును వెలువరించారు. అమెరికా, చైనా దేశాలకు చెందిన న్యాయమూర్తులు కూడా భారత్‌కు అనుకూలంగా వ్యవహరించడం గమనార్హం. కుల్‌భూషణ్‌ను పాకిస్థాన్‌లోని సైనిక న్యాయస్థానం విచారించింది. ఈ కేసును విచారించిన సైనికాధికారులకు న్యాయశాస్త్ర పట్టాలేదు. దీనిని బట్టి కులభూషణ్ విచారణ, శిక్ష వేయడం ఏ కోణంలో చూసినా సమర్థనీయం కాదు. కుల్‌భూషణ్ గూఢచారి కనుక భారత దౌత్యకార్యాలయంతో మాట్లాడనిస్తే తాను సేకరించిన రహస్యాలను చేరవేస్తాడనే పాకిస్థాన్ బలహీనమైన వాదన నెగ్గలేదు. యుద్ధ ఖైదీలను కూడా మానవీయంగా చూడాలని అంతర్జాతీయ న్యాయసూత్రాలు చెబుతున్నాయి. అటువంటిది కులభూషణ్ పట్ల పాకిస్థాన్ ఇంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడాన్ని అంతర్జాతీయ సమాజం ఆమోదించడం లేదని న్యాయస్థానం తీర్పుతో స్పష్టమైంది.

కుల్‌భూషణ్‌ను పాకిస్థాన్ 2016 మార్చి మూడవ తేదీన అరెస్టు చేసింది. భారత్ చెబుతున్న వివరాల ప్రకారం– కుల్‌భూషణ్ జాధవ్ నావికాదళాధికారిగా కొంతకాలం పనిచేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత వ్యాపారాలు చేసుకుంటున్నారు. సొంత పనిమీద ఇరాన్‌లోని పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతానికి వెళ్ళారు. ఈ సందర్భంలో పాకిస్థాన్ గూఢచారులు ఆయనను అపహరించుకు వెళ్ళారు. ఆయన గూఢచర్యం చేస్తున్నారని అభియోగం మోపారు. కానీ పాకిస్థాన్ అతడు కచ్చితంగా గూఢచారి అనే వాదిస్తున్నది. పాకిస్థాన్ చెబుతున్నట్టు కుల్‌భూషణ్ గూఢచారి అయినా కాకున్నా, అతడికి న్యాయబద్ధమైన విచారణను పొందే హక్కు ఉన్నది. కానీ సైనిక న్యాయస్థానం ద్వారా విచారణ జరుపడం వల్ల న్యాయం ఎట్లా లభిస్తుంది? కుల్‌భూషణ్‌కు భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించే అవకాశం కల్పించకపోవడం ద్వారా అంతర్జాతీయ న్యాయసూత్రాన్ని ఉల్లంఘించింది. తాజా తీర్పు నేపథ్యంలో పాకిస్థాన్ పౌర న్యాయస్థానం ద్వారా విచారణ జరుపకతప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కానీ పాకిస్థాన్‌లో ప్రభుత్వాన్నే సైన్యం నడుపుతున్నది. స్వతంత్ర న్యాయవ్యవస్థ లేకుండా అణిచివేసింది. మరణశిక్ష రద్దయినా కుల్‌భూషణ్‌ను విడుదల చేయడం అంత సులభం కాదు. ఇప్పటికే పాకిస్థాన్ జైళ్ళలో అనేకమంది భారతీయులు మగ్గుతున్నారు. అందువల్ల ఇటువంటి సమస్యలకు రెండుదేశాల మధ్య సత్సంబంధాలు నెలకొనడం ద్వారానే పరిష్కారం లభిస్తుంది.

పుల్వామా దాడి తర్వాత నెలకొన్న ఉద్రిక్తత క్రమంగా సడలుతున్నదని ఈ చర్చలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కుల్‌భూషణ్ ఉదంతం రెండుదేశాల మధ్య వైషమ్యాలకు దారి తీయకూడదు. కుల్‌భూషణ్‌పై వచ్చిన తీర్పును పాకిస్థాన్ సానుకూల దృక్పథంతో చూడాలి. వైషమ్యాల వల్ల రెండు దేశాలూ నష్టపోతాయి. సార్క్ స్ఫూర్తితో వాణిజ్య సంబంధాలను విస్తరించుకుంటే ఇరుదేశాలూ లాభపడుతాయి. ముందుగా రెండుదేశాల ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందించాలి. పాలకులు, మీడియా వైషమ్యాలు పెంచకుండా సంయమనంతో వ్యవహరించాలి.

భారత్, పాకిస్థాన్ చర్చలు విజయవంతంగా సాగుతున్న దశలో కుల్‌భూషణ్ తీర్పు వచ్చింది. తమ భూభాగం మీదుగా భారత్ విమానాలు ఎగురడానికి పాకిస్థాన్ అనుమతిచ్చింది. ఆ వెంటనే భారత్ కూడా పాకిస్థాన్ విమానాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. దాదాపు నూటా నలభై రోజుల పాటు సాగిన ఈ నిషేధాల వల్ల రెండు దేశాలకు కోట్లాది రూపాయల మేర నష్టం వాటిల్లింది. ఈ ఆంక్షలను ఎత్తివేసుకోవడమే కాకుండా ఇతర రంగాలలోనూ చర్చలు సౌహార్దపూరితంగా సాగుతున్నాయి. కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాను సందర్శించడానికి రోజుకు ఐదు వేల మందిని అనుమతించడానికి పాకిస్థాన్ అంగీకరించింది. ఈ మార్గంలో భారత వ్యతిరేక కార్యకలాపాలను సాగనివ్వబోమని కూడా పాకిస్థాన్ హామీ ఇచ్చింది. భారత్ అభ్యంతరాన్ని గౌరవిస్తూ, కర్తార్‌పూర్ ప్రాజెక్టు కమిటీలో ఖలిస్థాన్ అనుకూలుడిని పాకిస్థాన్ తొలిగించింది. కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారా సందర్శనకు వీలుగా గురుదాస్‌పూర్–అమృత్‌సర్ మార్గాన్ని పాకిస్థాన్ సరిహద్దు వరకు నిర్మించడం వేగంగా సాగుతున్నది. పుల్వామా దాడి తర్వాత నెలకొన్న ఉద్రిక్తత క్రమంగా సడలుతున్నదని ఈ చర్చలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కుల్‌భూషణ్ ఉదంతం రెండుదేశాల మధ్య వైషమ్యాలకు దారి తీయకూడదు. కుల్‌భూషణ్‌పై వచ్చిన తీర్పును పాకిస్థాన్ సానుకూల దృక్పథంతో చూడాలి. వైషమ్యాల వల్ల రెండు దేశాలూ నష్టపోతాయి. సార్క్ స్ఫూర్తితో వాణిజ్య సంబంధాలను విస్తరించుకుంటే ఇరుదేశాలూ లాభపడుతాయి. ముందుగా రెండుదేశాల ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందించాలి. పాలకులు, మీడియా వైషమ్యాలు పెంచకుండా సంయమనంతో వ్యవహరించాలి.

జనగళం

మరమ్మతులు చేయాలె

దేశానికే ఆదర్శంగా నిలిచేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రభుత్వ దవాఖానల్లోని శవాలను తమ స్వస్థలాలకు తరలించేందుకు వీలుగా 'పార్థివ వాహనాల'ను ఏర్పాటుచేసింది. ఇది అభినందనీయం. పేద ప్రజలు తమకు సంబంధించి భౌతికకాయాన్ని తమ ఇంటికి తీసుకెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి కోసం ప్రభుత్వమే ఉచితంగా శవాలను తరలిస్తున్నది. ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నది. కాబట్టి ఈ పథకాన్ని విస్తృతపరుచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే ఉన్న కొన్ని పార్థివ వాహనాల శిథిలావస్థకు చేరుకున్నాయి. కాబట్టి ప్రభుత్వం వాటిపై దృష్టి కేంద్రీకరించి వాటికి మరమ్మతులు చేయాలి.

- బొల్లం సుధాకర్, కాచాపూర్, నిజామాబాద్

అందరికీ నాణ్యమైన విద్య

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని 100 శాతం పెంచేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం 'హాజరు మాసోత్సవం' పేరిట కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించటం హర్షణీయం. దీనికోసం జిల్లా, మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన అవసరం ఉన్నది. పాఠశాలలకు హాజరుకాలేని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేసి వారిలో చైతన్యం కలిగించాలి. అప్పుడే అందరికి నాణ్యమైన విద్య అందుతుంది.

- బొల్లం రమాదేవి, అల్వాల్, హైదరాబాద్

కఠిన చర్యలు తీసుకోవాలె

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందాన వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో చేసేదేం లేక పాఠశాలలపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి ప్రైవేట్ పాఠశాలల పట్ల కఠినంగా వ్యవహరించాలి. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలె.

-పుల్కం సంపత్‌కుమార్, రాములపల్లి, జగిత్యాల జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

టంకశాల అశోక్

ఒక అంతర్రాష్ట్ర సంభ్రమం

ఈ నెల 11న ఆంధ్ర అసెంబ్లీలో కనిపించిన దృశ్యాలను ఒక సంభ్రమం అనాలి. అక్కడ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ రాష్ట్ర అసెంబ్లీ మొదటి సమావేశాలు ఆ రోజునే ఆరంభమయ్యాయి. వారి అసెంబ్లీలో గత ఐదేండ్ల కిందట రాష్ట్ర విభజన ప్రభావం కనిపించింది. ఆ పరిస్థితి ఇప్పుడు సంభ్రమకరమైనరీతిలో మారిపోయింది. కేసీఆర్‌ను జగన్మోహనరెడ్డి పదే పదే పొగుడుతుండగా, చంద్రబాబుకు సమాధానాలు కరువయ్యాయి. ఆంధ్ర ప్రజలు జగన్ మాటలకే చప్పట్లు చరిచారు.

ఆ నాటి అ సెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసార రూపంలో తెలంగాణలో ఎక్కువమంది చూసి ఉండరు. చాలామంది ఆ తర్వాత ఛానల్ వార్తల సమయంలో చూడటమో, పత్రికలలో చదువటమో జరిగి ఉంటుంది. వారికి అది కూడా కొంత సంభ్రమం కలిగించే ఉండాలి. కానీ ప్రత్యక్ష ప్రసారాన్ని పూర్తిగా చూసినవారి సంభ్రమానికి అయితే అవధులు లేకపోయి ఉండాలి. ఇది రెండు రాష్ట్రాలలోనూ జరిగి ఉంటుంది. పరిస్థితి 2014–19 మధ్య ఒకవిధంగా ఉండటానికి, తర్వాత ఈ విధంగా మారటానికి కారణాలు ఏమిటో ఎవరైనా ఊహించగలవే. ఆ వివరాలలోకి వెళ్లేముందు ఈ నెల 11న జరిగిందేమిటో క్లుప్తంగా చెప్పుకుందాము.

తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో జగన్మోహన రెడ్డి పాల్గొనటాన్ని టీడీపీ ఆక్షేపిస్తూ, కాళేశ్వరం వల్ల ఆంధ్ర ప్రాంతం ఎడారిగా మారగలదన్న నాయకుడు, ఆ విషయమై గత అసెంబ్లీలో తీవ్ర విమర్శలు చేసినవాడు, ఇప్పుడు అదే కార్యక్రమంలో పాలుపంచుకోవటం ఏమిటని ప్రశ్నించింది. అందుకు జగన్ ఇచ్చిన సమాధానంలో నాలుగు అంశాలున్నాయి. 1.కాళేశ్వరం నిర్మాణం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగింది. ఆయన దానిని అడ్డుకోలేకపోయారు. ఇప్పుడు జరిగింది బటన్ నొక్కి నీళ్లను వదలటం మాత్రమే. ఆ పనికి తాను వెళ్లలేకపోయినా చేసుకునేవారు. 2.కృష్ణా, గోదావరులకు ఎగువన గల రాష్ట్రాలు అన్నీ తాము కోరుకున్న ప్రాజెక్టులను యథేచ్ఛగా నిర్మించుకుంటున్నాయి. ఆ విధంగా మహారాష్ట్ర, కర్ణాటకలను నిర్మాణం విషయంలోగాని, ప్రాజెక్టుల ఎత్తు పెంపుదలపై గాని ఆపలేకపోయాము. తాము నిరసనలు చెప్పగలం, కేంద్రానికి ఫిర్యాదులు చేయగలం, కోర్టులకు ట్రిబ్యునళ్లకూ పోగలం. అదంతా చేశాము కూడా. కానీ ఏదీ ఆగలేదు. మునుముందు కూడా ఆగే పరిస్థితి లేదు. 3. ఇదే పద్ధతిలో మరొక ఎగువ రాష్ట్రమైన తెలంగాణ కూడా తను కోరుకున్నట్లయితే చేయగలదు. వారిని కూడా ఎట్లనూ ఆపలేము. 4.ఈ రకరకాల చర్యల వల్లనైతేనేమి, వాతావరణ మార్పులతో వర్షపాతాలు తగ్గుతుండటం కారణంగా అయితేనేమీ కృష్ణా, గోదావరులలో నీటి ప్రవాహం దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు గణనీయంగా తగ్గుతున్నది. ఉదాహరణకు కేంద్ర జల సంఘం లెక్కల ప్రకారం కృష్ణ నీరు శ్రీశైలం దిగువకు 1100–1200 టీఎంసీలు వస్తుండేవి. కానీ గత పదేండ్ల సగటు అందులో సగానికి పడిపోయింది. ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం కృష్ణపై ఆల్మట్టి ఎత్తును మరొక అయిదు మీటర్లు (519 నుంచి 524కు) పెంచితే ఇంకా 110 టీఎంసీల నీరు ఆగిపోయే ప్రమాదం ఉన్నది. వీటన్నింటిపై చంద్రబాబు ఆ కాలమంతా చేసింది ఏమిటి?

అందరికీ తెలిసిన ఇటువంటి నేపథ్య వివరాలను పేర్కొన్న జగన్మోహనరెడ్డి, ప్రతిపక్ష తెలుగుదేశం ముందు, తమ రాష్ట్ర ప్రజల ముందు మరొక అయిదు అంశాలతో ఒక కొత్త థియరీని ఆవిష్కరించారు. అవి ఈ విధంగా ఉన్నాయి. 1.వర్తమాన కాలంలో, ముఖ్యంగా ఇటువంటి పరిస్థితులలో, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. కలహాలతో, కేంద్రంతో, ట్రిబ్యునళ్లతో, కోర్టులతో ఏమీ ప్రయోజనం లేదని తేలిపోయింది. మునుముందు కూడా ఉండదు. 2.ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకునే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం తెలంగాణతో, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మైత్రీపూర్వకంగా ఉండదలచుకున్నాం. 3. నీటి విషయమై ఈ సహాయం చేసేందుకు కేసీఆర్ ఓ ఉదారదృష్టితో స్వయంగా ముందుకువచ్చారు. ఒక ముందడుగు వేశారు. గోదావరి నీటిని స్వయంగా తెలంగాణ భూ భాగంలోనే గల పాయింట్ల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వనున్నారు. 4.ఈ ప్రతిపాదిత అనుసంధానాల వల్ల రెండు రాష్ట్రాలకూ ప్రయోజనం కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఇంకా ఎక్కువ. 5.గోదావరిలో నీటిని కలిపే ఉప నదులలో ఆంధ్రప్రదేశ్‌లోని శబరి వాటా 11 శాతం మాత్రమే కాగా, తెలంగాణలోని ప్రాణహిత, ఇంద్రావతి 65 శాతం నీటిని ఇస్తున్నాయి. జగన్ ఇంత విపులంగా చెప్పిన తర్వాత అందుకు ఏమి సమాధానమివ్వాలో తెలియని చంద్రబాబు 'అంతా అయిన వెనుక భవిష్యత్తులో తెలంగాణవారు నీరివ్వమంటే ఏమి చేయగలర'ని ప్రశ్నించారు. అందుకు జగన్ నవ్వారు. నవ్వి, నలభై ఏండ్ల అనుభవం ఉందంటున్న నాయకునికి ఇటువంటి ప్రాజెక్టులు పరస్పర ఒప్పంద రూపంలో జరుగుతాయనే చిన్న విషయం కూడా తెలియదా అని అడిగారు. ఆ నాటి చర్చ మొత్తంలో చంద్రబాబు మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేకపోవటం పలుమార్లు జరిగింది. ఇప్పుడు మరొక్కసారి జరిగింది. ఒప్పందాలపై ఇద్దరు ముఖ్యమంత్రులు, రెండు రాష్ట్రాల అధికారులూ సంతకాలు చేస్తారని చంద్రబాబుకు ఈ సందర్భంగా తెలియజెప్పారు జగన్. ఇదంతా చంద్రబాబు ఆరోపించినట్లు 'వైఖరిలో మార్పు' అనే అనుకుంటే, అందుకు ఖరగ్‌పూర్ ఐఐటీ గ్రాడ్యుయేట్ అయిన ఆర్థికమంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి ముక్తాయింపు ఇస్తూ, 'స్టాండ్స్ ఆర్ డైనమిక్, నాటి స్టాటిక్' (వైఖరులు పరిస్థితిని బట్టి మారుతాయి) అని స్పష్టం చేశారు.

చర్చ సమయంలో ఏపీ ముఖ్యమంత్రి అన్న కొన్ని మాటలను విన్న మీదట ఒక సందేహం బలంగా కలిగింది. కేసీఆర్‌తో సఖ్యగా ఉండితీరుతామని ఆయన పదేపదే అన్నారు. కేసీఆర్‌ది ఔదార్యమని (మేగ్నానిమిటీ అనే ఇంగ్లీష్ పదాన్ని ఉపయోగిస్తూ) అరడజను సార్లు నొక్కిచెప్పారు. స్నేహంగా ఉంటే తప్పేమిటో చెప్పమని అడిగారు. దీనినంతా రాజకీయ దృష్టితో గాక అభివృద్ధి దృష్టితో చూడాలని చంద్రబాబు మొహంలోకి సూటిగా చూస్తూ హితవు చెప్పారు. ఇవన్నీ గమనించినపుడు, పైన చెప్పుకున్నట్లు గత ఐదేండ్ల పాటు అందరూ కలిసి కేసీఆర్‌ను ఉమ్మడిగా నిందించిన సభలోనే జరిగినప్పుడు, ఆంధ్ర ప్రాంత ప్రజలు జగన్ పట్ల నిరసన చూపగలరేమోనన్న సందేహం కలిగింది. కానీ అటువంటిదేమీ లేకపోగా, జగన్ వైఖరి పట్ల అంతటా మద్దతు ఉన్నట్లు, చంద్రబాబుకు సమర్థన ఏమీ లేనట్లు విశాఖ పట్నం నుంచి విజయవాడ మీదుగా అనంతపురం వరకు జరిపిన విచారణలు స్పష్టం చేశాయి. కేసీఆర్, జగన్ సత్సంబంధాల పట్ల ఈ వైఖరులు ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందునుంచి ఉన్నవని తెలిసిందే. అప్పుడు కూడా ఈ కారణాన్ని చూపి జగన్ పట్ల వ్యతిరేకతను పెంచేందుకు చంద్రబాబు విఫలయత్నం చేశారు. కేసీఆర్‌తో తన సత్సంబంధాల గురించి జగన్ అప్పుడే బాహాటంగా ప్రకటించారు. ఈ విధమైన అంతర్రాష్ట్ర సహకార దృష్టి చంద్రబాబుకు గత ఐదేండ్లలో ఉండి ఉంటే రెండు రాష్ట్రాలకు చాలా మేలు జరిగేది.

ఇటువంటి నేపథ్యం తనకు ఉండి కూడా గత గురువారం నాడు జగన్మోహనరెడ్డి సాక్షాత్తూ అసెంబ్లీలోనే కేసీఆర్‌ను పదేపదే ప్రశంసించటం నిజంగానే సంభ్రమాన్ని కలిగించింది. అయితే దీనంతటికి మూలం పరస్పర సహకారం ద్వారా అభివృద్ధి సాధన అనే దానిలో ఉందని మనం గ్రహించాలి. 'కలిసి నడుద్దాం' అని వారిరువురు జూన్ 28న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన ప్రకటనలో, ప్రగతిభవన్ గడపను ఉభయులూ ఒకేమారు కుడికాలును ముందుకువేసి దాటటంతో, తమకు ఇక కలిసికట్టుగా అభివృద్ధి లక్ష్యాలు తప్ప భేషజాలు లేవని ప్రకటించటంలో, ఆనాటి సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులకు ఇచ్చిన ఆదేశాలలో, అప్పటినుంచి అధికారుల స్థాయి చర్చలు నిర్విరామంగా సాగుతున్న తీరులో ఉన్నది. నాయకత్వ దార్శనికతలు కన్పించేది ఈ విధంగానే. అది చంద్రబాబుకు లేకపోయింది. ఈ నేపథ్యాలు అన్నింటిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఆ తీరున సాగటం, అందుకు అక్కడి ప్రజల మద్దతు ఫెడరలిజానికి కొత్త భాష్యాలను చెప్పింది. ఫెడరలిజం ఒక రాజకీయ పరిభాష అనే అపోహలు కొందరికి ఉన్నాయి. కానీ రకరకాల ఫెడరలిజం మాటలన్నీ అంతిమంగా అభివృద్ధి సాధనలు, వాటి ఫలితాలు ప్రజలకు చేరటానికి సంబంధించినవే. కేసీఆర్, జగన్‌లది అటువంటి ఫెడరల్ సఖ్యతే.

> గోదావరిలో నీటిని కలిపే ఉప నదులలో ఆంధ్రప్రదేశ్‌లో ని శబరి వాటా 11 శాతం మాత్రమే కాగా, తెలంగాణలోని ప్రాణహిత, ఇంద్రావతి 65 శాతం నీటిని ఇస్తున్నాయి. జగన్ ఇంత విపులంగా చెప్పిన తర్వాత అందుకు ఏమి సమాధానమివ్వాలో తెలియని చంద్రబాబు 'అంతా అయిన వెనుక భవిష్యత్తులో తెలంగాణవారు నీరివ్వమంటే ఏమి చేయగలర'ని ప్రశ్నించారు. అందుకు జగన్ నవ్వారు.

కొత్త నిబంధనలతో కరంట్ కష్టాలు

జాతీయం

గటిక విజయకుమార్

దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు, అన్నివేళలా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా జరుగాలనే సమున్నత ఆశయంపై కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన కఠినతరమైన నిబంధనలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్యుత్ సంస్థల్లో క్రమశిక్షణ తీసుకురావాలనే లక్ష్యంతోనే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని కేంద్రం సమర్థించుకుంటున్నది. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా పనిచేసే పంపిణీ వ్యవస్థలు, తాజా నిబంధనల ఫలితంగా ఎంత అవసరమైతే అంత కరంట్‌ను సమకూర్చుకోవడం తేలికకాదు అని రాష్ట్రాలు ఆందోళనగా ఉన్నాయి. విద్యుచ్ఛక్తి అనేది ఉమ్మడి జాబితాలోని అంశమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం అధీనంలోనే కీలక సంస్థలుండటంతో రాష్ట్రాలది నామమాత్ర పాత్రే అవుతుంది. కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలను అమలుచేయడమో, లేదంటే తమ రాష్ట్రాలను గాడాంధకారంలో ఉంచడమో తప్ప రాష్ట్రాలకు మరో మార్గం లేదు.

విద్యుత్ ఉత్పత్తి–సరఫరా–పంపిణీ సంస్థల్లో పారదర్శకత, క్రమశిక్షణ తేవడమనే ప్రధాన లక్ష్యంతో పాటు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు (డిస్కమ్స్) నష్టాల ఊబిలో కూరుకుపోకుండా చూడటానికంటూ కేంద్ర విద్యుత్‌శాఖ కొద్ది రోజుల కిందట కీలక ఉత్తర్వులు జారీచేసింది. అందులో ప్రధానమైనది కొనబోయే కరంట్‌కు సంబంధించి ఒక నెల ముందే బ్యాంకుల ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.సి.) ఇవ్వాలనే నిబంధన. అంటే తమ డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్తును సమకూర్చుకోవడానికి అడ్వాన్స్ చెక్ ఇవ్వడమన్నమాట. ఈ నిబంధన పెట్టడానికి కేంద్రం కొన్ని కారణాలు చెబుతున్నది. అందులో ప్రధానమైనది డిస్కమ్‌లలో ఆర్థిక క్రమశిక్షణ తేవడం. అంటే తమ వద్ద ఆ నెలకు ఎంత డబ్బుంటే అంత కరంట్ మాత్రమే కొనాలి. డిమాండ్ ఎక్కువున్నప్పటికీ, కావాల్సిన కరంట్ ఇవ్వడానికి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు సిద్ధంగా ఉన్నటిప్పటికీ, ఎల్.సి.లు సమర్పించకుంటే కరెంటు సరఫరా జరుగదు. ఎల్.సి.లు ఇవ్వని డిస్కమ్‌లకు కరంట్ సరఫరా చేయవద్దని సదరన్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు, నార్తర్న్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. ఆగస్టు 1 నుంచే ఈ నిబంధన అమల్లోకి వస్తుంది.

డిస్కమ్‌లు ప్రభుత్వ, ప్రైవేట్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తాయి. ఆ తర్వాత మాత్రమే బిల్లులు వసూలు చేస్తాయి. రైతులు, ఇతర వర్గాల కోసం అందించే సబ్సిడీలకు సంబంధించిన డబ్బులు కూడా ప్రభుత్వం నుంచి అందిన తర్వాతే డిస్కమ్‌లు ఆయా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లిస్తాయి. వినియోగదారులైనా, ప్రభుత్వమైనా తమ ఆర్థిక వెసులుబాటును బట్టి బిల్లులు చెల్లిస్తాయి. ప్రభుత్వం కూడా ప్రజల నుంచి వచ్చిన పన్నుల ద్వారానే సబ్సిడీ మొత్తాన్ని అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి ప్రతీ నెలా సమానంగా ఆదాయం రాదు. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఎక్కువ ఆదాయం వస్తుంది. మొదటి త్రైమాసికంలో తక్కువ ఆదాయం వస్తుంది. దాని ప్రకారమే ప్రభుత్వం ఇతర సంస్థలకు చేయాల్సిన చెల్లింపులు చేస్తుంది. తమకు డబ్బులు సమకూరే స్థితిని బట్టే డిస్కమ్‌లు కూడా ఉత్పత్తి సంస్థలతో కుదుర్చుకున్న పీపీఏలకు అనుగుణంగా చెల్లింపులు చేస్తాయి. ఇదే విధానం దేశంలోని 29 రాష్ట్రాల్లో ఇప్పటివరకు అమలవుతూ వస్తున్నది. కానీ కేంద్రం తాజాగా పెట్టిన షరతు ప్రకారం వచ్చే నెలలో ఎంత కరంట్ కొంటామో అంచనా వేసుకొని, అంతకు సరిపడా ఎల్.సి.లు సమర్పించాలి. ఇది డిస్కమ్‌లకు సాధ్యం కాదు. డిస్కమ్‌లకు ఎల్.సి.లు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకురాకపోవచ్చు. దీంతో డిస్కమ

చంద్రగ్రహణం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత కన్పించిన దృశ్యాలు. - ఫొటోలు : గుజ్జ నరేశ్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా

బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు, సంప్రోక్షణ అనంతరం రాజన్న ఆలయం ప్రధాన ద్వారం తెరుస్తున్న ఆలయ అర్చకులు

చంద్రగ్రహణం నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ఆలయాలను మంగళవారం సాయంత్రం మూసివేయగా.. బుధవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం తెరిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం బుధవారం ఉదయం 4.32 గంటలకు ఆలయస్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని, భద్రాద్రి రామయ్య ఆలయాన్ని బుధవారం ఉదయం ఆలయ అర్చకుల సమక్షంలో తెరిచారు.

పార్టీ మార్పు వార్తలు అవాస్తవం

- 100 శాతం కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తా
- మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: తాను బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొందరు తన ప్రతిష్ఠను మసకబార్చేందుకు సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతూ ప్రజలే కేంద్రబిందువుగా భావిస్తానన్నారు. తాను పూటకోమార్టీ మారబోనని స్పష్టం చేశారు.

హన్మకొండలో కార్మిక సంఘం నాయకులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండలో చిట్‌ఫండ్ సిబ్బందికి సభ్యత్వాన్ని అందజేస్తున్న వరంగల్ నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు

ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో కార్యకర్తలకు టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

టీఆర్ఎస్ సభ్యత్వాల దూకుడు

జోరుగా సాగుతున్న నమోదు ప్రక్రియ ▪ స్వచ్ఛందంగా చేరుతున్న ప్రజలు

మంత్రి మల్లారెడ్డికి పూర్తిచేసిన సభ్యత్వ పుస్తకాలను అందజేస్తున్న మేడ్చల్ జిల్లా పిర్జాదిగూడ టీఆర్ఎస్ నాయకుడు జక్క వెంకట్‌రెడ్డి

సూర్యాపేట జిల్లా నడిగూడెంలో టీఆర్ఎస్ సభ్యత్వాలు అందజేస్తున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం లక్ష్యాన్నిమించి దూసుకెళ్తున్నది. పల్లెలు పట్టణాలు అన్న తేడా లేకుండా అన్నిప్రాంతాల్లో జోరుగా సాగుతున్నది. టీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామాల్లో ప్రజలు మూకుమ్మడిగా పార్టీలో చేరుతుండగా, యువత స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరిస్తున్నారు. బుధవారం పలుజిల్లాల్లో ఎమ్మెల్యేలు, కార్యక్రమ ఇంచార్జులు సభ్యత్వాలు అందజేశారు. సభ్యత్వ నమోదులో మేడ్చల్ నియోజకవర్గం నిర్దేశించుకొన్న లక్ష్యాన్ని చేరుకుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని జవహర్‌నగర్, బోడుప్పల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపాల్టీకి చెందిన టీఆర్ఎస్ జిల్లా నాయకుడు జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టి పూర్తిచేసిన 4,500 సభ్యత్వాలకు చెందిన పుస్తకాలు, డబ్బులను బుధవారం మంత్రికి అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల్లో నాయకులు పలువురికి సభ్యత్వాలను అందజేశారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం వెంకట్రావ్ సభ్యత్వాలు అందజేశారు. ఇల్లెం దు, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నా యక్ గ్రామాల్లో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మం రూరల్, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు మండలాల్లో టీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో సభ్యత్వాలను అందిస్తున్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం, చిలుకూరులో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పలువురికి టీఆర్ఎస్ సభ్యత్వాలు అందజేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సభ్యత్వాలు అందజేశారు. హన్మకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కాకతీయ ఆల్‌షాప్స్ యూనియన్ కార్మికులకు సభ్యత్వాలు అందించారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు భోగి సురేశ్, యూనియన్ అధ్యక్షుడు నాగబోయిన బాబురావు తదితరులు పాల్గొన్నారు. హన్మకొండలో వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావు భువన, సూర్య డెవలపర్స్, భవితశ్రీ చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, సిబ్బందికి సభ్యత్వాలను అందజేశారు. సభ్యత్వాల నమోదు ఇంచార్జి శ్రీరాం రాజేశ్, భవితశ్రీ చిట్‌ఫండ్ ఎండీ తాటిపెల్లి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొమురవెల్లి, నాగరాజు, టీఆర్ఎస్ నాయకులు దాచేపల్లి సీతారాం, నారాయణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ జెన్కో డైరెక్టర్ (సివిల్) అజయ్

సకాలంలో బీటీపీఎస్ నిర్మాణం పూర్తవ్వాలి

- జెన్కో డైరెక్టర్ (సివిల్) అజయ్

మణుగూరు, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణ పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలని టీఎస్ జెన్కో డైరెక్టర్ (సివిల్) అజయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్లాంటు పనులను పరిశీలించారు. అనంతరం బీహెచ్ఈఎల్ కార్యాలయంలో భేల్, జెన్కో అధికారులు, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అన్ని రకాల పనులు షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలనీ, యూనిట్-1లో సింక్రనైజేషన్, 2, 3 యూనిట్లలో లైటప్ పనులు పూర్తి చేయాలన్నారు.

వరంగల్ అర్బన్ జిల్లా ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకును బుధవారం ఆఫ్రికా ఖండం కెమెరూన్, మోజాంబిక్, బెనిన్, ఇథియోపియా దేశాల నుంచి 14 మందితో కూడిన బృందం సభ్యులు సందర్శించారు.బ్యాంకు పరిధిలోని పెట్రోల్‌పంపు, సూపర్‌బజార్, జిన్నింగ్‌మిల్లు, రైస్‌మిల్లు, విత్తనశుద్ధి కర్మాగారాన్ని పరిశీలించారు. - భీమదేవరపల్లి

మరో సాహస యాత్రకు తుకారాం

ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన తుకారాం (ఫైల్)

- 18,510 ఫీట్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతారోహణకు రెడీ
- నేడు రష్యాకు పయనం

యాచారం: మారుమూల తండాకు చెందిన గిరిజన యువకుడు పర్వతారోహణలో అంతర్జాతీయస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. చదువు, క్రీడలతోపాటుగా పర్వతారోహణలో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. ఇప్పటికే కిలిమంజారో, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన అతడు ఎల్బ్రస్ పర్వత శిఖరానికి చేరడానికి సిద్ధమయ్యాడు. అతడే రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం తక్కళ్లపల్లి తండాకు చెందిన ఆంగోతు తుకారాం. 18,510 ఫీట్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించడానికి తుకారాం కొంతమంది దాతల సహకారంతో గురువారం రష్యాకు బయలు దేరుతున్నాడు. తుకారాం అతి పిన్న వయస్సులో (21 ఏండ్లు) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాడు. 2016 జూన్ 2న హిమాచల్‌ప్రదేశ్‌లోని నార్బూ (17,145 ఫీట్లు) పర్వతాన్ని అధిరోహించిన 25 మంది సభ్యుల్లో మొదటి స్థానాన్ని సాధించి బెస్టు మౌంటనీర్‌గా గుర్తింపు పొందాడు. 2017 జూన్ 2న ఉత్తరాఖండ్‌లోని రుదుగైరా (19,091ఫీట్లు) పర్వతాన్ని ఎక్కి హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు సంపాదించాడు. 2017 జూలైలో స్టాక్ కాంగ్రీ (20,187 ఫీట్లు) పర్వతం, 2018 జూలైలో దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో (19, 340 ఫీట్లు) పర్వతాన్ని తుకారాం అధిరోహించాడు.

తెలంగాణ పథకాలు భేష్

- జలశక్తి అభియాన్ కేంద్ర బృందం ప్రశంస

మల్యాల: దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యుడు విపిన్ చంద్ర పేర్కొన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవం పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్‌లో నిర్మిస్తున్న రివర్స్ పంప్‌హౌస్ పనులను బుధవారం కేంద్ర బృందం సభ్యులు కలెక్టర్ శరత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ వివరాలు, డిజైన్లను అధికారులు బృందం సభ్యులకు వివరించారు. భవిష్యత్తులో జరిగేవి నీటి యుద్ధాలేననీ, తెలంగాణలో ఆ పరిస్థితులు తలెత్తకుండా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో జలశక్తి అభియాన్ విజయవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు కార్తీకేయన్, దశరథ ప్రసాద్, డీఆర్డీవో పీడీ భిక్షపతి, జిల్లా ఇరిగేషన్ అధికారి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా రాంపూర్ పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నర్సాపురం, రాజాపేట, బొందుగుల గ్రామాల్లో జలశక్తి అభియాన్ కేంద్రబృందం సభ్యులు అవినాశ్‌మిశ్రా, మనీశ్‌కుమార్ సందర్శించారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన ఖండిత కందకాలు, పారం పాండ్స్, చెక్‌డ్యాంలు, నర్సరీలను పరిశీలించారు. వీరి వెంట కలెక్టర్ అనితారాంచందర్, తదితరులున్నారు.

సీఎం దత్తత గ్రామాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

చిగురుమామిడి : సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండ లం చిన్న ముల్కనూర్‌ను జలశక్తి అభియాన్ కేం ద్ర బృందం బుధవారం సందర్శించింది. డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. సీఎం కేసీఆర్ వందేండ్ల అభివృద్ధిని చేపట్టారని గ్రామస్థులు కేంద్రబృందానికి వివరించారు.

కేటీఆర్ సెక్రటరీనంటూ బెదిరింపులు

- ఓ భూవివాదం కేసులో అపరిచితుడి వరుస కాల్స్
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

సిరిసిల్లక్రైం: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెక్రటరీనంటూ హైదరాబాద్‌కు చెందిన గుర్తుతెలియని వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన ఆల సదానందరెడ్డికి ఫోన్‌చేస్తూ బెదిరించగా, బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. చంద్రంపేటకు చెందిన సదానందరెడ్డికి చెందిన ఇంటిస్థలం అదే గ్రామానికి చెందిన బాషబోయిన మల్లేశం కబ్జా చేశాడు. తన స్థలం కబ్జా చేశాడని సదానందరెడ్డి కోర్టును ఆశ్రయించగా, ఏడాదిగా కేసు నడుస్తున్నది. కోర్టు కేసును వాపస్ తీసుకోవాలని.. లేకుంటే అంతుచూస్తామని హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి 9885280000 నంబర్ నుంచి 14, 15 తేదీల్లో కేటీఆర్ సెక్రటరీనంటూ ఫోన్ చేస్తున్నాడు. ఇదంతా మల్లేశం చేస్తున్నట్టు బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుపాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిరిసిల్ల సీఐ శ్రీనివాసచౌదరిని ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు మల్లేశం, అతడి తండ్రి సత్తయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేశారు. ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డ రామన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని ఖైదీ ఆత్మహత్య

నిజామాబాద్ క్రైం : నిజామాబాద్ జిల్లా కేంద్ర కారాగారంలో జీవితఖైదు అనుభవిస్తున్న వెంకటి (62) అనే ఖైదీ మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా ఆర్గొండకు చెందిన వెంకటి కుటుంబ కలహాలతో 2017లో తన మనవడు దేవేందర్‌స్వామి(12)ని హతమార్చాడు. నేరం రుజువుకావడంతో కామారెడ్డి జిల్లా జడ్జి వెంకటికి జీవితఖైదు విధిస్తూ ఈ నెల 9న తీర్పు వెలువరించారు. అదేరోజు వెంకటిని నిజామాబాద్ జైలుకు తరలించారు. వారం రోజులుగా జైలులో ఉన్న వెంకటి మంగళవారం సాయంత్రం జైలులోని బాత్‌రూమ్‌లో టవల్‌తో ఉరేసుకొన్నాడు.

తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

కొనసాగుతున్న చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 200 మంది టీఆర్ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని 15వ వార్డుకు చెందిన 150 మంది ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో, సూర్యాపేట జిల్లా కోదాడలో కాంగ్రెస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ శ్రీనుతోపాటు పలువురు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

పలు జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

రాష్ట్రంలో నేటినుంచి విస్తారంగా వర్షాలు ▪ హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పాలమూరు, నారాయణపేట, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంతోపాటు జడ్చర్లలో గంటపాటుకురిసిన వర్షానికి రోడ్లపై నీళ్లు నిలిచాయి. జిల్లాలో 1.6 మి.మీ. వర్షం కురవగా, నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలోని చందంపేట, కొండమల్లేపల్లి మండలాల్లో వర్షం పడింది. చందంపేట మండలంలోని కాట్రావత్ తండా, గాగిళ్ళాపురం, పోలేపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా వికారాబాద్, కోట్‌పల్లి, మోమిన్‌పేట మండలాల్లో వర్షం జోరుగా కురిసింది. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి, నాసన్‌పల్లికి చెందిన వాగుల్లో నీరు ప్రవహించింది. మోమిన్‌పేట్ 5.04 మిల్లీమీటర్లు, వికారాబాద్ 6 మి.మీ, పూడూర్ 9.08 మి.మీ, ధారూర్ 14.06మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, రాష్ట్రంలో గురువారం నుంచి విస్తారంగా వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం మీదుగా అనుకూల పవనాలు వీస్తున్నాయని, గాలిలో తేమశాతం పెరిగినందున రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని తెలిపారు.

బుధవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి చెరువులోకి చేరుతున్న నీరు

మహబూబ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో కురుస్తున్న వర్షం

స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో : రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మంగళవారం నగరంలో పలుచోట్ల వర్షాలు కురువగా, బుధవారం గాలిలో తేమ తగ్గి గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 57 శాతంగా నమోదైందని తెలిపారు.

ఎదురుగడ్డలో క్షుద్రపూజలు

- గ్రామస్థులను భయపెట్టాలని ఆకతాయిల ఆగడాలు
- నలుగురిపై కేసు నమోదు

లక్ష్మీదేవిపల్లి: ప్రజలను భయపెట్టేందుకు కొందరు ఆకతాయిలు ఇళ్ల ముందు క్షుద్రపూజలు చేసిన ఘటన బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కొందరు యువకులు గ్రామస్థులను భయపెట్టేందుకు క్షుద్రపూజల పేరుతో సోమవారం అర్ధరాత్రి సర్పంచ్‌తో పాటు మరికొందరి ఇళ్ల ముందు పసుపు, కుంకుమ, కోడి, ఇతర సామగ్రి ఉంచారు. భయాందోళనకు గురైన ఇండ్ల యజమానులు మంగళవారం లక్ష్మీదేవిపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగంలోకి దిగి గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా బుధవారం క్షుద్రపూజలు చేసిన ఇస్లావత్ గణేష్, బాదావత్ దర్రు, కల్యాణ్, యాకయ్యను గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

భారత్‌కు ఇజ్రాయెల్ క్షిపణులు

జెరూసలేం, జూలై 17: భారత్‌కు ఐదు కోట్ల డాలర్ల విలువైన నౌకాదళ అనుబంధ మధ్యశ్రేణి ఉపరితల క్షిపణి వ్యవస్థలను (నావల్ ఎంఆర్ఎస్ఏఎం వ్యవస్థలు) సరఫరా చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ మేరకు రెండు దేశాలు ఒప్పందంపై సంతకాలు చేశాయని ఇజ్రాయెల్ ప్రభుత్వ రంగ సంస్థ 'ఇజ్రాయెల్ ఎరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ)' బుధవారం తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం భారత గగనతల రక్షణ వ్యవస్థకు అనుబంధ వ్యవస్థలను ఐఏఐ అందజేస్తుంది. ఈ ఒప్పందం తమకు మైలురాయి వంటిదని ఐఏఐ సిస్టమ్స్, మిస్సైల్స్ అండ్ స్పేస్ గ్రూప్ జనరల్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బోయజ్ లెవీ తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్యే ప్రణవ్ సింగ్‌పై ఆరేండ్ల సస్పెన్షన్

తుపాకులు ధరించి డ్యాన్స్ చేసినందుకు చర్యలు

న్యూఢిల్లీ, జూలై 17: పార్టీ నియమావళికి వ్యతిరేకంగా తుపాకులు ధరించి డ్యాన్స్ చేసిన ఉత్తరాఖండ్‌కు చెందిన ఎమ్మెల్యే ప్రణవ్ సింగ్ ఛాంపియన్‌ను బీజేపీ ఆరేండ్లపాటు సస్పెండ్ చేసింది. ఇటీవల జరిగిన ఓ దావత్ సందర్భంగా ప్రణవ్ సింగ్ రెండు చేతులకు తుపాకులు ధరించి డ్యాన్స్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన బీజేపీ వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి ప్రణవ్ సింగ్ ఇచ్చిన సమాధానానికి సంతృప్తి చెందని బీజేపీ క్రమశిక్షణ కమిటీ ఆయనను పార్టీ నుంచి ఆరేండ్ల పాటు సస్పెండ్ చేసింది. బీజేపీ మీడియా విభాగం అధ్యక్షుడు అనిల్ బలౌని మాట్లాడుతూ ప్రణవ్‌సింగ్ వ్యవహార శైలి సరిగా లేదని, అందుకే ఆయనను సస్పెండ్ చేశామని చెప్పారు. ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు అజయ్ భట్ స్పందిస్తూ 'పార్టీలో క్రమశిక్షణ అనేది చాలా కీలకం. దీన్ని ఉల్లంఘిస్తే అస్సలు సహించేది లేదు' తెలిపారు. పార్టీ క్రమశిక్షణ నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు ఇంతకు ముందే ప్రణవ్ సింగ్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేశామని, తాజాగా ఆరేండ్లపాటు సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

యూట్యూబ్ వీడియోలు చూడొద్దన్న తల్లి..

ఇంట్లోంచి పారిపోయిన కొడుకు.. దుబాయ్‌లో ఘటన

దుబాయ్: యూట్యూబ్ వీడియోలను ఫోన్‌లో అర్ధరాత్రుళ్ల వరకు చూడటం వద్దని తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్ళిపోయాడు ఓ 15 ఏండ్ల బాలుడు. దుబాయ్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నది. భారత సంతతికి చెందిన మహ్మద్ ఆఫ్తాబ్ అలమ్ తన భార్య, కుమారుడు మహ్మద్ పర్వేజ్‌తో షార్జాలో నివసిస్తున్నాడు. అర్ధరాత్రుళ్లు ఫోన్‌లో యూట్యూబ్ వీడియోలు చూడొద్దని తల్లి మందలించి బాలుడి నుంచి ఫోన్ తీసుకోవడంతో పర్వేజ్ జూలై 4న ఇంట్లోంచి వెళ్లిపోయాడు. దీంతో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఇంటి నుంచి వెళ్ళిపోయిన పర్వేజ్ ఫోటోలు, వివరాలను పోలీసులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. బాలుడి ఆచూకీ కనిపెట్టడంలో సాయం చేయాల్సిందిగా ప్రజల్ని కోరారు. 'ఈ మధ్య మాతో ఉమ్రా యాత్రకు వచ్చిన స్నేహితులు, బంధువులను అందర్నీ అడిగాం. ఎవరూ పర్వేజ్‌ను చూడలేదని అంటున్నారు' అని అలమ్ తెలిపారు. బాలుడి ఆచూకీ కోసం దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్ సాయాన్ని కూడా కోరినట్టు ఆయన తెలిపారు. 'ఇంట్లోంచి వెళ్లేప్పుడు పర్వేజ్ కందురా(ముస్లింలు ధరించే వస్త్రం) మాత్రమే ధరించాడు. అతని వాలెట్, ఫోన్, ఐడెంటిటీ పత్రాలు అన్ని ఇంట్లోనే ఉన్నాయి' అని అలమ్ మేనల్లుడు తబ్రేజ్ పేర్కొన్నారు.

భూవివాదంలో 9 మంది బలి

గ్రామస్థులపై కాల్పులకు తెగబడ్డ సర్పంచ్ అనుచరులు

19 మందికి గాయాలు..

యూపీలో దారుణం

కాల్పుల్లో గాయపడినవారిని అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

సోన్‌భద్ర (యూపీ), జూలై 17: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. భూవివాదం తొమ్మిది మంది ప్రాణాల్ని తీసింది. మృతిచెందిన వారిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. బుధవారం జరిగిన ఈ ఘటనలో మరో 19 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. సోన్‌భద్ర జిల్లాలోని ఘోరావల్ ప్రాంతంలో సాపాహి గ్రామ సర్పంచ్ యజ్ఞదత్ 90 బిగాలు (36 ఎకరాలు) వ్యవసాయ భూమిని రెండేండ్ల క్రితం ఓ ఐఏఎస్ అధికారి నుంచి కొనుగోలు చేశాడు. గత కొంతకాలంగా ఈ భూమిపై వివాదం నడుస్తున్నది. ఈ క్రమంలో బుధవారం నాడు సదరు భూమిని స్వాధీనం చేసుకునేందుకు యజ్ఞదత్ తన అనుచరులతో ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో యజ్ఞదత్ అనుచరులు గ్రామస్థులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో తొమ్మిది మంది అక్కడికక్కడే మరణించగా.. 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప దవాఖానల్లో చేర్పించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు కారణమైన యజ్ఞదత్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే, భూమిని జప్తు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. 'మధ్యప్రదేశ్ పోలీసులను కూడా అలర్ట్ చేశాం. అవసరమైతే, భూమిని అమ్మిన ఐఏఎస్‌పై కూడా చర్యలు తీసుకుంటాం' అని యూపీ డీజీపీ ఓ పీ సింగ్ తెలిపారు. యజ్ఞదత్ మేనల్లుళ్లు గిరిజేశ్, విమలేశ్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సదుపాయం అందించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ జిల్లా కలెక్టర్ అంకిత్ కుమార్ అగర్వాల్‌ను ఆదేశించారు. కేసును వ్యక్తిగతంగా పర్యవేక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని సీఎం ఆదేశించినట్టు ఓ ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. ఘటనకు గల కారణాలు తెలుసుకోవడంతో పాటు 24 గంటల్లో నిందితులపై చర్యలు తీసుకోవాలని మీర్జాపూర్ కమిషనర్, వారణాసి జోన్ అదనపు డైరెక్టర్ జనరల్‌ను కూడా ఆదిత్యనాథ్ ఆదేశించారు.

కేంద్రంలో బీసీ ఉద్యోగులు 21%

నిర్దేశిత కోటా కంటే ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఎక్కువ

ఉపాధి హామీని కొనసాగించబోం: వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ • ఎన్ఐఏ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 17: దేశ జనాభాలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నా కేంద్ర ప్రభుత్వోద్యోగాల్లో కేవలం 21 శాతానికే పరిమితమయ్యారు. సాక్షాత్తు కేంద్ర మంత్రే ఈ సంగతి చెప్పారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఒక రాతపూర్వక ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వశాఖల్లో ఓబీసీలు తమ నిర్దేశిత కోటా కంటే తక్కువ మంది పని చేస్తున్నారని చెప్పారు. 2012 జనవరి ఒకటో తేదీ నాటికి కేంద్ర ప్రభుత్వశాఖల్లో ఓబీసీ ఉద్యోగుల సంఖ్య 16.55%కాగా, 2016 జనవరి ఒకటో తేదీ నాటికి ఆ సంఖ్య 21.57 శాతానికి పెరిగిందన్నారు. ఓబీసీ ఉద్యోగులు 1993 సెప్టెంబర్ నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నిర్దిష్ట కోటా కంటే ఎక్కువే పనిచేస్తున్నారని జితేంద్ర సింగ్ చెప్పారు. 78 మంత్రిత్వ శాఖలిచ్చిన సమాచా రం ప్రకారం ఎస్సీలు 17.49%, ఎస్టీలు 8.47%, ఓబీసీలు 21.57 % మంది పని చేస్తున్నారన్నారు. ఎస్సీలకు నిర్దేశిత రిజర్వేషన్లు 15, ఎస్టీలకు 7.5 శాతమే కావడం గమనార్హం. దేశంలోని ఉగ్రదాడులపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పరిధిని విస్తరిస్తూ విదేశాల్లోని భారతీయులు, భారతీయుల ఆస్తులపై ఉగ్ర నేరాల దర్యాప్తునకు అనుమతి నిస్తూ నిబంధనలు కఠినతరం చేసిన బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చకు హోం మంత్రి అమిత్‌షా జవాబిస్తూ చట్టాన్ని దుర్వినియోగం కానివ్వబోమన్నారు. ఎన్ఐఏ పటిష్ఠాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పై మండిపడ్డారు. మంత్రి వివరణ తర్వాత బిల్లును రాజ్యసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉగ్రవాద కేసుల దర్యాప్తులో రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవాలని, సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి విఘాతం కలుగనివ్వొద్దని విపక్ష సభ్యులు చెప్పా రు. కాగా, దేశవ్యాప్తంగా నివాసం ఉంటున్న అక్రమ వలసదారులను గుర్తించి వారి దేశానికి పంపివేస్తామని అమిత్‌షా అన్నారు. 2019 ద్రవ్య వినిమయ బిల్లు, వివిధ శాఖల పద్దులు, డిమాండ్లపై ప్రవేశపెట్టిన బిల్లునూ లోక్‌సభ ఆమోదించింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ యూపీఏ హయాం నాటి గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగింపునకు తమ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి పాక్ తన గగనతలాన్ని మూసివేయడంతో ఎయిరిండియాకు రూ.430 కోట్ల నష్టం వాటిల్లిందని పౌర విమానయాన హర్దీప్‌సింగ్ పూరి రాజ్యసభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా చెప్పా రు. లోక్‌సభ సమావేశం మంగళవారం రాత్రి 11.59 గంటల వరకు కొనసాగింది. లోక్‌సభ రాత్రివేళ కూడా సమావేశం కొనసాగించడం వారం రోజుల్లో ఇది రెండోసారి. ఈ నెల 11న రైల్వేశాఖపై చర్చ సందర్భంగా ఆ రోజు 11.58 గంటల వరకు లోక్‌సభ సమావేశం సాగింది.

మంత్రి నరేంద్రసింగ్ తోమర్

ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులు

అభినందనీయమన్న రాష్ట్రపతి

సుప్రీంకోర్టు అదనపు భవనాలు ప్రారంభించిన కోవింద్

న్యూఢిల్లీ, జూలై 17: కక్షిదారులకు తీర్పులను ప్రాంతీయ భాషల్లో అందజేయడానికి సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవను, చర్యలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కొనియాడారు. తీర్పు ప్రతులు ఇంగ్లిష్ భాషలో ఉండటంతో కక్షిదారుడు దాన్ని అర్థం చేసుకోవడంలో పడుతున్న ఇబ్బందులను గుర్తించడం నిజంగా అభినందనీయమని చెప్పారు. 9 ప్రాంతీయ భాషల్లో ఈ తీర్పు ప్రతులను అందుబాటులోకి తీసుకురావడానికి చేస్తున్న కృషి తన మనసును దోచుకున్నదని తెలిపారు. ఈ మేరకు సుప్రీంకోర్టు వెలువరించిన 100 ముఖ్యమైన తీర్పుల అనువాదాలను స్వీకరించారు. ఇవి ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్మించిన అదనపు భవనాలను బుధవారం ప్రారంభించిన అనంతరం కోవింద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులోగానీ, రాష్ట్రాల్లో ఉన్న హైకోర్టుల్లోగానీ తీర్పు ప్రతులు వీలైనన్ని ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉండాలన్నదే మన లక్ష్యమని తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో, రాజ్యాంగ విలువలను కాపాడటంలో సుప్రీంకోర్టు పోషిస్తున్న పాత్రను వివరించారు.

కర్తార్‌పూర్ గురుద్వారాకు 42 ఎకరాలు

గతంతో పోలిస్తే 14 రెట్లు పెంపు

పంజాబ్ గవర్నర్ చౌదరి మహమ్మద్ సర్వర్ వెల్లడి

లాహోర్: కర్తార్‌పూర్‌లోని గుర్‌ద్వారా దర్బార్ సాహిబ్ కోసం 42 ఎకరాల భూమిని కేటాయించేందుకు పాకిస్థాన్ నిర్ణయం తీసుకున్నది. గతంలో కేటాయిస్తామని ప్రకటించిన మూడెకరాల భూమితో పోలిస్తే ఇది 14 రెట్లు ఎక్కువ. దీంతోపాటు పంటల సాగు కోసం మరో 62 ఎకరాలు కూడా కేటాయిస్తామని వెల్లడించింది. కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణం కూడా 80 శాతం పూర్తయిందని పంజాబ్ గవర్నర్ చౌదరి మహమ్మద్ సర్వర్ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం, హెరిటేజ్ కమిటీ అధిపతిగా ఉన్న చౌదరి మహమ్మద్ సర్వార్.. కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునానక్ 550వ జయంతి నాటికి కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణం పూర్తి కావాలన్న పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ విజన్ నెరవేరుతుందన్నారు. ఈ సందర్భంగా కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి భారత ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని చౌదరి మహమ్మద్ సర్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

14కు చేరిన ముంబై మృతుల సంఖ్య

కొనసాగుతున్న భవనం శిథిలాల తొలిగింపు ప్రక్రియ

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఉన్న డోంగ్రీ ప్రాంతంలో భవనం కూలి మరణించిన వారి సంఖ్య బుధవారం నాటికి 14కు చేరుకుంది. మరణించిన వారిలో ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. డోంగ్రీ ప్రాంతంలోని నాలుగు అంతస్తుల పురాతన భవనం మంగళవారం కుప్పకూలడంతో 11 మంది అక్కడికక్కడే మరణించిన విషయం తెలిసిందే. గాయపడిన 9 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ అధికార ప్రతినిధి సచిదానంద్ గౌడే మాట్లాడుతూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ప్రకటించారు.

హాస్టళ్లలో తగ్గిన డ్రాపౌట్స్

సన్నబియ్యంతో భోజనం | ప్రతి ఆదివారం చికెన్

- సత్ఫలితాలిస్తున్న సర్కారు చర్యలు
- సంక్షేమ హాస్టళ్లలో అన్నిమౌలిక వసతుల కల్పన
- 2,56,948 మంది విద్యార్థులకు ప్రయోజనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్షేమ హాస్టళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గత విద్యాసంవత్సరంలోనే సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులను ఏర్పాటుచేసింది. హాస్టళ్లలో నాణ్యతాప్రమాణాలు పెంచడంతో విద్యార్థుల డ్రాపౌట్ గణనీయంగా తగ్గింది. దేశంలో ఎక్కడా అమలుచేయని విధంగా తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యంతో అన్నం అందిస్తున్నది. అధికారులు గత రెండేండ్లుగా ప్రతి ఆదివారం చికెన్ కర్రీతో భోజనాన్ని అందిస్తున్నారు. సంప్రదాయ పండుగ దినాల్లోనూ చికెన్ ఇస్తున్నారు. 2012లో హాస్టళ్లకు సాధారణ బియ్యం కిలో నాలుగు రూపాయలకు ఇవ్వగా.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయికి.. అదీ సన్నబియ్యాన్ని ఇస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా ఏర్పాట్లుచేశారు. యూనివర్సిటీ స్థాయిలో అందించే పద్ధతిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమహాస్టళ్లలోని విద్యార్థులకు ప్రతిరోజూ పాలు, గుడ్డు, అల్పాహారం ఇవ్వడం, వారానికొకసారి మాంసాహారంతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచడంతో ప్రత్యేక మెనూ అమలుచేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు రాగిమాల్ట్ అందిస్తున్నారు. ఉదయం అందించే అల్పాహారం రవ్వ, సేమియా, అటుకుల ఉప్మా, పులిహోర, ఇడ్లీ, చెట్నీ, అరటి పండు అందిస్తున్నారు. పాఠశాల పనిదినాల్లో విద్యార్థులు అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తుండగా.. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో మధ్యాహ్న భోజనంలో బగారా అన్నం, చికెన్ కర్రీ, రైతా, సాంబారు పెడుతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళలో విద్యార్థులకు చిరుధాన్యాలతో స్నాక్స్ ఇస్తున్నారు. అందులో బొబ్బర్లు, సేమియా స్వీటు, శనగలు, పల్లీపట్టి, పెసర్లు, బిస్కట్లు ఇస్తున్నారు. రాత్రి వేళలో ప్రతిరోజు అన్నం, గుడ్డు వడ్డిస్తూనే.. ఏదైనా కూరగాయ, పప్పు, ఆకుకూరలు, సాంబారు, పెరుగు భోజనంలో అందిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లోని 2,56,948 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్నది.

క్యాటగిరీ వారీగా హాస్టళ్లు, విద్యార్థులు

విభాగం	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ	942	56628
ఎస్టీ	573	133537
బీసీ	736	66783
మొత్తం	2251	256948

నిరుపేదల విద్యా ప్రగతికోసం

రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాల్లోని చిన్నారుల విద్యా ప్రగతికోసం రాష్ట్రప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నది. అందులోభాగంగానే ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లవిద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి రూ.500 పాకెట్ మనీ ఇస్తున్నాం. ఇందుకోసం ఏటా రూ.13 కోట్లు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. కళాశాలస్థాయి విద్యార్థులు 2,600 మందికి జూలై మాసం నుంచి ప్రతినెలా పాకెట్ మనీ అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అదేవిధంగా ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా రూ.20 వేలు మంజూరు చేయాలని నిర్ణయించాం.

- పీ కరుణాకర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్

నరేగాతో రైల్వేల్లో అభివృద్ధి పనులు

- దక్షిణ మధ్య రైల్వే వినూత్న పంథా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టం నిధులను వినియోగించుకోవటంలో తాము సఫలీకృతమవుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తద్వారా రైల్వేలు సుపరిపాలన దిశగా ముందడుగు వేసి నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా నిధులు, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవటం సాధ్యమవుతున్నదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ, రైల్వేశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడానికి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించినట్టు తెలిపింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రైల్వేశాఖ తోడ్పాటుతో వివిధ రైల్వే పరిధులో అభివృద్ధి పనులను ఈ పథకం ద్వారా చేపట్టవలసిందిగా అన్ని రాష్ట్రాలకు కేంద్రం మార్గదర్శకాలను జారీచేసినట్లు పేర్కొంది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంతో సంయుక్తంగా ఎంజీనరేగా పథకం మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఎంపికచేసిన ఆరు స్థలాల్లో నిర్ణీత పనులను చేపట్టవలసిందిగా జోనల్‌రైల్వేలకు రైల్వేబోర్డు సలహా ఇచ్చిందని తెలిపింది. వంతెనలు, రైల్వే కరకట్టలు, రైల్వే సరిహద్దుల వెంట కందకాల నిర్మాణం, మూతలేని బావుల్లో పూడికతీయడం, బోరుబావుల పునరుద్ధరణ, మొక్కలు నాటడం, రైల్వేకాలనీల్లో పార్కుల ఏర్పాటు, వరుసలో మొక్కలు నాటడం, లెవల్ క్రాసింగ్‌లను కలిపే దారులు ఏర్పాటుచేయడం వంటి పనులు నరేగా నిధులతో జరుగుతున్నట్లు పేర్కొంది.

టాటూ ఉంటే ఆర్మీకి అనర్హులే

- నిబంధనల పట్ల అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న టాస్క్
- వచ్చే నెల నుంచి వరంగల్, రామగుండంలో శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత సైన్యంలో విస్తృతంగా ఉన్న అవకాశాలను తెలియజేసి తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) కీలక ముందడుగు వేసింది. ఆర్మీలో ప్రవేశ అర్హతల పట్ల అవగాహన లేకపోవడం వల్ల చాలామంది నష్టపోతున్న నేపథ్యంలో, వారికి టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఐటీ రంగమే కాకుండా ఇతర విభాగాలతోపాటు సైన్యంలో ఉద్యోగావకాశం పొందేలా శిక్షణ ఇస్తున్నామని టాస్క్ సీఈవో తెలిపారు. ఈ శిక్షణను వరంగల్, రామగుండం సెంటర్లలో వచ్చే నెలలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. నామమాత్రపు ఫీజుతో ఇస్తున్న ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మెజార్టీ ఫీజును టాస్క్ భరిస్తున్నదన్నారు. ఈ పథకం ద్వారా గత ఏడాది 380 మంది శిక్షణ పొందినట్టు తెలిపారు. టాస్క్ శిక్షణకు సమన్వయకర్తగా ఉన్న బ్రిగేడియర్ (రిటైర్డ్) సీఎస్ శ్రీరాములు ఈ సందర్భంగా శిక్షణ గురించి వివరిస్తూ, టాటూ (పచ్చబొట్టు) కలిగి ఉంటే ఆర్మీ ఉద్యోగానికి అనర్హులుగా ప్రకటిస్తారని, ఈ విషయాలపై అవగాహన లేక చాలామంది అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. ఆర్మీలో ఉద్యోగానికి సంబంధించిన శారీరక, మానసిక, విద్యా సంబంధమైన అర్హతల గురించి టాస్క్ శిక్షణ ద్వారా అవగాహన పొంది అవకాశాలు సొంతం చేసుకోవచ్చునన్నారు.

అమ్మపల్లి ఆలయ భూములు స్వాధీనం

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రసిద్ధ అమ్మపల్లి ఆలయ భూములను దేవాదాయ ధర్మాదాయశాఖ ట్రిబ్యునల్ హైదరాబాద్ ఆదేశానుసారం అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. భూముల్లో దేవాదాయ ధర్మాదాయశాఖ భూమి అని బోర్డులు ఏర్పాటుచేశారు. సర్వేనంబర్ 47లోని 32 ఎకరాల 3 గుంటల భూమిని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అమ్మపల్లికి చెందినదిగా పేర్కొన్నారు. ఇకముందు సదరు భూముల ఆక్రమణకు ఎవరు ప్రయత్నించినా దేవాదాయ ధర్మాదాయ నిబంధనల ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఆలయ ఫౌండర్ ట్రస్టీ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ మధు, ప్రవీణ్, సుధీర్‌రెడ్డి, ఇంద్రసేన, ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడలో ఆక్రమణకు గురైన అమ్మపల్లి ఆలయ భూములను స్వాధీనంచేసుకున్న దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU ములుగు, JS భూపాలపల్లి జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నం. T1/2/2019-20 తేది: 15-07-2019
NIT No. 07 to 36/ 2BHK/2018-19. JS భూపాలపల్లి జిల్లాలో మహదేవ్‌పూర్, కాటారం, పెగడపల్లి, మల్లారావ్, భూపాలపల్లి, ఘన్‌పూర్ (మం.), రేగొండ, మొగులపల్లి, చిట్యాల, టేకుమట్ల మండలాలలో 2 BHK ఇళ్ల నిర్మాణం చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. 30 పనుల కొరకు మొత్తం ECV: రూ. 2570.36 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది: 18-07-2019న రా.9.00గం. నుండి 25-07-2019న మ.3.00గం.వరకు. ఫోన్ నం. 9885039960. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in దర్శించండి.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, PIU, ములుగు,JS భూపాలపల్లి జిల్లా
DIPR RO. No. 652-DP/CL/Advt/1/2019-20, Dt: 17/07/2019

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
సంక్షిప్త టెండరు ప్రకటన: తేది: 15-07-2019
NIT Ref. 1 to 3/SDF/18-19 (2nd Call), 88, 172 & 177/SDF/18-19 1st Call, తేది: 10-10-18 (5th Call), 203, 204, 213, 223, 228/SDF/18-19 1st Call, తేది: 20-10-2018 (4th Call).
పాలకుర్తి, మహబూబాబాద్ నియోజకవర్గాలలో BT రోడ్డు పనులు (12) చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ. 280.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది: 20-07-2019న రా.9.00గం. నుండి 27-07-2019న మ.3.00గం.వరకు. ఫోన్ నం. 0870-2578114.తదుపరి వివరాల కొరకు https:// tender.telangana.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్
DIPR RO. No. 654-DP/CL/Advt/1/2019-20, Dt: 17/07/2019

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
టెండర్ నోటీస్ నెం. 10 మరియు 11/ఇ.ఇ./డివిజన్. నెం.4/ కె.యన్.ఆర్.పి/

ట్రంప్ జాత్యహంకార వ్యాఖ్యలకు ఖండన

తీర్మానాన్ని ఆమోదించిన అమెరికా ప్రతినిధుల సభ

వాషింగ్టన్: నలుగురు శ్వేతజాతీయేతర కాంగ్రెస్ సభ్యులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన జాత్యహంకార వ్యాఖ్యలను ఆ దేశ ప్రతినిధుల సభ ఖండించింది. ఈ మేరకు మంగళవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. తన వలస విధానాలను విమర్శించారనే కారణంతో కొత్తగా ఎన్నికైన నలుగురు కాంగ్రెస్ సభ్యులు (ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందినవారు) అలెగ్జాండ్రియా ఒకాసియో కార్టెజ్, ఇహాన్ ఒమర్, అయన్నా ప్రెస్లీ, రషిందా త్లయిబ్‌పై ట్రంప్ 'ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లాలంటూ' ట్విట్టర్ ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ సభ్యుడు టామ్ మలినోస్కీ ప్రతినిధుల సభలో మంగళవారం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 435 మంది సభ్యులున్న ఈ సభలో 240-184 ఓట్లతో తీర్మానం ఆమోదం పొందింది.

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కర్ణాటకలోని హుబ్బలిలో కనువిందు చేసిన చంద్రుడు. చంద్రగ్రహణం భారత్‌లో పాక్షికంగానే కనిపించింది. అర్ధరాత్రి 1.30 గంటలకు మొదలైన గ్రహణం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పరిపూర్ణం అయింది. గ్రహణం పట్టిన చంద్రుడిని ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో గ్రహణం వీడింది.

నిపుణులకు అమెరికా స్వాగతం!

- ప్రతిభ ఆధారిత ఇమిగ్రేషన్ కోటా 57శాతానికి పెంపు!
- ట్రంప్ సర్కార్ ప్రతిపాదన
- ట్రంప్ అల్లుడు, సలహాదారుడు జారెడ్ కుష్నర్ వెల్లడి

వాషింగ్టన్: గత కొంతకాలంగా వలసల విషయంలో కఠినమైన ఆంక్షలు విధిస్తున్న అమెరికా.. విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం అమెరికా వచ్చే వారికి ఇకపై మరింత అధికంగా అవకాశాలు కల్పిస్తామని తెలిపింది. ఈ మేరకు ప్రతిభ ఆధారిత ఇమిగ్రేషన్ కోటాను ప్రస్తుతం ఉన్న 12 శాతం నుంచి 57 శాతానికి పెంచుతామని పేర్కొంది. ట్రంప్ అల్లుడు, అధ్యక్షుడి సీనియర్ సలహాదారుడు జారెడ్ కుష్నర్ వైట్‌హౌస్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. చట్టబద్ధ వలస విధానంలో ప్రతిభ ఆధారంగా ఇచ్చే కోటాను 12 శాతం నుంచి 57 శాతానికి పెంచేందుకు చర్యలు ముమ్మరం చేసినట్టు పేర్కొన్నారు. ఇందులో సగం కుటుంబపరమైన కారణాలు, మానవతా ప్రాతిపదికన ఇవ్వనున్నట్టు తెలిపారు. 'ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న వలస విధానం చాలా పాతది. ప్రతిభ ఆధారిత కోటా ద్వారా కేవలం 12 శాతం మంది మాత్రమే ఇమిగ్రేషన్ అనుమతులు పొందుతున్నారు. కానీ చాలా దేశాల్లో ఈ కోటా ఎక్కువగా ఉంది. అందుకే అమెరికాలో దీన్ని 57 శాతానికి పెంచాలని ట్రంప్ ప్రతిపాదించారు' అని కుష్నర్ తెలిపారు. గత ఏడాది 11 లక్షల మందికి అమెరికా పౌరసత్వం లభించిందని, అయితే, ఆ సంఖ్యను మార్చకుండా.. ప్రతిభ ఉన్న వాళ్ళ శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

జాదవ్ కేసులో భారత్ విజయం

కుల్‌భూషణ్ కేసు..



2016

మార్చి 3: కుల్‌భూషణ్ జాదవ్‌ను అరెస్ట్ చేసిన పాకిస్థాన్

మార్చి 24: జాదవ్ అరెస్టుపై భారత్‌కు పాక్ సమాచారం. జాదవ్ భారత గూఢచారి అని పాక్ ఆరోపణ.

2017

2017 ఏప్రిల్ 10: గూఢచర్యం, దేశ విద్రోహ చర్యలకు పాల్పడ్డాడని పేర్కొంటూ జాదవ్‌కు మరణశిక్ష విధించిన పాక్ సైనిక కోర్టు.

మే 8: పాక్ సైనిక కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఐసీజేను ఆశ్రయించిన భారత్.

జూన్ 22: జాదవ్ క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్న పాక్. నేరాన్ని అంగీకరించాడని ప్రకటన.

డిసెంబర్ 8: డిసెంబర్ 25న జాదవ్‌ను కలిసేందుకు ఆయన తల్లి, భార్యకు అనుమతి తెలిపిన పాక్

2018

2018 జూలై 17: రెండో కౌంటర్ మెమోరియల్ దాఖలు చేసిన పాక్

2019

2019 ఫిబ్రవరి 18: జాదవ్ కేసులో నాలుగు రోజులపాటు విచారణ జరిపిన ఐసీజే. తీర్పు వాయిదా.

ఏప్రిల్ 20: కోర్టు విచారణ వివరాలను కోరిన భారత్

మే 9: జాదవ్ మరణశిక్షపై స్టే విధించిన ఐసీజే

సెప్టెంబర్ 13: ఐసీజేలో మెమోరియల్ దాఖలు చేసిన భారత్

సెప్టెంబర్ 28: జాదవ్‌ను ఇస్తే ఉగ్రవాదిని విడుదల చేస్తామని భారత్ ప్రతిపాదించినట్టు పాక్ ఆరోపణ

డిసెంబర్ 13: ఐసీజేలో కౌంటర్ మెమోరియల్ దాఖలు చేసిన పాక్

2019 జూలై 17: జాదవ్ మరణశిక్షను పునఃసమీక్షించాలని పాక్‌కు ఐసీజే ఆదేశాలు

ముంబైలో స్వీట్లు తినిపించుకుంటున్న జాదవ్ స్నేహితులు

మరణశిక్షపై పునఃసమీక్షించండి

పాకిస్థాన్‌కు అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశం

జాదవ్ మరణశిక్షపై స్టే కొనసాగింపు

15-1 మెజార్టీ తీర్పులో ఐసీజే

వియన్నా ఒడంబడికను పాక్ ఉల్లంఘించిందని వ్యాఖ్య

తీర్పును స్వాగతించిన భారత్

హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో తీర్పును ప్రకటిస్తున్న జడ్జీలు

బి హేగ్, జూలై 17: పాకిస్థాన్ చెరలో ఉన్న భారత నౌకాదళ విశ్రాంత అధికారి కుల్‌భూషణ్ జాదవ్ కేసులో భారత్‌కు గొప్ప విజయం లభించింది. జాదవ్ నేర నిర్ధారణ, మరణశిక్షపై సమగ్రంగా పునఃపరిశీలన, పునఃసమీక్ష చేపట్టాలని పాకిస్థాన్‌ను అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఆదేశించింది. అలాగే భారత దౌత్య అధికారులు జాదవ్‌ను కలిసేందుకు అనుమతినిచ్చింది. ఐసీజే అధ్యక్షుడు జస్టిస్ అబ్దుల్‌ఖావి అహ్మద్ యూసఫ్ నేతృత్వంలోని 16 మంది సభ్యులతో కూడిన ధర్మాసనం 15-1 మెజార్టీతో ఈ మేరకు బుధవారం 42 పేజీల తీర్పును వెలువరించింది. జాదవ్ మరణశిక్షపై స్టే కొనసాగించిన ధర్మాసనం.. జాదవ్‌ను కలిసేందుకు భారత దౌత్య అధికారులను అనుమతించకపోవడం ద్వారా పాకిస్థాన్ భారత హక్కులను ఉల్లంఘించిందని వ్యాఖ్యానించింది. మరణశిక్షపై స్టే కొనసాగించడం ద్వారా శిక్షను (పాకిస్థాన్) పునఃసమీక్షించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందని కోర్టు అభిప్రాయపడింది. అయితే పాక్ సైనిక కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని, జాదవ్‌ను విడుదల చేసి తమకు సురక్షితంగా అప్పగించాలన్న భారత్ విజ్ఞప్తులను కోర్టు తిరస్కరించింది. మెజార్టీ తీర్పులో చైనాకు చెందిన న్యాయమూర్తి కూడా ఉండగా, పాక్‌కు చెందిన అడ్‌హక్ న్యాయమూర్తి ఒక్కరే అసమ్మతి తీర్పును విడిగా ఇచ్చారు.

భారత హక్కులను పాక్ ఉల్లంఘించింది..

'నిర్బంధంలో ఉన్న కుల్‌భూషణ్ జాదవ్‌ను కలిసేందుకు, సంభాషించేందుకు, ఆయనకు న్యాయ ప్రతినిధిని నియమించేందుకు భారత్‌కు ఉన్న హక్కును పాకిస్థాన్ కాలరాసింది' అని ఐసీజే ధర్మాసనం వ్యాఖ్యానించింది. వియన్నా ఒడంబడిక ప్రకారం.. జాదవ్ అరెస్ట్, నిర్బంధం విషయాన్ని భారత్‌కు తెలియజేయాల్సిన బాధ్యత పాక్‌పై ఉందని పేర్కొంది. అయితే మూడు వారాలు ఆలస్యంగా అరెస్ట్ విషయాన్ని తెలియజేశారని, దీని ద్వారా పాక్ వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అభిప్రాయపడింది. జాదవ్ జాతీయతను నిర్ధారించడంలో భారత్ విఫలమైందన్న పాక్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. తమ ముందున్న ఆధారాలను బట్టి జాదవ్ భారతీయుడే అనడంలో ఎలాంటి సందేహాలు లేవంది. వియన్నా ఒప్పందంలోని ఆర్టికల్ 36 ప్రకారం జాదవ్‌ను భారత దౌత్య అధికారులు కలిసేందుకు అనుమతించాలని పాక్‌కు స్పష్టంచేసింది.

న్యాయం గెలిచింది: ప్రధాని మోదీ

ఐసీజే తీర్పును ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. సత్యం, న్యాయం గెలిచాయని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడి భద్రత, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషిచేస్తుందని చెప్పారు. వాస్తవాలను విస్తృతంగా అధ్యయనం చేసి తీర్పు వెలువరించిన ఐసీజేకు అభినందనలు అని ట్వీట్ చేశారు. జాదవ్‌కు న్యాయం దక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కేసులో భారత్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది హరీశ్ సాల్వే స్పందిస్తూ.. న్యాయానికి విజయం లభించిందని, తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తీర్పునకు పాకిస్థాన్ కట్టుబడి ఉంటుందని భావిస్తున్నామన్నారు.

చట్టం ప్రకారం వ్యవహరిస్తాం: పాక్

కుల్‌భూషణ్ జాదవ్ కేసులో చట్టం ప్రకారం వ్యవహరిస్తామని పాకిస్థాన్ తెలిపింది. అంతర్జాతీయ సమాజంలో బాధ్యతాయుతమైన దేశంగా పాకిస్థాన్ ఈ కేసులో మొదటి నుంచి నిబద్ధతతో వ్యవహరిస్తున్నదని, స్వల్ప వ్యవధిలో నోటీసు ఇచ్చినా కోర్టు విచారణకు హాజరయ్యామని పేర్కొంది. జాదవ్‌ను విడుదల చేయాలన్న భారత్ విజ్ఞప్తిని ఐసీజే తోసిపుచ్చిందని గుర్తుచేసింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

తీర్పును తక్షణమే అమలు చేయాలి: భారత్

ఐసీజే తీర్పును భారత్ స్వాగతించింది. ఈ చారిత్రాత్మక తీర్పు భారత వైఖరిని పూర్తిగా సమర్థించిందని పేర్కొంది. ఐసీజే ఆదేశాలను తక్షణమే అమలుచేయాలని పాక్‌ను కోరింది. జాదవ్‌ను త్వరితగతిన విడుదల చేసి భారత్‌కు తీసుకొచ్చేందుకు తాము నిరంతరం కృషిచేస్తామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ పేర్కొన్నారు. జాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. వారి ధైర్యాన్ని ప్రశంసించారు.

> ఐసీజే తీర్పు భారత్‌కు గొప్ప విజయం. దానిని ఆహ్వానిస్తున్నాం. ప్రధాని మోదీ కొనసాగిస్తున్న దౌత్య సంబంధాలకు, ఆయన తీసుకుంటున్న చొరవకు లభించిన గొప్ప విజయం.
>
> –రాజ్‌నాథ్ సింగ్ (రక్షణ మంత్రి)
>
> న్యాయం ఎప్పటికైనా విజయం సాధిస్తుందన్న దానికి జాదవ్ కేసే ఉదాహరణ. ఐసీజే తీర్పు పట్ల జాదవ్ కుటుంబం ఆనందంలో ఈ దేశ ప్రజలందరూ భాగస్వాములవుతున్నారు.
>
> –ప్రియాంకాగాంధీ (కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి)
>
> ఐసీజే తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా. ఈ తీర్పు భారత్‌కు గొప్ప విజయం.
>
> –సుష్మాస్వరాజ్ (కేంద్రమాజీ మంత్రి)

ఆనందంలో జాదవ్ స్వగ్రామం

ఐసీజే తీర్పు నేపథ్యంలో జాదవ్ స్వగ్రామమైన మహారాష్ట్రలోని సతారా జిల్లా జావ్లి గ్రామంలో ఆనందం మిన్నంటింది. 'గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో జాదవ్ ఇల్లు కట్టుకున్నాడు. ఏడాదికి రెండు, మూడు సార్లు ఇక్కడికి వచ్చి వెళ్తుండేవారు. అయితే గూఢచర్యం ఆరోపణలపై ఆయనను పాక్ అరెస్టు చేయడం, మరణశిక్ష విధించడం దారుణం. జాదవ్‌ను క్షేమంగా భారత్‌కు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది' అని గ్రామస్థులు చెప్పారు. ఐసీజే తీర్పు అనుకూలంగా రావడం ఆనందంగా ఉందని జాదవ్ బంధువులు పేర్కొన్నారు. జాదవ్ రాక కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

ఐసీజేలో రెండేండ్లు కొనసాగిన వాదనలు

గూఢచర్యం, ఉగ్రవాద అభియోగాలపై 2017 ఏప్రిల్‌లో కుల్‌భూషణ్ జాదవ్‌కు పాకిస్థాన్ సైనిక కోర్టు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇరుదేశాల సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం గత ఫిబ్రవరి 21న తీర్పును వాయిదా వేసింది. ఐదు నెలల తర్వాత బుధవారం తీర్పు వెలువరించింది. ఐసీజేలో రెండేండ్ల రెండు నెలల పాటు ఈ కేసులో వాదనలు సాగాయి. జాదవ్‌ను కలిసేందుకు భారత దౌత్య అధికారులకు అనుమతి ఇవ్వాలని పదేపదే విజ్ఞప్తి చేసినా పాకిస్థాన్ నిరాకరిస్తున్నదని, వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నదని పేర్కొంటూ 2017 మే 8న భారత్ ఐసీజేను ఆశ్రయించింది. తాము తుది తీర్పు వెలువరించే వరకు జాదవ్‌కు మరణశిక్ష అమలును నిలిపివేయాలని 2017 మే 18న పాకిస్థాన్‌ను ఐసీజే ధర్మాసనం ఆదేశించింది. 2016 మార్చి 3న కుల్‌భూషణ్‌ను పాకిస్థాన్ అరెస్ట్ చేసింది. అయితే ఇరాన్‌లో వ్యాపారం చేసుకుంటున్న జాదవ్‌ను పాకిస్థాన్ కిడ్నాప్ చేసిందని భారత్ ఆరోపించింది. జాదవ్‌ను కలిసేందుకు తమ దౌత్య అధికారులకు అనుమతి ఇవ్వాలని ఐసీజేలో భారత్ చేసిన విజ్ఞప్తిని పాక్ నిరాకరించింది. భారత్ తమ 'గూఢచారి' నుంచి సమాచారాన్ని సేకరించేందుకే అనుమతి కోరుతున్నదని తెలిపింది. ఏదేమైనా, 2017 డిసెంబర్ 25న జాదవ్‌ను కలిసేందుకు ఆయన తల్లి, భార్యను పాక్ అనుమతించింది. పుల్వామా ఉగ్రదాడి అనంతరం ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న గత ఫిబ్రవరి నెలలో ఈ కేసుపై నాలుగు రోజులపాటు ఐసీజే విచారణ జరిపింది. భారత్ తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు.

నేడు కన్నడ క్లైమాక్స్?

రెబల్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రావాలని ఒత్తిడి చేయరాదు

వారి రాజీనామాలపై నిర్ణయాధికారం స్పీకర్‌దే: సుప్రీంకోర్టు తీర్పు

నేడు విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్న కుమారస్వామి ప్రభుత్వం

విశ్వాస పరీక్షను వాయిదా వేయించే ప్రయత్నాల్లో కాంగ్రెస్-జేడీఎస్



స్పీకర్ రమేశ్ కుమార్‌ను కలిసి వస్తున్న సిద్ధరామయ్య, ఇతర కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ/బెంగళూరు, జూలై 17: కర్ణాటకలో కాంగ్రెస్-జనతాదళ్ (ఎస్) నేతృత్వంలోని 14 నెలల సంకీర్ణ సర్కార్‌కు ఘడియలు దగ్గర పడినట్టు తెలుస్తున్నది. ఈ నెలారంభం నుంచి సాగుతున్న కర్నాటకానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన 15 మంది కాంగ్రెస్, జేడీ(ఎస్) రెబల్ ఎమ్మెల్యేలను సమావేశాలకు హాజరు కావాలని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు బుధవారం తీర్పు చెప్పింది. ఈ తీర్పు గురువారం అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కోబోతున్న కుమారస్వామి సర్కార్‌కు ప్రమాద ఘంటికలను మోగించిం ది. 15 మంది రెబల్ ఎమ్మెల్యేలు సభకు హాజ రు కాకుంటే ప్రభుత్వం మైనారిటీలో పడి వి శ్వాస పరీక్షలో ఓడిపోయే ప్రమాదం నెలకొంది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం.. రెబెల్ ఎమ్మె ల్యేల రాజీనామా అంశం కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ ఇష్టానికే వదిలేసింది. రెబల్స్‌తో పాటు అటు స్పీకర్, ఇటు సీఎం కుమారస్వామి వాదనలు కూడా విన్న సుప్రీంకోర్టు బుధవారం తీర్పు చెప్పింది. స్పీకర్ తనకు తోచినప్పుడు వారి రాజీనామాలను ఆమోదించవచ్చన్నది. రాజీనామాలను ఆమోదించే విషయమై స్పీకర్‌కు నిర్దిష్ట గడువు విధించలేమని పేర్కొంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలా వద్దా అనేది ఎమ్మెల్యేల ఇష్టమని తెలిపింది. రెబల్స్ రాజీనామాలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తమకు తెలియజేయాలని తెలిపింది.కోర్టు తీర్పును స్వాగతించిన స్పీకర్ రమేశ్‌కుమార్.. తాను రాజ్యాంగానికి అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానన్నారు. ముంబైలో మకాం వేసిన రెబల్ ఎమ్మెల్యేలూ కోర్టు తీర్పుపై హర్షం వ్య క్తం చేశారు. రాజీనామాపై వెనుకకు తగ్గేది లేదని, తాము అసెంబ్లీ సమావేశాలకూ హాజరు కాబోమన్నారు. కోర్టు తీర్పుపై స్పందిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీసీ పాటిల్ విడుదల చేసిన వీడియో సందేశంలో సుప్రీంకోర్టు తీర్పు హర్షించదగినదని, తాము దానిని గౌరవిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టుతీర్పు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి లభించిన విజయమని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు యెడ్యూరప్ప అన్నారు. రెబల్ ఎమ్మెల్యేలకు లభించిన నైతిక విజయం కోర్టు తీర్పు అని చెప్పారు. సీఎం కుమారస్వామి గురువారం తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ, 'కోర్టు తీర్పు అధికార పార్టీల విప్‌ను చెల్లకుండా చేసింది. ప్రజా తీర్పును మోసగించిన ఎమ్మెల్యేలకు సంపూర్ణ రక్షణ కల్పించింది' అని పేర్కొంది.

అసెంబ్లీలో బలాబలాలు:

కర్ణాటక అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య నామినేటెడ్ సభ్యునితో కలిపి	225
అధికార పక్షం	
కాంగ్రెస్	78
జేడీ(ఎస్)	37
బీఎస్పీ	1
నామినేటెడ్	1
మొత్తం	117
ప్రతిపక్షం	
బీజేపీ	105
ఇండిపెండెంట్లు	2

రాజీనామా చేసిన 16 మంది ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోతే అధికార పక్షం బలం 101కి పడిపోతుంది.

విశ్వాస పరీక్ష వాయిదా?

కర్ణాటక రాజకీయాలు మరో మలుపు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీలో గురువారం జరుగనున్న విశ్వాస పరీక్షను సాంకేతిక అంశాలను అడ్డం పెట్టుకొని వాయిదా వేయించాలని కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కొన్ని అంశాలను స్పీకర్ ముందుంచినట్టు సమాచారం. మరోవైపు బలపరీక్ష నిర్వహించాల్సిందేనని ప్రతిపక్ష బీజేపీ పట్టుబడుతున్నది. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నదానిపై సీఎం కుమారస్వామి ప్రభుత్వ భవితవ్యం ఆధారపడి ఉంది. సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్దరామయ్య నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందం బుధవారం స్పీకర్ రమేశ్‌కుమార్‌ను కలిసి కొన్ని సాంకేతిక అంశాలను ఆయన ముందు ఉంచింది. రెబల్ ఎమ్మెల్యేలకు విప్‌ను జారీ చేసే తమ హక్కును సుప్రీంకోర్టు తొక్కి పెట్టిందని, అయినా తమకు విప్‌ను జారీ చేసే హక్కుందని తెలిపారు. సుప్రీంకోర్టు తమ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మరో సాంకేతిక అంశాన్నీ కాంగ్రెస్ స్పీకర్ ముందుంచింది. 'అసెంబ్లీ జరుగుతున్నప్పుడు సభ్యులంతా హాజరు కావాలి. ఒకవేళ వారు గైర్హాజరు కాదలచుకుంటే స్పీకర్ అనుమతి తీసుకోవాలని అసెంబ్లీ నిబంధనలు సూచిస్తున్నాయి. రెబల్ ఎమ్మెల్యేలు సభ అనుమతి లేకుండా ముంబైలో మకాం వేశారు. కాబట్టి ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని విశ్వాస పరీక్షను వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలి' అని కాంగ్రెస్ పార్టీ స్పీకర్‌ను కోరింది.

విమానంలో అడుగంటిన ఇంధనం..

చివరి క్షణాల్లో ల్యాండింగ్

153 మంది ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

న్యూఢిల్లీ: ముంబై నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విస్తారా ఎయిర్‌లైన్స్ విమానానికి పెను ప్రమాదం తప్పింది.153 మందితో ముంబై నుంచి ఢిల్లీకి సోమవారం ఈ విమానం బయలుదేరింది. ఢిల్లీకి చేరుకున్న విమానాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణంతో ల్యాండింగ్‌కి అనుమతించలేదు.దీంతో పైలట్ విమానాన్ని లక్నోకు మళ్లించాడు. అక్కడ ల్యాండింగ్‌కి అనుమతి రావడంలో జాప్యం జరిగింది. మరో 10నిమిషాలైతే ఇంధనం అయిపోతుందని గుర్తించిన పైలట్ విమానాన్ని ఎలాగోలా లక్నోలో ల్యాండ్ చేశారు.

ముంబై బాంబు పేలుళ్ల సూత్రధారి..

హఫీజ్ సయీద్ అరెస్ట్

ఉగ్రవాదులకు నిధులు అందజేశాడనే అభియోగాలపై నిర్బంధం

వారం రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించిన కోర్టు

లాహోర్: ముంబై బాంబు పేలుళ్ల సూత్రధారి, జమాత్ ఉద్ దవా (జేయూడీ) అధిపతి హఫీజ్ సయీద్‌ను పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్ర కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ (సీటీడీ) అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. ఉగ్రవాదులకు నిధుల అందజేత కేసులో ముందస్తు బెయిల్ కోసం లాహోర్ నుంచి గుజ్రన్‌వాలాకు వెళ్తుండగా మార్గమధ్యంలో అడ్డగించి అతడిని అరెస్ట్ చేసినట్లు సీటీడీ అధికారి ఒకరు తెలిపారు. అనంతరం అతడిని గుజ్రన్‌వాలాలోని యాంటీ టెర్రరిజం కోర్టులో హాజరుపరుచగా, వారం రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు అప్పగించిందని చెప్పారు. అనంతరం లాహోర్‌లోని కోట్ లాఖ్‌పట్ జైలుకు సయీద్‌ను తరలించినట్లు ఆ అధికారి వివరించారు. ఉగ్రమూకలకు ఆర్థిక సాయానికి సంబంధించి సయీద్‌తో పాటు మరో 12 మందిపై ఈనెల 3న సీటీడీ 23 కేసులు నమోదు చేసింది. లష్కరే తాయిబా అనుబంధ సంస్థే జేయూడీ. 2008లో 166 మంది ప్రాణాలను బలిగొన్న ముంబై ఉగ్రదాడులకు సయీదే సూత్రధారి. 2008 డిసెంబర్‌లో అతడిని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఉగ్రవాద కార్యకలాపాలపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో లష్కరే, జేయూడీ, దాని అనుబంధ ధార్మిక సంస్థ ఫలా ఎ ఇన్సానియాత్ ఫౌండేషన్‌పై (ఎఫ్ఐఎఫ్) పాకిస్థాన్ చర్యలకు ఉపక్రమించింది. ఉగ్రమూకలకు నిధుల సాయంపై కచ్చితమైన ఆధారాలు లభించడంతో సయీద్‌తోపాటు 12 మంది అనుచరులపై 23 కేసులను నమోదు చేసినట్లు సీటీడీ తెలిపింది. మరోవైపు పాక్‌పై గత రెండేండ్లుగా అమెరికా చేస్తున్న ఒత్తిడి వల్లే ఆ దేశం హఫీజ్ సయీద్‌ను అరెస్ట్ చేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

చంద్రయాన్-2 ఆలస్యమైతే కష్టమే!

జూలైలో కాకపోతే.. సెప్టెంబర్ వరకూ ఆగాల్సిందే

న్యూఢిల్లీ, జూలై 17: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగం నిర్దేశించిన సమయానికి మరో 56 నిమిషాల 24 సెకండ్ల సమయం ఉండగా.. మిషన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో వాయిదా పడటం తెలిసిందే. యావత్ దేశం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-2 ప్రయోగానికి ఇస్రో మళ్లీ సంసిద్ధమైనట్టు సమాచారం. సాంకేతిక సమస్యను గుర్తించామని, వాహక నౌక భాగాల్ని పూర్తిగా విడదీయకుండానే ఈ సమస్యను పరిష్కరించవచ్చని ఇస్రో వర్గాలు వెల్లడించాయి. అన్నీ కుదిరితే ఈ నెలాఖరులోగా 'చంద్రయాన్ 2'ను చేపడుతామని వాళ్ళు తెలిపారు. అయితే, చంద్రయాన్ ప్రయోగం ఆలస్యమైతే కొన్ని సమస్యలు ఎదురు కావొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇస్రో చంద్రయాన్-2 ప్రయోగానికి జూలై 29, 30వ తేదీలు అనుకూలంగా ఉన్నాయి. అప్పుడు కాకపోతే, తదుపరి లాంచ్ విండో సెప్టెంబర్‌లోనే ఉంది. 'ఇస్రో ప్రయోగాన్ని ఇంకా వాయిదా వేస్తే, చంద్రుని కక్ష్య వాలు మారుతుంది. దీని వల్ల ప్రయోగం కోసం ఎక్కువ ఇంధనం ఖర్చు చేయాల్సి రావొచ్చు. ఇది పేలోడ్ సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తుంది' అని ఓ ఇస్రో శాస్త్రవేత్త అన్నారు. 'ఇస్రో నుంచి ఇప్పటివరకైతే ఎలాంటి ప్రకటన లేదు. ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అన్ని విషయాలు వెల్లడిస్తాం' అని ఆయన అన్నారు.

పోటెత్తుతున్న వరద

మిజోరం, మేఘాలయలో, బీహార్‌లో ఇప్పుడిప్పుడే తగ్గుముఖం

నీట మునిగిన పంజాబ్‌లోని బటిండా ప్రాంతం

విజ్వాల్/షిల్లాంగ్/పాట్నా/చండీగఢ్, జూలై 17: ఈశాన్య రాష్ట్రాలైన మిజోరం, మేఘాలయలో వరద పోటెత్తుతున్నది. బీహార్‌లో ఇప్పుడిప్పుడే వరద తగ్గుతున్నది. పంజాబ్‌లోని బటిండా ప్రాంతం వరదలో చిక్కుకుపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరద పెరుగడంతో మిజోరంలో 5వేల మందికిపైగా తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వరదలో చిక్కుకున్న 4వేల మందికిపైగా ప్రజలను సహాయక సిబ్బంది రక్షించారు. వరద ప్రభావం 205 గ్రామాలపై ఎక్కువగా పడింది. దీని వల్ల 1,523 ఇండ్లు దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు ఐదుగురు వ్యక్తులు మరణించారు. మరోవైపు మేఘాలయలో 1.3 లక్షల మందిపై వరద ప్రభావం పడటంతో ఆ రాష్ట్ర సీఎం కాన్రాడ్ కే సంగ్మా నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ

ఫొటోల్లో ఉన్న క్రికెటర్లను గుర్తుపట్టారా? జాగ్రత్తగా గమనించండి మన టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ, ధోనీ, జడేజా, రోహిత్‌శర్మ, భువనేశ్వర్. అదేంటి అప్పుడే ముసలి వాళ్లు అయ్యారను కుంటున్నారా. నెటిజన్లు ఫేస్‌యాప్ ద్వారా క్రికెటర్ల ముఖచిత్రాలను ఇలా మార్చడంతో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

ధోనీ దారెటు?

రిటైర్మెంట్‌పై మౌనం వీడని మహీ

జట్టులో రెండో కీపర్‌గా కొనసాగే అవకాశం.. పంత్‌ను తీర్చిదిద్దే బాధ్యత స్వీకరణ!

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మహేంద్ర సింగ్ ధోనీ.. క్రికెట్ చరిత్ర చూసిన అత్యుత్తమ కెప్టెన్‌లలో ఒకడు.. భారత్‌కు రెండు ప్రపంచకప్‌లను అందించిన ఏకైక సారథి... ఓటమి అంచున ఉన్న జట్టును ఎన్నోసార్లు గెలుపు తీరం దాటించిన బెస్ట్ ఫినిషర్.. అయితే కెరీర్ చరమాంకంలో తడబడుతున్న ధోనీ ప్రపంచకప్ తర్వాత రిటైర్ అవుతాడన్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. మహీ మాత్రం మౌనముద్ర వీడడం లేదు.. ఎందరో ప్రముఖులు అతను టీమ్‌ఇండియాలో కొనసాగాల్సిందేనని సూచిస్తున్నారు. మరికొందరేమో జట్టుకు ధోనీ అవసరం అపారంగా ఉందని అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రిటైరయ్యే అవకాశం లేదని, జట్టుతోనే ఉంటూ యువ క్రికెటర్లకు సలహాలిస్తూ దిశానిర్దేశం చేస్తాడనే వాదన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మహీ ఏ మార్గాన్ని ఎంచుకుంటాడు, టీమ్‌ఇండియాలో అతడి పాత్ర ఎలా ఉండబోతున్నదనే అంశాలపై విశ్లేషణాత్మక కథనం.

ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయిన టీమ్ ఇండియా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ మరుక్షణం నుంచి క్రికెట్ ప్రపంచంలో చర్చంతా ఒకే అంశంపై. అదే మహేంద్ర సింగ్ ధోనీ రిటైర్మెంట్. అతడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరవుతాడని కొందరు... లేదు ధోనీ అవసరం టీమ్‌ఇండియాకు అపారంగా ఉందని మరికొందరు... అసలు వైదొలిగే ఆలోచనే చేయొద్దంటూ ఇంకొందరు అంటూనే ఉన్నారు. ధోనీ మాత్రం ఈ విషయంపై పెదవి విప్పడం లేదు. విశ్వటోర్నీ తర్వాత కెప్టెన్ విరాట్ కోహ్లీలోని సారథ్య సామర్థ్యంపై ఓ వైపు అనుమానాలు వ్యక్తమవుతుంటే.. జట్టులో విభేదాలు ఉన్నాయన్న వాదనలు గుప్పుమంటున్నాయి. మరోవైపు జట్టు మిడిలార్డర్‌లో అనుభవరాహిత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మరి ఇలాంటి పరిస్థితుల్లో ధోనీ ఏం చేయనున్నాడు.. రిటైర్మెంట్‌కు మొగ్గు చూపుతాడా... జట్టు కోసం కొనసాగాలని నిర్ణయించుకుంటాడా... టీమ్ ఇండియాకు అతడి అవసరమెంత.

ధోనీ లేని కోహ్లీ ఎలా..

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ధోనీ లేకుంటే కోహ్లీ సారథిగా ఏ మేరకు జట్టును సమర్థంగా నడిపిస్తాడోనన్న అనుమానాలు ఇప్పటికీ ఉన్నాయి. ఎందుకంటే జట్టు కష్టకాలంలో ఉన్నప్పుడు బాధ్యతంతా మహీపై వేసి ఏ బౌండరీ లైన్ దగ్గరో విరాట్ నిలబడడం ఇంతకు ముందు చాలా సార్లు చూశాం. బౌలర్లకు సైతం ధోనీనే సూచనలు, సలహాలు ఇస్తుంటాడు. కష్టకాలంలో తాను ధోనీ సలహాలు స్వీకరిస్తానని కోహ్లీ కూడా అనేక సందర్భాల్లో వెల్లడించిన విషయం తెలిసిందే. కెప్టెన్‌గా విరాట్ సామర్థ్యం పూర్తిగా తేలక ముందే ధోనీ వైదొలిగితే టీమ్‌ఇండియా పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

యువ క్రికెటర్లకు అండగా..

ధోనీ ఇప్పటికిప్పుడే రిటైరవకుండా జట్టులో రెండో కీపర్‌గా కొనసాగుతాడనే తాజా వాదన వెలుగులోకి వచ్చింది. తదుపరి జరిగే వెస్టిండీస్ సిరీస్‌కు అతడు వెళ్లకపోయినా... ఆ తర్వాతి సిరీస్‌లకు ఎంపికవుతాడని విశ్వసనీయ వర్గాల సమాచారం. అలా అయితే 15మంది సభ్యుల్లో ఉన్నా.. తుది జట్టులో ఆడకుండా.. రిషబ్ పంత్‌కు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. పంత్‌ను అత్యుత్తమ వికెట్ కీపింగ్ బ్యాట్స్‌మన్‌గా తీర్చిదిద్దే.. తన స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాడిగా చేసే బాధ్యతను ధోనీ భుజాన వేసుకోనున్నట్లు తెలుస్తున్నది. జట్టులో కొత్తగా వచ్చే ఆటగాళ్లకు అండగా ఉండనున్నారు. ఐపీఎల్‌లో తదుపరి సీజన్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోనీ కొనసాగడం తథ్యమనే సంకేతాలొస్తున్నాయి.

తెరవెనుక రథసారథిగా..

ప్రపంచకప్‌లో ఓటమి తర్వాత టీమ్‌ఇండియాలో ఆటగాళ్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న వార్తలు గుప్పుమన్నాయి. కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు పొసగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు రోహిత్‌ను కెప్టెన్‌గా నియమించాలన్న డిమాండ్ ఊపందుకుంటున్నది. ఈ నేపథ్యంలో జట్టులో సీనియర్ అయిన ధోనీ దూరమైతే విభేదాలు మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అందుకే తుదిజట్టులో లేకుండా అందరి ప్రదర్శనను విశ్లేషిస్తూ... జట్టు ఐకమత్యంగా ముందుకు సాగేందుకు కృషి చేయాలని ధోనీ ఆలోచిస్తున్నట్టు సమాచారం.

రిటైరవ్వొద్దు ప్లీజ్..

ఇప్పుడే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవ్వొద్దంటూ కొందరు మాజీలు సహా సినీ రంగ ప్రముఖులు, సన్నిహితులు ధోనీకి సూచిస్తూనే ఉన్నారు. రిటైర్మెంట్ ఆలోచనను ఎట్టిపరిస్థితుల్లో మనసులోకి రానివ్వొద్దని ప్రముఖ గాయకురాలు లతా మంగేష్కర్ ఇటీవలే ధోనీకి సూచించారు. ఇక బాలీవుడ్ సీనియర్ రచయిత జావేద్ అక్తర్ సైతం ఇలాంటి విన్నపమే చేశారు. చాలా మంది మాజీ క్రికెటర్లు సైతం మహీ వైదొలగడానికి ఇది సరైన సమయం కాదని అంటున్నారు.

జట్టు అవసరం కోసమే..

ధోనీ ఏం చేసినా జట్టు కోసమే చేస్తాడనేది చాలా మంది వాదన. తన అవసరం టీంకు లేదనుకుంటే ఏ క్షణానైనా అతడు వెళ్లిపోతాడని.. టెస్టు క్రికెట్ నుంచి వైదొలిగిన క్రమాన్ని, పరిమిత ఓవర్ల సారథ్య బాధ్యతలను త్యజించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. భారత టెస్టు జట్టును కోహ్లీని నడిపిస్తాడన్న నమ్మకం కలిగిన మరుక్షణమే... ఆస్ట్రేలియా సిరీస్(2014)మధ్యలోనే ధోనీ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడని చెబుతున్నారు. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో జట్టుకు తన అవసరం ఉంది కాబట్టే మహీ అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతున్నాడని విశ్లేషిస్తున్నారు. జట్టు పరిస్థితుల కారణంగా కనీసం వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ వరకైనా టీమ్ ఇండియాతో ధోనీ ఉండాలని అభిప్రాయపడుతున్నారు.

జాతీయ చెస్ చాంప్ రాజా రిత్విక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: అండర్-15 జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ క్రీడాకారుడు, అంతర్జాతీయ మాస్టర్ రాజా రిత్విక్ పసిడి పతకంతో మెరిశాడు. ఈరోడ్(తమిళనాడు) వేదికగా బుధవారం ముగిసిన టోర్నీలో రిత్విక్ తన దైన ప్రతిభతో సత్తాచాటాడు. ఇదే టోర్నీలో బరిలోకి దిగిన రాష్ట్ర చెస్ ఆటగాడు కుశాగ్ర మోహన్ రజతం సాధించాడు. మొత్తం 11 రౌండ్లలో 9.5 పాయింట్లతో అగ్రస్థానంలో

నిలిచిన రిత్విక్ చాంపియన్‌గా నిలిచాడు. 11 గేముల్లో ఎనిమిది గెలిచిన ఈ కుర్రాడు మూడింటిని డ్రాగా ముగించుకుని టోర్నీలో అజేయంగా నిలిచాడు. ఫైనల్లో తమిళనాడుకు చెందిన అజయ్ కార్తీకేయన్‌ను రిత్విక్ అద్భుత రీతిలో ఓడించాడు. నల్ల పావులతో బరిలోకి దిగిన ఈ యువ సంచలనం ఆది నుంచి దూకుడు ప్రదర్శిస్తూ ప్రత్యర్థిని 40 ఎత్తుల్లో చిత్తు చేశాడు. 33వ ఎత్తులో అజయ్ గేమ్‌ను డ్రా చేసుకునేందుకు మొగ్గు చూపినా రిత్విక్ మాత్రం కడదాకా పోరాడి విజేతగా నిలిచాడు. ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 150 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. అండర్-15 జాతీయ చాంపియన్‌షిప్‌లో టైటిల్ విజయం ద్వారా రిత్విక్ శ్రీలంకలో జరిగే ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌తో పాటు వరల్డ్, కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌నకు భారత్ తరపున ఆడేందుకు అర్హత సాధించాడు. నగరంలోని అర్కిడ్స్ అంతర్జాతీయ స్కూల్‌లో ప్రస్తుతం పదో తరగతి చదువుతూ జాతీయ చాంప్‌గా నిలిచిన రిత్విక్‌కు రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ రెడ్డి, కార్యదర్శి కేఎస్ ప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సిద్ధమవుతున్న 'అల్గోబ్యాట్'

న్యూఢిల్లీ: కంప్యూటర్ మోడలింగ్, అల్గారిథమ్ ఆప్టిమైజేషన్ సాయంతో తక్కువ ధరలోనే అత్యుత్తమమైన క్రికెట్ బ్యాట్‌లను రూపొందించేందుకు కెనడాలోని బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు నడుం బిగించారు. దీనికి అల్గోబ్యాట్‌గా నామకరణం చేశారు. సమీప భవిష్యత్తులో ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ బ్యాట్లు మార్కెట్లోకి వస్తే క్రికెట్‌కు విశేష ఆదరణ ఉన్న భారత్ లాంటి దేశాల్లో ఎందరో క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటుంది. నూతనంగా రూపొందించిన అల్గారిథమ్స్ ప్రకారం బ్యాట్ ఉపరితలం, పరిమాణంలో మెరుగైన మార్పులు చేయడం ద్వారా మామూలు వాటి కంటే వీటితో బంతిని సులువుగా మరింత బలంగా బాదే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది క్రికెట్ ఆడుతున్నారని, ఫుట్‌బాల్ తర్వాత ఈ క్రీడకే అత్యంత ఆదరణ ఉందని అన్నారు. అయితే క్రికెట్‌ను కొత్తగా నేర్చుకుంటున్న పిల్లలు... బ్యాట్ల కోసం ఎక్కువ ఖర్చు చేయలేరని, అందుకే తక్కువ ధరలో ఉత్తమమైన వాటిని తయారు చేసేందుకు నిశ్చయించుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం నాణ్యమైన బ్యాట్ల ధర వెయ్యి డాలర్ల వరకు ఉండగా... ఈ అల్గోబ్యాట్ 30 నుంచి 40 డాలర్లలోపే ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్పారు.

శ్రీకాంత్, సింధు ముందడుగు

ప్రణయ్, ప్రణీత్ ఓటమి.. ఇండోనేషియా ఓపెన్

జకర్తా: భారత స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ఇండోనేషియా ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఈ టోర్నీలో ఎలాగైనా టైటిల్ కొట్టాలన్న పట్టుదలతో బరిలోకి దిగిన ఈ యువ షట్లర్లు ప్రత్యర్థులపై విజయాలతో ముందంజ వేశారు. బుధవారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-14, 21-13 తేడాతో జపాన్ ఆటగాడు కెంటా నిషిమోటోపై విజయం సాధించగా.... మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ సింధు 11-21, 21-15, 21-15తో అయా వోహోరీ(జపాన్)పై గెలిచి ముందడుగేసింది. 58 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో మొదటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన శ్రీకాంత్ తొలి గేమ్‌ను 21-14తో గెలిచి చివరి వరకు అదే జోరు కొనసాగించాడు. రెండో రౌండ్‌లో హాంకాంగ్‌కు చెందిన లాంగ్ అంగూస్‌తో గురువారం తలపడనున్నాడు. మరోవైపు తెలుగమ్మాయి పీవీ సింధు మాత్రం తొలి గేమ్‌ను 11-21 భారీ తేడాతో కోల్పోయి టెన్షన్ పెంచింది. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకొని రెండు గేమ్‌లను 21-15 తేడాతో చేజిక్కించుకుంది. రెండో రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన మియా బ్లిచ్‌ఫెల్ట్‌తో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రణయ్, సాయిప్రణీత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. హాంకాంగ్ క్రీడాకారుడు వాంగ్ వింగ్ కీ విన్సెంట్ చేతిలో 15-21, 21-13, 10-21 తేడాతో ప్రణీత్ పరాజయం పాలవగా... 71 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21-19, 18-21, 20-22 తేడాతో చైనాకు చెందిన రెండో సీడ్ షీ యూ కీతో చివరి వరకు పోరాడి ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్ రాంకీరెడ్డి, అశ్వినీ పొన్నప్ప జోడీ 13-21, 11-21 తేడాతో ఇండోనేషియా ద్వయం విన్నీ ఒక్టావినా కండో, టోన్‌టోవీ అహ్మద్ చేతిలో ఖంగుతిన్నది.

హైదరాబాదీ ఈషా సింగ్‌కు రజతం

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: జర్మనీ వేదికగా జరుగుతున్న జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో బుధవారం 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం ఫైనల్‌ల్లో 14 ఏళ్ల హైదరాబాదీ అమ్మాయి ఈషా సింగ్ రజత పతకం సాధించింది. మొత్తం 236.6 స్కోరు సాధించి టర్కీ షూటర్ తర్హన్(241.8) కంటే కాస్త వెనుకబడి స్వర్ణాన్ని చేజార్చుకుంది. ఇదే పోటీలో టర్కీకే చెందిన మరో క్రీడాకారిణి ఇల్‌మాజ్(215.4) కాంస్యాన్ని చేజిక్కించుకుంది. ఐఎస్ఎస్ఎఫ్ టోర్నీలో ఈషాకు ఇది తొలి పతకం. గత ఏడాది జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షూటర్లను ఓడించి ఈషా సత్తా చాటిన విషయం తెలిసిందే. 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ పురుషుల విభాగంలో బరిలోకి దిగిన అనీశ్ భన్వాల స్వర్ణ పతకంతో మెరిశాడు. 584 స్కోరుతో ప్రధాన రౌండ్‌కు అర్హత సాధించిన అనీశ్.ఫైనల్లోనూ సత్తా చాటాడు. 29 స్కోరుతో పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకోగా, ఎగరో ఇస్మకోవ్(23), ఫ్లోరియన్ పీటర్(19) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పురుషుల టీం విభాగంలో ఆగ్నేయా, రాజ్‌కన్వర్ సింగ్ సంధు, ఉదయ్ వీర్ సంధు 1709స్కోరు చేసి రజత పతకం సాధించారు. అలాగే 10మీటర్ల మిక్స్‌డ్ ఎయిర్‌రైఫిల్ విభాగంలో శ్రేయా అగర్వాల్, యశ్‌వర్ధన్ ద్వయం రజత పతకాన్ని సాధించగా... మెహులీ ఘోష్, హృదయ్ హజారికా జోడీ కాంస్యాన్ని కైవసం చేసుకుంది. టోర్నీలో ఇప్పటి వరకు భారత్ ఎనిమిది స్వర్ణాలు సహా తొమ్మిది రజతాలు, నాలుగు కాంస్య పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

దీపికకు రజతం

టోక్యో: టోక్యో(2020) ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్‌లో భారత స్టార్ ఆర్చర్ దీపికా కుమారి రజత పతకంతో మెరిసింది. తన అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులపై పైచేయి సాధిస్తూ ఆకట్టుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో ఆన్ సాన్(కొరియా) చేతిలో ఓడిన దీపిక రెండో స్థానంలో నిలిచింది. అర్హత రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలిచి ప్రధాన రౌండ్‌లోకి ప్రవేశించిన దీపికకు కొరియా ఆర్చర్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. స్వల్ప తేడాతో తొలి సెట్‌ను దక్కించుకున్న ఆన్‌సాన్ అదే జోరులో మిగిలిన రెండు సెట్లను తన ఖాతాలో వేసుకుని స్వర్ణం దక్కించుకుంది. ఫైనల్స్‌కు అర్హత సాధించే క్రమంలో సెమీస్‌లో జెంగ్ యిచాయిపై 6-0తో, క్వార్టర్స్‌లో తతియాన అంద్రోలి(ఇటలీ)పై 6-5తో దీపిక విజయాలు సొంతం చేసుకుంది. మరోవైపు లైశీరామ్ బొంబాల్యదేవి, కోమలిక బారీ ఆదిలోనే నిష్క్రమించారు. పురుషుల విభాగంలో అతాను దాస్, తరుణ్‌దీప్‌రాయ్, ప్రవీణ్ జాదవ్ ఓటములతో తమ పోరాటాన్ని ముగించారు.

మనీశ్ సూపర్ సెంచరీ

విండీస్ 'ఎ'పై భారత్ 'ఎ' భారీ విజయం

మనీశ్ పాండే (100)

నార్త్‌సౌండ్(అంటిగ్వా): కరీబియన్ పర్యటనలో భారత ద్వితీయ శ్రేణి జట్టు వరుస విజయాలతో దుమ్మురేపుతున్నది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన మూడో వన్డేలో భారత్ 'ఎ' జట్టు 148 పరుగుల తేడాతో వెస్టిండీస్ 'ఎ'పై భారీ విజయం సాధించింది. దీంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఐదు వన్డేల సిరీస్‌ను 3-0తో ముందంజ వేసింది. తొలుత టాస్ గెలిచిన టీమ్ ఇండియా..కెప్టెన్ మనీశ్ పాండే (87 బంతుల్లో 100, 6ఫోర్లు, 5సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు శుభ్‌మన్ గిల్(77) అర్ధసెంచరీతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. ఓపెనర్ అన్మోల్‌ప్రీత్‌సింగ్(0) డకౌట్‌గా నిరాశపరిచినా..గిల్, శ్రేయాస్ అయ్యర్(47) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు కరీబియన్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 109 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీర్దిదరు వెంటవెంటనే నిష్క్రమించడంతో క్రీజులోకొచ్చిన మనీశ్‌పాండే, హనుమ విహారి జతగా జోరు కొనసాగించాడు. మైదానం నలువైపులా స్వేచ్ఛగా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరిగెత్తించారు. ముఖ్యంగా మనీశ్ చూడచక్కని షాట్ల తో అలరించాడు. విహారితో కలిసి నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించాడు. కార్న్‌వాల్(2/37), షెఫర్డ్(2/51) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన విండీస్.. కృనాల్ పాండ్యా(5/25) స్పిన్ ధాటికి 34.2 ఓవర్లలో 147 పరుగులకు కుప్పకూలింది. కీమో పాల్(34), సునీల్ అంబ్రిస్(30) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ ఆటతీరు కనబరుచలేదు. విహారి(2/23)కి రెండు వికెట్లు దక్కాయి. సెంచరీతో జట్టు విజయంలో కీలకమైన మనీశ్‌పాండేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

ఈ సీజన్‌లో సత్తాచాటుతాం

తెలుగు టైటాన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: త్వరలో ప్రారంభం కానున్న ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) ఏడో సీజన్‌లో సత్తా చాటుతామని తెలుగు టైటాన్స్ జట్టు యాజమాన్యం ధీమా వ్యక్తం చేసింది. స్థానిక గచ్చిబౌలీ స్టేడియం వేదికగా ఈనెల 20 నుంచి పీకేఎల్ టోర్నీ మొదలుకాబోతున్నది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలుగు టైటాన్స్ జట్టు యజమాని శ్రీరామనేని శ్రీనివాస్ మాట్లాడారు. 'తెలుగు టైటాన్స్ జట్టు సొంతగడ్డ హైదరాబాద్‌లో అదరగొట్టేందుకు ఉత్సాహంతో ఎదురుచూస్తున్నది. స్వదేశీ, విదేశీ ఆటగాళ్ల సమాహారంతో జట్టు ఈసారి పటిష్ఠంగా కనిపిస్తున్నది. పీకేఎల్ ద్వారా చాలా మంది ఆటగాళ్లు వెలుగులోకి వచ్చారు. ప్రస్తుతం వారిప్పుడు చాలా మంది యువతకు రోల్ మోడల్స్‌గా మారారు' అని శ్రీనివాస్ అన్నారు. మరోవైపు జట్టు కోచ్ ఘోల్‌మ్రెజా మాట్లాడుతూ 'ప్రతి జట్టు ఒక్కో జట్టుతో మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. ఒక జట్టు వరుసగా రెండు

గెలిస్తే మూడో మ్యాచ్‌కు అంతగా ప్రాధాన్యముండదు. కొత్త ఫార్మాట్ ప్రకారం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ప్రతి జట్టుకు సమాన అవకాశాలున్నాయి' అని అన్నాడు. ఈ కార్యక్రమంలో స్టార్ ఆటగాడు సిద్దార్థ్ దేశాయ్, త్రినాథ్, జగదీశ్, రాష్ట్ర ఆటగాడు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కామన్‌వెల్త్ టీటీలో ఆరంభం అదుర్స్

కటక్: కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ ప్లేయర్లు తొలి రోజు అదరగొట్టారు. పురుషుల, మహిళల జట్లు బుధవారం జరిగిన గ్రూప్‌దశలో అగ్రస్థానాన నిలిచి సూపర్-8కు అర్హత సాధించాయి. పురుషు జట్టులో శరత్‌కమల్, జి.సాహిత్యన్, హర్మీత్ దేశాయ్ అద్భుతంగా రాణించి స్కాట్‌లాండ్‌ను 3-0తో ఓడించారు. అదే దూకుడుతో సింగపూర్‌ను కూడా 3-0తో మట్టికరిపించి గ్రూప్-బిలో టాప్‌లో నిలిచారు. మహిళల విభాగంలో మనికా బాత్రా, ఐహికా ముఖర్జీ, అర్చనా కమల్‌నాథ్.. శ్రీలంక జట్టును 3-0తేడాతో క్లీన్‌స్వీప్ చేశారు. ఇక దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లోనూ మధురికా పాట్కర్, సుతీర్థ ముఖర్జీ, అర్చనతో కూడిన మహిళా జట్టు 3-0తో మహిళా జట్టు విజయం సాధించి గ్రూప్-బీలో టాప్‌లోకి వెళ్లింది. మొత్తంగా భారత్ రెండు గేమ్‌లలో మాత్రమే పరాజయం చెంది, మిగిలిన వాటిలో ఘన విజయం సాధించి ముందడుగేసింది. మహిళల విభాగంలో గ్రూప్-ఏ, సీ,డీలో వరుసగా సింగపూర్, ఆస్ట్రేలియా, నైజీరియా అగ్రస్థానాన నిలిచాయి.

హిమా దాస్‌కు మరో స్వర్ణం

న్యూఢిల్లీ: భారత స్టార్ స్ప్రింటర్ హిమా దాస్ అంతర్జాతీయ టోర్నీల్లో జైత్రయాత్రను కొనసాగిస్తూ స్వర్ణ పతకాలతో మెరుస్తున్నది. చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న తబోర్ అథ్లెటిక్ మీట్‌లో బుధవారం 200 మీటర్ల పరుగు పోటీలో సత్తా చాటి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. 23.25 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి అగ్రస్థానంలో నిలిచింది. మొత్తంగా 15 రోజుల్లో హిమాకు ఇది నాలుగో స్వర్ణ పతకం కావడం విశేషం.

కపిల్ చేతుల్లో కోచ్ ఎంపిక

న్యూఢిల్లీ: భారత్ కొత్త కోచ్‌ను దిగ్గజ కపిల్‌దేవ్ సారథ్యంలోని అడ్‌హాక్ కమిటీ ఎంపిక చేయనుంది. అయితే సుప్రీం కోర్టు తర్వాతే కోచింగ్ ప్యానెల్‌పై తుది నిర్ణయం వెలువడనుంది. చీఫ్ కోచ్‌తో పాటు సహాయక బృందం కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. మూడు నిబంధనలతో నోటిఫికేషన్ విడుదల చేసిన బీసీసీఐ ఆఖరి గడువును ఈనెల 30 వరకు నిర్దేశించింది. ఇదిలా ఉంటే సచిన్, గంగూలీ, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా దారుల కమిటీ(సీఏసీ) కొనసాగించాలా వద్దా అన్న దానిపై ఎలా ముందుకు వెళ్లాలో సూచించాలంటూ సుప్రీంను సీవోఏ కోరనుంది. ఈ నేపథ్యంలో సీఏసీ విషయంలో ఎలాంటి ఆదేశాలు రాని పక్షంలో కపిల్‌దేవ్ సారథ్యంలోని అడ్‌హాక్ కమిటీ కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కారణంగా సుప్రీం నియమించిన సీవోఏ సభ్యుల్లో తిరిగి విభేదాలు తలెత్తే అవకాశముంది. ఇది వరకే భారత మహిళల క్రికెట్ టీమ్ చీఫ్ కోచ్ డబ్ల్యూవీ రామన్ ఎంపికపై సీవోఏలో చీలిక వచ్చిన సంగతి తెలిసిందే. రామన్ ఎంపిక ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందంటూ సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో తిరిగి అలా జరుగకుండా జాగ్రత్తలు పాటించే సూచనలు కనిపిస్తున్నాయి.

సెన్సెక్స్ (పాయింట్లు)	నిఫ్టీ (పాయింట్లు)
39,216	11,687
85	25

ముడి చమురు (బ్రెంట్) 63.63 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	35,500
22 క్యారెట్లు	35,330
వెండి (కిలో)	40,190

విదేశీ మారకం (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.00	71.50
యూరో	73.80	80.30
బహ్రెయిన్ దినార్	173.30	187.30
కువైట్ దినార్	216.60	230.60
సౌదీ రియాల్	17.30	19.10
యూఏఈ దిర్హామ్	17.70	19.40

అలహాబాద్ బ్యాంక్‌లో మరో మోసం

న్యూఢిల్లీ, జూలై 17: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ అలహాబాద్ బ్యాంక్ బుధవారం రూ.688 కోట్ల మోసాన్ని ప్రకటించింది. ఎస్ఈఎల్ మ్యానుఫ్యాక్చరింగ్ ద్వారా ఈ మోసం జరిగినట్లు గుర్తించామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కి తెలిపింది. బ్యాంక్ నుంచి ఎస్ఈఎల్ తీసుకున్న రూ.688.27 కోట్ల రుణం మొండి బకాయిగా మారిందని, ఎన్‌సీఎల్‌టీలో ఈ కేసు నడుస్తున్నదని చెప్పింది. అయితే సంస్థ ఖాతాను మోసంగా ప్రకటించిన బ్యాంక్ అవకతవకలను వెల్లడించింది.

భవిష్యత్.. ఈవీలదే

రాష్ట్రంలో లిథియం బ్యాటరీ ప్లాంట్లు

- ముందుకొచ్చిన మూడు ప్రముఖ కంపెనీలు
- మొత్తం పెట్టుబడి రూ.6,000 కోట్లు
- మొదటి దశలో రూ.1,500 కోట్లు
- ఏడాదిలోగా ఉత్పత్తి మొదలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో మరో మూడు ప్రముఖ కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టనున్నాయి. లిథియం అయాన్ బ్యాటరీల తయారీ యూనిట్లను ఇవి ఏర్పాటు చేయనున్నాయి. తొలిదశలో రూ.1500 కోట్లు, మొత్తం రూ.6000 కోట్ల పెట్టుబడితో ఈ తయారీ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నాయని రాష్ట్ర ఐటీ శాఖ ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సుజయ్ కారంపూరి బుధవారం మీడియాకు తెలిపారు. ఈ మూడు సంస్థలు 10 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయని పేర్కొన్నారు. రాబోయే ఒకట్రెండు నెలల్లో వీటిని ఏర్పాటుచేయనున్న సంస్థలు.. ఏడాదిలోగా ఉత్పత్తిని ప్రారంభిస్తాయని తెలిపారు. తొలిదశలో 1 గిగావాట్ సామర్థ్యంతో యూనిట్లు ప్రారంభమై, తదుపరిదశలో 10 గిగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉండనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక గిగాస్కేల్ లిథియం అయాన్ బ్యాటరీ సామర్థ్యం గల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఇటీవలే నీతి ఆయోగ్‌కు సమాచారం ఇచ్చామని సుజయ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల సామర్థ్యం గల ఎలక్ట్రిక్ వెహికిల్ పార్కును సిద్ధంచేస్తున్నదని చెప్పారు. త్వరలోనే దీని సామర్థ్యాన్ని 800 ఎకరాలకు పెంచనున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, వాటి అనుబంధరంగానికి ఉపయుక్తమైన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్నదని ఆయన వివరించారు.

తెలంగాణలో విద్యుదుత్పత్తికి కొదవ లేదు

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి చాలా దేశాలు సిద్ధం

'ఎలక్ట్రిక్ వాహనాల సదస్సు-2019'లో టీ-వర్క్స్ సీఈవో సుజయ్ కారంపూరి

బ్రిటన్, బొలివియా పరిశ్రమల ప్రతినిధులు హాజరు

బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో టీ-వర్క్స్ సీఈవో సుజయ్ కారంపూరి (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ వాహనాలే అధికంగా వినియోగంలో ఉన్నా.. త్వరలోనే ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరుగుతుందని టీ-వర్క్స్ సీఈవో సుజయ్ కారంపూరి అన్నారు. 'ఎలక్ట్రిక్ వాహనాల సదస్సు-2019'ను హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు బ్రిటన్, బొలివియా దేశాల్లోని పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజయ్ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ వాహనాలను తెలంగాణ ప్రజలకు ఏవిధంగా అలవాటు చేయాలనే అంశంపై చర్చించామని తెలిపారు. టూ, త్రీ, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాటరీ తయారీ కంపెనీలను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. తెలంగాణలో విద్యుదుత్పత్తికి కొదవే లేదని, అందుకే ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్లను నెలకొల్పడానికి చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే మూడు బ్యాటరీ సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు.

9 వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ పార్కు

9 వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ పార్కును ఏర్పాటు చేయనున్నామని, కంపెనీల రాకను బట్టి ఎలక్ట్రిక్ పార్కును 2 వేల ఎకరాలకు పెంచుతామన్నారు. ఈ పార్క్ కోసం ప్రభుత్వం సబ్సిడీ కింద భూములు కూడా ఇచ్చిందని చెప్పారు. పైలట్ ప్రాజెక్టు కింద ఆర్టీసీలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు మంచి ఫలితాలు అందించాయని, భవిష్యత్తులో మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాలను పెంచుతామని స్పష్టం చేశారు.

మహేశ్వరంలో ఈ-సిటీ

రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరంలో ఈ-సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ఈ సందర్భంగా సుజయ్ తెలిపారు. దీని ద్వారా 10 కిలోవాట్ల విద్యుత్ నిల్వ బ్యాటరీలు తయారు చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ-రిక్షా, టూ, ఫోర్ వీలర్లకు కూడా రాయితీ కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా దేశాలు ఆసక్తితో ఉన్నాయని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో రూ.6 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. బొలివియా అంబాసిడర్ జేజే కర్టేజ్ మాట్లాడుతూ.. తమ దేశంలో లిథియం నిక్షేపాలు అధికంగా ఉంటాయని, భారత్‌కు లిథియం సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. విద్యుదుత్పత్తి కంటే నిల్వ ముఖ్యమని, లిథియం ఒక్కటే విద్యుత్‌ను ఎక్కువ సమయం నిల్వ ఉంచగలుగుతుందన్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇక నీతి ఆయోగ్ నిబంధనల ప్రకారం భారత్‌కు చెందిన కొన్ని కంపెనీలు బొలివియాకు వచ్చి మైనింగ్ చేసుకోవచ్చని, తమ కంపెనీలు భారత్‌కు వచ్చి ఉత్పత్తులు అమ్మవచ్చని చెప్పారు. బ్రిటన్ హై కమిషనర్ విలియమ్ హాకిన్‌సన్ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. రాబోయే రోజుల్లో భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఒకేరోజు 6 వేల సెల్టాస్ బుకింగ్‌లు

న్యూఢిల్లీ, జూలై 17: దక్షిణ కొరియాకు చెందిన వాహన సంస్థ కియా మోటర్స్‌కు అనూహ్య స్పందన లభిస్తున్నది. తన తొలి ఎస్‌యూవీ సెల్టాస్ కోసం ముందస్తు బుకింగ్‌లను ఆరంభించిన తొలిరోజే ఏకంగా 6 వేలు వచ్చాయని కంపెనీ తెలిపింది. ఆగస్టు 22న దేశీయ రోడ్లపై దూసుకుపోనున్న ఈ కారు కోసం మంగళవారం 6,046 బుకింగ్‌లు వచ్చాయని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. వీటిలో 1,628 కార్లు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోగా, మిగతా దేశవ్యాప్తంగా 160 నగరాల్లో ఏర్పాటు చేయబోతున్న డీలర్ల ద్వారా వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ప్రతియేటా 3 లక్షల కార్లు ఉత్పత్తి కానున్నాయి.

ఇండియా ఇన్నోవేషన్ కోసం..

- 10 స్టార్టప్‌లను ఎంపిక చేసిన ఫేస్‌బుక్-టీహబ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీహబ్, ఫేస్‌బుక్ సంయుక్త మార్గదర్శకంలో 10 స్టార్టప్‌లు ఇండియా ఇన్నోవేషన్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు టీహబ్ తెలిపింది. ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, వాతావరణ మార్పులు, శాంతి, పరిశ్రమల వంటి అంశాల్లో చేసిన ఆవిష్కరణల కృషికి స్టార్టప్‌లను ఎంపిక చేశారు. ఫేస్‌బుక్‌తో కలిసి నిర్వహించిన పోటీకి దేశవ్యాప్తంగా మొత్తం 140 దరఖాస్తులు వచ్చాయని, కృత్రిమ మేధస్సు సాంకేతికత ఆధారంగా వివిధ అంశాలపై పరిష్కారాలు చూపిన పది స్టార్టప్‌లు ఎంపికైనందుకు టీహబ్ సీఈవో రవినారాయణ్ హర్షం వ్యక్తంచేశారు.

15వ ఆర్థిక సంఘం కాలవ్యవధి పొడిగింపు

- నవంబర్ 30దాకా పెంచిన కేంద్ర క్యాబినెట్

క్యాబినెట్ సమావేశం అనంతరం వివరాలను వెల్లడిస్తున్న కేంద్రమంత్రులు గోయల్, జవదేకర్

న్యూఢిల్లీ, జూలై 17: కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కాలవ్యవధిని నెల రోజులపాటు పొడిగించింది. నవంబర్ 30దాకా పెంచుతూ బుధవారం ఇక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. 2017 నవంబర్ 27న ఎన్‌కే సింగ్ నేతృత్వంలో ఏర్పాటైన 15వ ఆర్థిక సంఘం కాలపరిమితి ఈ ఏడాది అక్టోబర్ 30తో ముగుస్తున్నది. రాష్ట్రాలకు కేంద్రం ఐదేండ్లపాటు నిధుల పంపిణీ కార్యక్రమాన్ని 2020 ఏప్రిల్ 1న మొదలు పెడుతుండగా, దీనికి ఈ 15వ ఆర్థిక సంఘం సూచనలు చేయాల్సి ఉన్నది. రక్షణ, అంతర్గత భద్రతల కోసం నిధులకు సంబంధించి కూడా సలహాలు ఇవ్వాల్సి ఉన్నది. ఈ మొత్తం ఓ నివేదిక రూపంలో కేంద్రానికి సంఘం సమర్పించనున్నది. ఈ క్రమంలోనే మరో నెల రోజులపాటు సమయమిచ్చినట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ క్యాబినెట్ భేటీ అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ తెలిపారు.

దివాలా చట్టంలో సవరణలు

దివాలా చట్టం (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్-ఐబీసీ)లో సవరణలకు క్యాబినెట్ ఆమోదించింది. రిజల్యూషన్ ప్రక్రియ నిర్ణీత వ్యవధిలో సకాలంలో ముగిసేలా, హక్కులపై మరింత స్పష్టత ఇచ్చేలా ఏడు మార్పులకు అనుమతించింది. 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (సవరణ) బిల్లు-2019ను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది' అని గోయల్ చెప్పారు. ఈ సవరణలతో కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ విధానంలోని లోపాలు సరిదిద్దుకుంటాయన్న విశ్వాసాన్ని కేంద్రం వ్యక్తం చేస్తున్నది.

కంపెనీల చట్టంలో మార్పులు

కంపెనీల చట్టం-2013లో మార్పులకు కేంద్ర క్యాబినెట్ లైన్‌క్లియర్ చేసింది. ఈ ఏడాది జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ సవరణ బిల్లు రానున్నది. ఈ ప్రతిపాదిత సవరణలు దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయగలవన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా గోయల్ వెలిబుచ్చారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, ప్రత్యేక కోర్టులకు మరింత స్వేచ్ఛను కూడా అందిస్తాయన్న విశ్వాసాన్ని కనబరిచారు. చట్టంలోని లోపాలను ఆసరాగా తీసుకుని తప్పించుకుంటున్న కార్పొరేట్ నేరగాళ్లకూ తాజా సవరణలకు కళ్లెం వేయగలవన్నారు. ఇక కార్పొరేట్ గవర్నెన్స్‌లోనూ పారదర్శకత పెరుగుతుందన్నారు.

పీఎస్‌యూ ఫార్మా సంస్థలకు రుణాలు

ప్రభుత్వ రంగ ఔషధ సంస్థలకు రుణ సాయం అందించడానికి క్యాబినెట్ అంగీకరించింది. ఉద్యోగుల వేతన బకాయిలు, స్వచ్ఛంధ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ధనం, ఇతరత్ర వ్యయాల కోసం ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, రాజస్థాన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, హిందుస్థాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్‌లకు రూ.330.35 కోట్ల రుణాన్ని బడ్జెట్ మద్దతుగా కేంద్రం ఇవ్వనున్నది. కాగా, నాలుగు ప్రభుత్వ ఔషధ రంగ సంస్థలను మూసేయడమా?.. అమ్మేయడమా?.. అన్నదానిపై నిర్ణయానికి ఓ మంత్రుల కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

మిగులు నగదును ఇచ్చేయాలి!

- వచ్చే 3-5 ఏండ్లలో అప్పజెప్పాలి
- ఆర్బీఐ మిగులు నగదు నిల్వలపై జలాన్ కమిటీ నివేదిక సిద్ధం
- త్వరలో సమర్పించే అవకాశాలు

న్యూఢిల్లీ, జూలై 17: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మిగులు నగదు నిల్వలపై ఏర్పాటైన బిమల్ జలాన్ కమిటీ.. తమ సలహాలు, సూచనలను సిద్ధం చేసింది. ఈ మేరకు బుధవారం నివేదిక తుదిరూపు దాల్చింది. ఈ క్రమంలో మిగులు నగదు నిల్వలను వచ్చే 3-5 ఏండ్లలో దశలవారీగా ప్రభుత్వానికి బదిలీ చేయాలని కమిటీ సూచిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. అయితే ఈ నిల్వల్లో ఎంత మొత్తం కేంద్రానికి ఇస్తారన్న దానిపై వివరాలు తెలియరాలేదు. వివిధ అంచనాల ప్రకారం ప్రస్తుతం ఆర్బీఐ వద్ద రూ.9.6 లక్షల కోట్ల మిగులు నగదు నిల్వలున్నాయి. ఈ నిల్వలపై ఆర్బీఐకి, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు విభేదాలు ఏర్పడిన విషయం తెలిసిందే. వీటిని తమకు అప్పగించాలంటూ అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కోరగా, నాటి ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ తిరస్కరించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకోగా.. ఆర్బీఐ స్వేచ్ఛ, స్వతంత్రతలను కేంద్రం కాలరాయాలని చూస్తున్నదంటూ ప్రస్తుత డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య బహిరంగ విమర్శలు చేయడం.. సెంట్రల్ గవర్నమెంట్‌కు-సెంట్రల్ బ్యాంక్‌కు మధ్య సంబంధాలను దెబ్బతీసింది. ఇదే సమయంలో అనూహ్యంగా పటేల్ తన గవర్నర్ పదవికి రాజీనామా చేయడం పరిస్థితులను మరింత దిగజార్చింది. పటేల్ స్థానంలో ఇప్పుడున్న శక్తికాంత దాస్ రాగా, ఈ వివాదానికి విరామమిస్తూ గతేడాది డిసెంబర్ 26న ఆర్బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఆర్బీఐ నగదు నిల్వలను పరిశీలించి, నివేదించే బాధ్యతను అప్పగించారు. నిజానికి తొలిసారి సమావేశమైన 90 రోజుల్లోగా కమిటీ నివేదికను ఇవ్వాల్సి ఉన్నది. జనవరి 8న కమిటీ మొదటిసారి భేటీ అవగా, గడువు ప్రకారం ఏప్రిల్ 8లోగా సమర్పించాలి. అయితే మరో మూడు నెలల సమయాన్ని కమిటీ కోరింది. ఈ అంశానికున్న ప్రాధాన్యత దృష్ట్యా ఆర్బీఐ కేంద్ర బోర్డు అందుకు అంగీకరించగా, ఇప్పుడు ఆ కీలక నివేదికను జలాన్ కమిటీ పూర్తి చేసింది. బుధవారం కమిటీ చివరి సమావేశం జరుగగా, వీలైనంత త్వరలోనే తమ నివేదికను ఆర్బీఐకి కమిటీ అందించనుందని సన్నిహిత వర్గాల ద్వారా తెలియవస్తున్నది.

ఇందూరులో వాల్‌మార్ట్ స్టోర్ ప్రారంభం

నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన వాల్‌మార్ట్ మాల్‌ను ప్రారంభిస్తున్న స్థానిక ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్. చిత్రంలో కంపెనీ సీఈవో క్రిష్ అయ్యర్

ఖలీల్‌వాడి(నమస్తే తెలంగాణ), జూలై 17: రాష్ట్రంలో విస్తరణ ప్రణాళికను కొనసాగిస్తున్న అమెరికాకు చెందిన రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఇండియా తాజాగా నిజామాబాద్‌లో మాల్‌ను బుధవారం ప్రారంభించింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి లభిస్తున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్టోర్‌ను నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్‌మార్ట్ ఇండి యా ప్రెసిడెంట్, సీఈవో క్రిష్ అయ్యర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఇప్పటికే రెండు స్టోర్లను ఏర్పాటు చేయగా, తాజాగా నిజామాబాద్‌లో మరొకటి, ఈ ఏడాది చివరినాటికి వరంగల్‌లో స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్‌లు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో వాల్‌మార్ట్ స్టోర్ ఏర్పాటుతో ఈ ప్రాంత నిరుద్యోగులకు భారీస్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

నిరాశపరిచిన మైండ్‌ట్రీ

- తొలి త్రైమాసికంలో 41 శాతం తగ్గిన లాభం

న్యూఢిల్లీ, జూలై 17: మౌలిక రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో కొనుగోలు చేసిన మధ్యస్థాయి ఐటీ సేవల సంస్థయైన మైండ్‌ట్రీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 31తో ముగిసిన మూడు నెలలకాలానికి కంపెనీ రూ.92.7 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.158.2 కోట్ల లాభంతో పోలిస్తే 41.4 శాతం క్షీణించినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలానికి కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 11.9 శాతం ఎగబాకి రూ.1,834.20 కోట్లుగా నమోదైంది. మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.198.4 కోట్ల లాభంతో పోలిస్తే 53.3 శాతం పడిపోగా, ఆదాయం యథాతథ స్థాయిలో ఉన్నది. డాలర్ రూపంలో కంపెనీ నికర లాభం 42.7 శాతం అధికమై 13.4 మిలియన్ డాలర్లకు చేరుకోగా, ఆదాయం కూడా 9.4 శాతం పెరిగి 264.2 మిలియన్ డాలర్లకు చేరింది. పలు అనిశ్చిత పరిస్థితులు ఎదురైనప్పటికీ నిలకడైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసుకున్నట్లు, గత త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు మైండ్‌ట్రీ సీఈవో, ఎండీ రోస్టోవ్ రావనన్ తెలిపారు. క్లయింట్లతో సత్సంబంధాలు కలిగివుండటం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇండస్ట్రీ కంటే అధిక వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని ఆయన చెప్పారు. మరోవైపు సంస్థ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎల్ అండ్ టీ అధిపతి ఏఎం నాయక్ నియమితులైయ్యారు. ఈ మేరకు మైండ్ ట్రీ బుధవారం ప్రకటించింది. సంస్థలో ఎల్ అండ్ టీకి 60 శాతానికిపైగా వాటా ఉన్న విషయం తెలిసిందే.

యెస్ బ్యాంక్‌కు ఎన్‌పీఏల సెగ

- క్యూ1లో 92 శాతం తగ్గిన లాభం

న్యూఢిల్లీ, జూలై 17: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ యెస్ బ్యాంక్ లాభాలకు మొండి బకాయిల సెగ గట్టిగానే తగిలింది. గడిచిన త్రైమాసికానికిగాను బ్యాంక్ నికర లాభం 92.40 శాతం పడిపోయి రూ.95.56 కోట్లకు పరిమితమైంది. 2018 ఏడాది ఇదే కాలానికిగాను బ్యాంక్ రూ.1,265.67 కోట్ల లాభాన్ని గడించింది. మొండి బకాయిల దెబ్బకు మార్చితో ముగిసిన త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,508.44 కోట్ల నష్టాన్ని చవిచూసింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.8,301.06 కోట్ల నుంచి రూ.9,105.79 కోట్లకు పెరిగినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అదనంగా రూ.1,784 కోట్ల నిధులను వెచ్చించడంతో లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ ఏకంగా 5.01 శాతానికి చేరుకున్నాయి. నికర ఎన్‌పీఏ కూడా 0.59 శాతం నుంచి 2.91 శాతానికి ఎగిశాయి. విలువ పరంగా చూస్తే స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.12,091.10 కోట్లకు చేరుకోగా, నికర ఎన్‌పీఏ రూ.6,883.27 కోట్లుగా నమోదయ్యాయి. తాజాగా గత త్రైమాసికంలో రూ.6,232 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.

విప్రో లాభం రూ.2,388 కోట్లు

కంపెనీ సీఈవో అబిదాలి నీమూచ్‌వాలా

మొదటి త్రైమాసికంలో 12 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, జూలై 17: దేశంలో మూడో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో..విశ్లేషకుల అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.2,387.60 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.2,120.8 కోట్లతో పోలిస్తే 12.5 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.13,977.70 కోట్ల నుంచి రూ.14,716.10 కోట్లకు చేరుకున్నది. ప్రస్తుత త్రైమాసికంలో ఆదాయంలో వృద్ధి 2 శాతంగా ఉండనున్నదని అవుట్‌లుక్‌లో పేర్కొంది. ఐటీ సేవలు అందించడం ద్వారా సంస్థకు 2,038.80 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 4.3 శాతం పెరిగింది. తన పోటీ సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్‌లు నమోదు చేసుకున్న 2,046 మిలియన్ డాలర్ల నుంచి 2,087 మిలియన్ డాలర్ల మధ్యలోనే విప్రో ఆదాయం నమోదు చేసుకోవడం విశేషం. ప్రస్తుత త్రైమాసికం(జూలై-సెప్టెంబర్ మధ్యకాలం)లో ఆదాయం 2,039-2,080 మిలియన్ డాలర్ల మధ్యలో ఆదాయం నమోదవచ్చని విప్రో అంచనావేస్తున్నది. ఐటీ సేవల మార్జిన్లలో 18.4 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఆశించిన స్థాయిలో నమోదుకాలేకపోవడంతో కార్యకలాపాలపై మరింత దృష్టి సారించడం, నైపుణ్యం కలిగిన సిబ్బందికోసం అధిక స్థాయిలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నదని విప్రో చీఫ్ ఫైనాన్షియల్ అధికారి జతిన్ దలాల్ తెలిపారు. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో నమోదైన రూ.2,483.5 కోట్ల లాభంతో పోలిస్తే 3.8 శాతం పతనం చెందింది. అలాగే ఆదాయం కూడా 1.9 శాతం తగ్గి రూ.15,006 కోట్లకు పరిమితమైంది. క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడం సంస్థకు కలిసొచ్చిందని, దీంతో గత త్రైమాసికంలో 100 మిలియన్ డాలర్ల కంటే అధిక విలువైన మూడు వినియోగదారులు లభించారని విప్రో సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి నీమూచ్‌వాలా తెలిపారు. కస్టమర్లకు నూతన టెక్నాలజీ ద్వారా సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు, ఇందుకోసం భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు ప్రకటించిన ఐటీ దిగ్గజాల్లో టీసీఎస్ ఆదాయంలో 11.4 శాతం వృద్ధి నమోదవగా, అదే ఇన్ఫోసిస్ 14 శాతం పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంస్థ ఇప్పటివరకు తన ఆర్థిక ఫలితాలను ప్రకటించలేదు. మరోవైపు, విప్రో ప్రతిషేరుకు రూ.3.97 ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే 12.5 శాతం అధికమైంది. గతంలో ప్రకటించిన రూ.10,500 కోట్ల బైబ్యాక్ ప్రతిపాదనకు ఇటీవల మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతిచ్చింది. ఈ బైబ్యాక్‌లో భాగంగా 32.31 కోట్ల షేర్లను(ఒక్కో షేరుకు రూ.325 చొప్పున) తిరిగి కొనుగోలు చేయబోతున్నది. గత త్రైమాసికంలో ఐటీ ఉత్పత్తులను విక్రయించడం ద్వారా రూ.240 కోట్ల ఆదాయం సమకూరింది.

మూడేండ్లలో రూ.130 కోట్ల పెట్టుబడి

హెచ్‌ఎస్ఐఎల్ పైపుల విభాగ ప్రెసిడెంట్ రాజేశ్

హైదరాబాద్, జూలై 17: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పైపుల ఉత్పత్తి కేంద్రం సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు ప్రముఖ శానిటరీ వేర్ ఉత్పత్తుల సంస్థ హెచ్‌ఎస్ఐఎల్ ప్రకటించింది. రూ.180 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి వద్ద ఏర్పాటు చేసిన ప్లాంట్లో ప్రస్తుతం 30 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వచ్చే మూడేండ్లకాలంలో దీనిని 60 వేల మెట్రిక్ టన్నులకు పెంచనున్నట్లు హెచ్‌ఎస్ఐఎల్ పైపుల విభాగ ప్రెసిడెంట్ రాజేశ్ తెలిపారు. ఈ సామర్థ్

త్వరలో జెడ్పీలకు భవనాలు?

- జెడ్పీ చైర్మన్ల భేటీలో అధికారుల వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్లకు వాహనాలు, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో జెడ్పీ భవనాల నిర్మాణాలకు త్వరలో అనుమతులు వస్తాయని సీనియర్ ఐఏఎస్ అధికారులు వెల్లడించారు. బుధవారం హరిత ప్లాజా హోటల్‌లో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేశ్‌చంద, వికాస్‌రాజ్, నీతూకుమార్ ప్రసాద్, ఫైనాన్స్ కమీషన్ సభ్యుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు దగ్గరగా పాలన ఉండేలా చూడాలని సీఎం కే చంద్రశేఖర్‌రావు నిత్యం తమకు చెప్తారని పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ అన్నారు. ఏవిధంగా పనిచేస్తే పంచాయతీరాజ్ వ్యవస్థ బాగుంటుందని ఆరునెలలపాటు సీఎం కేసీఆర్ తమతో చర్చించారని, అలాంటి చర్చల నుంచే నూతన పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చామని చెప్పారు. గ్రామాలను బాగుచేయడానికి ముఖ్యమంత్రి పంచాయతీరాజ్‌శాఖకు బడ్జెట్‌లో రూ.1,600 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

బుధవారం హరిత ప్లాజా హోటల్‌లో మాట్లాడుతున్న స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్

గ్రాంట్స్ విడుదల చేయండి: ఎలిమినేటి సందీప్‌రెడ్డి

జిల్లా ప్రజాపరిషత్‌లను బలోపేతం చేయడానికి గ్రాంట్స్ విడుదల చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జెడ్పీ చైర్మన్ల సమావేశంలో ఫైనాన్స్ కమిషనర్ స్పెషల్ సీఎస్, మెంబర్ సెక్రటరీ సురేశ్‌చందాకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎన్నారై మహిళలకు భరోసా

ఎన్నారై ఉమెన్ సేఫ్టీ సెల్‌ను ప్రారంభించిన డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ లక్డీకపూల్‌లోని తెలంగాణ ఉమెన్ సేఫ్టి విభాగం ఆవరణలో 'ఎన్నారై ఉమెన్ సేఫ్టీ సెల్'ను డీజీపీ మహేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతిలక్రా మాట్లాడుతూ ప్రవాస భారతీయ మహిళల వివాహ సంబంధ సమస్యలు, ఆమె భర్త/ కుటుంబసభ్యుల వేధింపులు వంటి అంశాలపై ఇక్కడి పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పాస్‌పోర్టు రిజినల్ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ స్టేట్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ వైజయంతి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ త్రిపురనేని వెంకటరత్నం, 14 దేశాల ఎంబసీల ప్రతినిధులు, విదేశీ మంత్రిత్వశాఖ, పలు మహిళాపోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

బుధవారం హైదరాబాద్‌లో 'ఎన్నారై ఉమెన్ సేఫ్టీ సెల్'ను ప్రారంభించిన డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతిలక్రా తదితరులు

తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే ప్రముఖులకు కేటాయించే వీఐపీ బ్రేక్ దర్శనంలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3లను బుధవారం నుంచి రద్దుచేస్తున్నట్టు టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. సామాన్య భక్తులకు మరింత సులభంగా, సౌకర్యవంతంగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. బుధవారం తిరుమలలోని అన్నమయ్యభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండుమూడు రోజుల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్‌చేసిన అనంతరం ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దర్శనాల రద్దును అమలులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రొటోకాల్ ప్రముఖులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా దర్శనం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వీఐపీ బ్రేక్ దర్శనాలకు మూడు గంటలకుపైగా సమయం పడుతున్నదని, దీనిని అంచలంచెలుగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సంఘాల్, తిరుమల ప్రత్యేక అధికారి ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్టుకు ఎన్నారై రూ. కోటి విరాళం

ఏపీలోని గుంటూరుకు చెందిన ప్రవాసభారతీయులు జే సాంబశివ దంపతులు బుధవారం శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. విరాళం డీడీని తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేశారు.

మహానగరంలో మట్టిల్లు!

ఫాంహౌస్ కల్చర్‌కు కొత్త పరిమళం

- వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌కు అనువైన పొదరిల్లు
- ప్లాస్టిక్.. సిమెంట్ వాడకుండానే నిర్మాణం
- ఖర్చు రూ.రెండున్నర లక్షలే
- సేవ్, భారతీయం సంస్థల వినూత్న ప్రయోగం

(శిరందాస్ ప్రవీణ్‌కుమార్) హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కాలం మారుతున్నది.. కాంక్రీట్ జంగిల్స్ విస్తరిస్తున్నచోటే.. కొత్త సంస్కృతి పురుడుపోసుకొంటున్నది. పాతకాలపు మట్టివాసనల పరిమళం మరోసారి ఆహ్వానిస్తున్నది. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి జిల్లాల్లో ఫాంహౌస్ సంస్కృతి విస్తరిస్తున్న నేపథ్యంలో సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ (సేవ్), భారతీయం వంటి స్వచ్ఛంద సంస్థలు కొత్త ప్రయోగం చేస్తున్నాయి. బ్యాక్ టు నేచర్ అనే నినాదాన్ని నిజం చేస్తూ.. కాంక్రీట్ జంగిల్ లాంటి హైదరాబాద్‌లో.. పూర్వకాలపు కుటీరాలను తలదన్నేలా.. అందమైన పొదరిల్లు లాంటి మట్టి ఇండ్లను పరిచయం చేస్తున్నాయి. వాటిని చూస్తే.. వారాంతాల్లో ప్రకృతి సౌందర్యం మధ్య సేదదీరాలన్న ఆశను, ఆకాంక్షను నేరవేర్చుకోవడానికి.. ఇలాంటి ఇండ్లు చక్కగా సరిపోతాయన్న భావన కలుగుతుంది. హైదరాబాద్ గండిపేట చెరువు సమీపంలోని మియాఖాన్‌గడ్డ ప్రాంతంలో మట్టివాసనల పరిమిళం వెదజల్లే ఓ అందమైన ఇంటిని సేవ్ సంస్థ నిర్మించింది. ఎక్కడా సిమెంట్‌గానీ, ప్లాస్టిక్‌గానీ వాడలేదు. ఆఖరికి ఇంటికప్పుపై తాటికమ్మలు, ఎండుగడ్డిని బిగించేందుకు కూడా ప్లాస్టిక్ వైర్లను వినియోగించలేదు. కమ్మలు, ఎండుగడ్డితో చేసిన తాళ్లతోనే నిర్మాణం పూర్తిచేశారు. నాలుగువైపులా గోడలు, రెండువైపులా తలుపులు, కిటికీలను ఏర్పాటుచేశారు. తాటిదూలాలు, తాటివాట్ల (చెక్కలు)ను పైకప్పుకు వినియోగించారు. ఒక ఇంటి నిర్మాణానికి ఎనిమిది తాటిచెట్ల మెటీరియల్ పట్టిందని సేవ్ ప్రతినిధి సురేందర్ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ఇంటికి బయట రెండువైపులా కూర్చొనేందుకు అరుగులు నిర్మించారు. లోపల కనీసం 20 మంది, అరుగుల మీద మరో 20 మంది కూర్చోవడానికి అనువుగా ఉన్నది. ఇంటి లోపలికి గాలి, వెలుతురు సమృద్ధిగా వస్తున్నది. చుట్టూ ఉన్న పెద్దపెద్ద చెట్ల నుంచి వీస్తున్న గాలి సవ్వడిని ఆ ఇంట్లో కూర్చొని విన్నప్పుడు కలిగే అనుభూతిని మాటల్లో వర్ణించలేం. దాన్ని అనుభవించి తీరాల్సిందే. ఆ ఇంటిని ఆవుపేడతో అలికారు. జాజుతో రంగేశారు. పసుపు, కుంకుమలతో బొట్లుపెట్టారు. కేవలం రూ.2.50 లక్షల ఖర్చుతోనే నిర్మాణం పూర్తిచేశారు. వీకెండ్ ఎంజాయ్‌మెంట్ కోసం ఫాంహౌస్‌లు నిర్మించుకొనేవారు కాంక్రీట్‌కు బదులుగా.. ఇలాంటి మట్టి ఇండ్లను నిర్మించుకొంటే.. ఆహ్లాదాన్ని అనుభవించడంతోపాటు.. మన సంస్కృతిని కాపాడినవారవుతారని సేవ్, భారతీయ సంస్థలు పిలుపునిస్తున్నాయి. కాంక్రీట్ జంగిల్ నుంచి పుడమిని కొంతయినా కాపాడేందుకు చేయిచేయి కలుపాలని.. వర్షపు నీటిని ఒడిసిపట్టే అవకాశాలను చేజారనివ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నాయి. వీలైనప్రాంతాల్లో మట్టి ఇండ్లు నిర్మించుకొనేందుకు ముందుకురావాలని కోరుతున్నాయి.

వాన నీటిని కాపాడుకోవచ్చు

వ్యవసాయ క్షేత్రాల్లో కాంక్రీట్ ఇండ్లకు బదులుగా మట్టి ఇండ్లను నిర్మించుకోవడం వల్ల వాన నీటిని పొదుపుచేసుకొనే అవకాశం ఉన్నది. తెలంగాణలో ఏటా సగటు వర్షపాతం 800 మిల్లీమీటర్లు. అంటే ప్రతి చదరపు మీటరు స్థలం మీద 800 లీటర్ల వాననీరు పడుతుంది. ఎకరం భూమిలో ఒక ఏడాదిలో కురిసే వాననీటి పరిమాణం 32,36,800 లీటర్లు. ఈ నీళ్లు పొలం విడిచిపోకుండా, ఆవిరిగా మారకుండా నిల్వ పెట్టుకొనేందుకు ప్రయత్నించడం లేదు. ఒక్కొక్క ఇంటి పైకప్పు మీద ఏడాదికాలంలో 1,33,760 లీటర్ల వర్షం కురుస్తుంది. 1000 గజాల విస్తీర్ణంలో ఉన్న అపార్ట్‌మెంట్ మీద పడే వాననీటి పరిమాణం 6,68,800 లీటర్లు. ఈ నీళ్లు డ్రైనేజీల ద్వారా బయటికి పోకుండా ఇంట్లోనే వాడుకునేటట్టు, భూమిలోనే ఇంకేటట్టు మార్గాలు అన్వేషించాలి. అందుకే వ్యవసాయ క్షేత్రాల్లో కాంక్రీట్‌కు బదులుగా మట్టింటికి ప్రాధాన్యం ఇవ్వాలి.

మియాఖాన్‌గడ్డ (గండిపేట చెరువు దగ్గర)లో నిర్మించిన మట్టి ఇల్లు

ఇంటి పైకప్పును వేసేందుకు ఉపయోగించిన తాటిచెక్కలు

మట్టింటి ప్రయోజనాలు

- అతి తక్కువ ఖర్చుతో నివాసయోగ్యం
- అన్ని కాలాల్లోనూ గాలి, వెలుతురు సమృద్ధిగా రావడం వల్ల ఆరోగ్యం పదిలం
- దుర్వాసన, కాలుష్యానికి పరిష్కారం
- వ్యవసాయ క్షేత్రంలో గడపడం వల్ల శారీరక శ్రమతో ఆరోగ్యం
- మట్టిలో చెప్పుల్లేకుండా నడువడం వల్ల కాళ్లు, పాదాలకు బలం
- కాంక్రీటుకు బదులుగా మట్టిని వినియోగించడం వల్ల కొంతయినా ప్రకృతి పరిరక్షణ
- పిల్లలకూ పాతకాలపు ఆచారాలను, సంస్కృతిని పరిచయం చేయొచ్చు
- వేసవిలో బయట 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ మట్టింట్లో చల్లదనాన్ని ఆస్వాదించొచ్చు
- ఫ్యాన్లు, ఏసీల అవసరం లేదు. కరంటు పొదుపు.

మట్టిల్లు మహాద్భుతం

కాంక్రీట్ కల్చర్ ఇలాగే పెరిగితే వాతావరణం మరింత దెబ్బతింటుంది. ప్రకృతిని ఆస్వాదించి, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవాలనే ఆకాంక్షతో నిర్మించే ఫాంహౌస్‌ల్లోనూ భవంతుల వల్ల లక్ష్యం నెరవేరదు. పూర్వకాలపు ఆచారాలే ఆరోగ్యకరం. కనీసం వ్యవసాయ క్షేత్రాల్లోనైనా మట్టిండ్లు నిర్మించుకోవాలి. మేము హైదరాబాద్ నగరానికి దగ్గరలోనే మట్టింటిని నిర్మించాం. కేవలం రూ.2.50 లక్షలతోనే పూర్తయ్యింది. ఇక్కడే వేదఘోష, గోశాల వంటివి ఉన్నాయి. ఈ మట్టిల్లును మహాద్భుతంగా ప్రచారం చేస్తున్నాం. దీనిని అనేక సంస్థల ప్రతినిధులు చూసి వెళ్లారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఇలాంటి ఇండ్ల నిర్మాణాల్లో ఎంజాయ్‌మెంటును వెదుక్కోవచ్చు. ప్రకృతిని కాపాడుకుందాం. మట్టి ఇండ్లు నిర్మించుకుందాం.

- సురేందర్, సేవ్ సంస్థ ప్రతినిధి

మట్టింట్లో నివాసమే ఆరోగ్యం

మట్టి స్పర్శ శరీరానికి మంచిది. నేల, గోడలు.. మట్టితో ఉండటం వల్ల ఆరోగ్యం పదిలం. గాలి, వెలుతురు బాగా వస్తుంది. దాంతో ఏ రోగమూ దగ్గరికి రాదు. మట్టిల్లు, కాంక్రీటు ఇంటి ఉష్ణోగ్రతల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. కాలానికి తగ్గట్టుగా మనిషి శరీరానికి అవసరమైన ఉష్ణోగ్రతలు మట్టి ఇంట్లోనే సాధ్యం. వ్యవసాయ క్షేత్రాల్లోనూ కాంక్రీట్‌తో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. పట్టణాల్లో మాదిరిగానే ఫ్యాన్లు, ఏసీలు, గీజర్లు వాడుతున్నారు. ఇంకేం తేడా ఉన్నది? ఆరోగ్యాన్ని కాపాడే ప్రాకృతిక జీవనం కావాలంటే పొలాల్లో లేదా ఫాంహౌస్‌ల్లో మట్టి ఇండ్లనే నిర్మించుకోవాలి. వీలుదొరికినప్పుడల్లా చెట్ల కింద భోజనం చేయాలని, పొలాల్లో గడపాలని మా మెడికల్ సెంటర్‌కు వచ్చేవాళ్లకు చెప్తుంటాం.

- డాక్టర్ రమేశ్‌సాగర్,
వివేకానంద మెడికల్ సెంటర్, హయత్‌నగర్

ఎరువుల సరఫరాకు సిద్ధంగా ఉండాలి

మార్క్‌ఫెడ్‌ను ఆదేశించిన వ్యవసాయశాఖ

మార్గదర్శకాలు జారీచేసిన ముఖ్యకార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలో ఎరువుల కొరత రాకుండా సన్నద్ధంగా ఉండాలని మార్క్‌ఫెడ్‌ను వ్యవసాయశాఖ ఆదేశించింది. అందుకోసం బఫర్‌స్టాక్ కింద తప్పనిసరిగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. 3 లక్షల టన్నుల యూరియా, 70 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 30 వేల టన్నుల డీఏపీ నిల్వలను ఉంచాలని కోరింది. వానకాలంలో ఎరువుల సరఫరా, పంపిణీ, పర్యవేక్షణపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి బుధవారం మార్గదర్శకాలు జారీచేశారు. నెలవారీగా ఎంతమొత్తంలో ఎరువులు సరఫరా చేయాలన్న అంశంపై జిల్లా వ్యవసాయాధికారులకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. ఇందుకనుగుణంగా ఎరువులను సరఫరా చేయాలని సూచించారు. పంటల విస్తీర్ణం, సాగును దృష్టిలో ఉంచుకుని సరఫరా జరుగాలని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లను రిటైలర్‌గా గుర్తిస్తున్నట్టు తెలిపారు. ఎరువులు గ్రామాలకు చేరగానే.. రైతులకు తెలియజేసేలా దండోరా వేయించాలని, రేక్‌పాయింట్ నుంచి అందజేయడంలో వ్యవసాయాధికారులు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. భూసార కార్డుల ఆధారంగా రైతులకు ఎరువులు సరఫరా చేస్తామని, నష్టాల్లో ఉన్న ప్యాక్స్‌లకు ఎరువులను కేటాయించకూడదని పార్థసారథి స్పష్టంచేశారు.

సునామీని పసిగట్టే అడ్వాన్స్‌డ్ డివైజ్

సరికొత్త పరికరాన్ని రూపొందించిన తెలంగాణ తేజం

యువఇంజినీర్‌కు భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ రూ.10 లక్షల రివార్డు

చందానగర్, నమస్తే తెలంగాణ: సునామీని ముందస్తుగా గుర్తించి.. ప్రాణ, ఆస్తినష్టం నుంచి బయటపడేందుకు అడ్వాన్స్‌డ్ డివైజ్‌ను రూపొందించాడు తెలంగాణ యువఇంజినీర్. ఖమ్మం జిల్లా, ఏనుకూరు మండలం, నూకలంపాడు గ్రామానికి చెందిన దమ్మాలపాటి అప్పారావు, లక్ష్మి దంపతుల రెండోకుమారుడు దమ్మాలపాటి బాబు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో తనకున్న పరిజ్ఞానంతో సునామీ అలర్ట్ అడ్వాన్స్‌డ్ డివైజ్ తయారీకి పూనుకున్నాడు. అప్డేటెక్నాలజీలో ఉద్యోగంచేస్తూనే.. వారి ప్రోత్సాహంతో ఈ డివైజ్ రూపకల్పనకు పూనుకున్నాడు. రూ.35 వేల ఖర్చుతో చేసిన ప్రయత్నాలు రెండుసార్లు విఫలమయ్యాయి. మూడోసారి రూ.70 వేల ఖర్చుతో అడ్వాన్స్‌డ్ సునామీ అలర్ట్ డివైజ్‌ను రూపొందించాడు. దానిని గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్‌తో అనుసంధానం చేశాడు. సునామీ అలర్ట్‌ను డివైజ్‌లో తెలుసుకోవడంతోపాటు ఫోన్‌నంబర్‌కు సమాచారం వెళ్లేలా ప్రోగ్రామ్ సెట్‌చేశాడు. సునామీ అలర్ట్ డివైజ్ 12 గంటల ముందే హెచ్చరికలు చేస్తుంది. డివైజ్‌ను సముద్రతీరం వద్ద 10 కి.మీ. దూరంవరకు పెట్టొచ్చు. డివైజ్ తయారీ సమయంలోనే బాబు గచ్చిబౌలిలోని మహాసముద్ర సమాచార సేవాకేంద్రం డైరెక్టర్, సివిల్ సర్వీస్ అధికారి డాక్టర్ సతీశ్ (కేరళ)కు తన ప్రయోగం గురించి వివరించాడు. డివైజ్‌ను పూర్తిచేసి.. ప్రయోగపత్రాలను వారికే అందజేశారు. డివైజ్ రిపోర్టును సతీశ్‌బృందం కేంద్రంలోని భూవిజ్ఞానమంత్రిత్రశాఖకు పంపింది. వచ్చే స్వాతంత్ర్యదిన వేడుకల్లో రూ.10 లక్షల రివార్డు, ప్రశంసాపత్రాన్ని ఇవ్వనున్నట్టు కేంద్రం ప్రకటించింది.

సునామీ అలర్ట్ అడ్వాన్స్‌డ్ డివైజ్ సెటప్ ఇదే

దమ్మాలపాటి బాబు

అటవీశాఖ జీవనాధారం

రాష్ట్ర అటవీశాఖ ముఖ్యసంరక్షణ అధికారి పీకే ఝా

పేట్‌బషీరాబాద్: జీవకోటికి అటవీశాఖనే జీవనాధారమని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ముఖ్యసంరక్షణ అధికారి పీకే ఝా చెప్పారు. రాష్ట్రంలో అడవుల సంరక్షణ, అభివృద్ధి కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నామని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లిలోని రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీలో దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ అటవీ పరిశోధన సమావేశం బుధవారం నిర్వహించారు. అటవీ అభివృద్ధితోపాటు అనుబంధ రంగాల పరిశోధనలపై భవిష్యత్‌లో తీసుకొనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పీకే ఝా మాట్లాడుతూ.. ప్రతి చెట్టు భవిష్యత్ తరాలకుచేసే మంచిని వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 33 శాతం అడవులను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం జయప్రదంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అదనపు ముఖ్యసంరక్షణ అధికారి రఘువీర్, ఐఎఫ్ఎస్ మునీంద్ర, భారతీయ అటవీ పరిశోధన,శిక్షణ మండలి డైరెక్టర్ జనరల్ ఎస్సీ గైరోలా, అటవీ జీవవైవిధ్య సంస్థ డైరెక్టర్ డీ జయప్రసాద్, డాక్టర్ రత్నాకర్, అరుల్‌రాజన్, శాస్త్రవేత్తలు డాక్టర్ జీఆర్ఎస్ రెడ్డి, ప్రవీణ్ హెచ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అసెంబ్లీలో సీటు వివాదం

- ఇరకాటంలో చంద్రబాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ అసెంబ్లీలో సీటు సర్దుబాటు వివాదం బుధవారం అధికార వైఎస్సార్సీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదానికి దారితీసింది. సభలో చంద్రబాబు పక్కన సీటులో అచ్చెన్నాయుడు కూర్చోవడంపై అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్ రూలింగ్ ఇచ్చిన ప్రకారం ఎవరి సీట్లలో వారు కూర్చోవాలని పట్టుబట్టారు. బుచ్చయ్యచౌదరి కేటాయించిన స్థానంలో ఆయనే కూర్చోవాలనికానీ అచ్చెన్నాయుడు ఎలా కూర్చుంటారని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై టీడీపీ సభ్యులు పోడియం వైపు వెళ్లడానికి ప్రయత్నించగా స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తంచేశారు.

మలేరియా నిర్మూలనలో స్టేజ్-1 స్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మలేరియా విస్తరించకుండా చర్యలు చేపట్టడంలో తెలంగాణ స్టేజ్-1 స్థానంలో ఉన్నదని నేషనల్ వెక్టర్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నోడల్ అధికారి డాక్టర్ సుమలత తెలిపారు. రాష్ట్రాల వారీగా మలేరియా వ్యాధి శాశ్వత నిర్మూలన చర్యల్లో భాగంగా ప్రణాళికల రూపకల్పనపై బుధవారం రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులతో ఆమె సమావేశమయ్యారు. 2030 లక్ష్యంగా మలేరియా శాశ్వత నిర్మూలనకు కృషిచేయడం, రాష్ట్రంలో మలేరియా విస్తరించకుండా తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందించడంపై చర్చించారు. జిల్లాలవారీగా చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వైద్యాధికారులు, మలేరియా విభాగాలతో సమావేశమై తుది ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల వైద్యాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 18 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

గొంతులో కిచ్ కిచ్!

గొంతులో కిచ్‌కిచ్‌గా ఉందా.. ఎన్ని ట్యాబ్లెట్లు వాడినా తగ్గట్లేదా.. టీవీల్లో వచ్చే యాడ్స్ చూసి ఆ మందులు వాడినా తగ్గట్లేదా.. వంటింట్లోని పదార్థాలతో గొంతునొప్పిని తగ్గించుకోవచ్చు. ఈ చిన్న చిట్కాలు పాటించి చూడండి.



- గొంతులో ఇబ్బందిగా ఉంటే ఒక టేబుల్ స్పూన్ తేనె తీసుకోవాలి. ప్రతీ మూడు గంటలకోసారి తీసుకుంటూనే ఉండాలి. ఇలా చేయడం వల్ల గొంతు సమస్యలు త్వరగా నయమవుతాయి.
- దాల్చిన చెక్కపొడిని తేనెతో కలిపి క్రమం తప్పకుండా రెండు రోజులు తీసుకుంటే గొంతులో కిచ్‌కిచ్ తగ్గిపోతుంది.
- బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరానికి రక్షణ లభిస్తుంది. దాల్చిన చెక్క పొడి చర్మ వ్యాధులను దూరం చేస్తుంది. తేనె, దాల్చినచెక్క పొడిని సమానంగా తీసుకుని సమస్య ఉన్న చోట పూస్తే ఎగ్జిమా, ఇతర స్కిన్ ఇన్‌ఫెక్షన్లు దూరమవుతాయి.
- తేనె, దాల్చినచెక్క పొడిని పేస్టు మాదిరిగా చేసుకొని పడుకునే ముందు ముఖానికి పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా రెండు వారాల పాటు చేస్తే మొటిమలు మొత్తం మటుమాయమవుతాయి.
- రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కంటే అరగంట ముందు పరగడుపున కప్పు నీటిలో తేనె, దాల్చిన చెక్కపొడి వేసుకుని మరిగించి తాగాలి. రాత్రి పడుకునే ముందు కూడా తీసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల బరువు తగ్గుతారని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

**చినుకులు అప్పుడప్పుడూ పలుకరిస్తున్నా.. సాయంత్రం కాస్త చల్లబడి..
మనసు సేదతీరేలా చేస్తుంది ప్రకృతి.. ఈ ఆనందం రెండింతలు కావాలంటే..
ఒంట్లోకి కాస్త వేడిగా జుర్రుకునేలా ఏదైనా ఉంటే.. అబ్బా.. ఆలోచనే సూపర్ అనిపిస్తుంది కదా!
సుర్రుమంటూ పొగలు కక్కే సూప్‌లు.. ఈ కాలంలో మంచి ఉపశమనాన్నిస్తాయి..
అందుకే ఆ వెరైటీలనే మీకందిస్తున్నాం..
ఆస్వాదించండి..**

సుర్.. సూపర్!

వెజ్ క్లియర్ సూప్

కావాల్సినవి :

క్యారెట్ : 1, **బీన్స్ :** 2, **గోబీ :** పావు కప్పు ముక్కలు,
మష్రూమ్స్ : 3, **బేబీకార్న్ :** 1, **చక్కెర :** చిటికెడు,
ఉప్పు : తగినంత, **స్ప్రింగ్ ఆనియన్ :** గార్నిష్ కొరకు

తయారీ :

క్యారెట్, బీన్స్, గోబీ, మష్రూమ్, బేబీకార్న్ సన్నగా, సమానంగా తరిగి పెట్టుకోవాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి తగినంత ఉప్పు, చక్కెర వేయాలి. కాసేపు మరిగాక.. అందులో క్యారెట్, బీన్స్, గోబీ, మష్రూమ్స్, బేబీకార్న్ వేసి బాగా ఉడికించుకోవాలి. దీన్ని ఒక బౌల్‌లో పోసి స్ప్రింగ్ ఆనియన్స్‌తో గార్నిష్ చేయాలి. దీన్ని ఏదైనా స్నాక్స్‌తో పాటు సర్వ్ చేసుకుంటే టేస్టీగా ఉంటుంది.

ప్రాన్ లెమన్ సూప్

కావాల్సినవి :

రొయ్యలు : ఒక కప్పు
నిమ్మకాయలు : 2
కొత్తిమీర : చిన్న కట్ట
పచ్చిమిర్చి : 2
క్యాబేజీ తురుము : పావు కప్పు
క్యారెట్ : 1
కార్న్‌ఫ్లోర్ : 2 టీస్పూన్స్
నూనె : 1 1/2 టీస్పూన్స్

తయారీ :

రొయ్యలను కొంచెం ఉప్పు వేసి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. నిమ్మకాయ రసం తీసి పెట్టాలి. క్యాబేజ్, క్యారెట్‌లను సన్నగా, పొడవుగా కోసుకోవాలి. కార్న్‌ఫ్లోర్‌లో కొన్ని నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలిపి పెట్టాలి. ఇప్పుడు ఒక గిన్నెలో నూనె పోసి.. క్యారెట్, క్యాబేజ్, పచ్చిమిర్చి వేసి దోరగా వేయించాలి. ఇందులో ఉడికించిన రొయ్యలను వేసి కలుపాలి. ఇవి కూడా కాస్త వేగిన తర్వాత.. నీరు, కొత్తిమీర, ఉప్పు వేసి బాగా మరగబెట్టాలి. నీరు మరుగుతున్నప్పుడు కొత్తిమీర, ఉప్పు వేసి రెండు నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత కార్న్‌ఫ్లోర్ వేసి తగినంత చిక్కదనం వచ్చేవరకు ఉంచి దించేయాలి. ఈ సూప్‌ని ఒక బౌల్‌లోకి తీసుకొని కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

సిల్వర్ చికెన్ సూప్

కావాల్సినవి :

చికెన్ బోన్‌లెస్ : అర కప్పు
క్యాబేజీ తురుము : అర కప్పు
క్యారెట్ తురుము : ఒక కప్పు
పచ్చిమిర్చి : 2
కార్న్‌ఫ్లోర్ : 2 టీస్పూన్స్
కొత్తిమీర : చిన్న కట్ట
వెనిగర్ : ఒక టీస్పూన్
చక్కెర : పావు టీస్పూన్
కోడిగుడ్డు : 1 (తెల్లసొన)
నూనె : అర టీస్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

చికెన్‌ని చాలా చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. కోడిగుడ్డులోని తెల్లసొనను బాగా గిలక్కొట్టాలి. ఎలా అంటే.. తెల్లని నురగ వచ్చేవరకు అలా చేయాలి. ఇప్పుడు గిన్నెలో నూనె పోసి చికెన్, క్యాబేజ్, క్యారెట్ తురుము, పచ్చిమిర్చి, కొత్తిమీర వేసి దోరగా వేయించాలి. ఇవి వేగాక.. నీళ్లు పోసి మరిగించాలి. ఐదు నిమిషాలు మరిగిన తర్వాత వెనిగర్, ఉప్పు, చక్కెర, కార్న్‌ఫ్లోర్ వేసి చిక్కబడేంత వరకు ఉడికించాలి. చివరగా కొత్తిమీర, గుడ్డు తెల్లసొనని వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. టేస్టీ.. సూప్ రెడీ!

మిన్స్‌డ్ మష్రూమ్ సూప్

కావాల్సినవి :

మష్రూమ్స్ : 100 గ్రా.
బటర్ : 3 టీస్పూన్స్
క్యారెట్ : 1
ఉల్లిగడ్డ : 1 (చిన్నది)
మిరియాలు : అర టీస్పూన్
పలావు ఆకు : 1, **క్రీమ్ :** 50 మి.లీ. **మైదా :** 2 టీస్పూన్స్, **ఉప్పు :** తగినంత

తయారీ :

మష్రూమ్స్‌ని శుభ్రం చేసి ఉడికించాలి. వీటిని కీమా చేసుకొని పక్కన పెట్టాలి. కడాయిలో బటర్ కరిగించి మైదాను దోరగా వేయించాలి. వేరొక పాన్ మరికొంత బటర్ వేసి ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్ ముక్కలు, మిరియాలు, పలావు ఆకు వేసి దోరగా వేయించాలి. వేగుతున్న దీంట్లో మైదా వేసి నీరు పోసి ఉండలు కట్టకుండా జాగ్రత్తగా కలుపుకోవాలి. ఇవి మరిగిన తర్వాత ఈ మిశ్రమాన్ని వడపోయాలి. ఈ గిన్నెను మళ్లీ స్టౌ మీద పెట్టి అందులో మష్రూమ్స్, క్రీమ్, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. చిక్కబడేంత వరకు ఉంచి దించేయాలి. అంతే.. టేస్టీ సూప్ మీ నోరూరిస్తుంది.



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

టమాటా ఎగ్‌డ్రాప్ సూప్

కావాల్సినవి :

టమాటాలు : 250 గ్రా., **బటర్ :** 3 టీస్పూన్స్
మైదా : 2 టీస్పూన్స్ , **చక్కెర :** చిటికెడు ,
పలావు ఆకు : 1, **మిరియాలు :** అర టీస్పూన్
క్యారెట్ : 1, **ఉల్లిగడ్డ :** 1 (చిన్నది)
కోడిగుడ్డు : 1 (తెల్లసొన)
ఉప్పు : తగినంత

తయారీ :

టమాటాలను స్లయిస్‌లుగా కట్ చేసుకోవాలి. క్యారెట్, ఉల్లిపాయ ముక్కలను పెద్దగా కట్ చేయాలి. కడాయిలో బటర్ వేసి.. అందులో మైదా దోరగా రంగు మారిపోకుండా వేయించి పక్కన పెట్టుకోవాలి. దీనిని కాసేపు చల్లారనివ్వాలి. గిన్నెలో బటర్ కరిగించి మిరియాలు, పలావు ఆకు, క్యారెట్, ఉల్లిపాయలు దోరగా వేయించి, సన్నగా తరిగిన టమాటాలు వేసి వేగనివ్వాలి. దీంట్లో కొంచెం నీరు పోసి మరిగించాలి. ఇప్పుడు ఇందులో దోరగా వేయించిన మైదాని వేసి కలుపాలి. కొంచెం చిక్కబడిన తర్వాత దించేసి ఈ మిశ్రమాన్ని వడకట్టాలి. ఆ వడకట్టిన నీటిని మళ్లీ మరిగించి, దాంట్లో ఎగ్ వైట్ వేసి కలిపి రెండు నిమిషాలు ఉంచి దించేయాలి. వేడి.. వేడి.. సూప్ అందరికీ సూపర్‌గా నచ్చుతుంది.

కాలుష్యాన్ని అరికట్టడమే బాధ్యతగా!

అంతటితో ఆగకుండా ఫ్యాక్టరీలో వెలువడే వ్యర్థ పదార్థాలను డ్రైనేజ్‌లో కలుపుతూ మరింత నష్టం కల్పిస్తున్న ట్యాంకర్ డ్రైవర్‌ను సాక్ష్యాధారాలతో పోలీసులకు అప్పజెప్పిందో మహిళ.

కర్ణాటకకు చెందిన భీమపుత్రి బ్రిగేడ్ వ్యవస్థాపకురాలు రేవతి రాజ్ మైసూర్ రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తుండేది. అలా ఆ ప్రయాణంలో 'రాజా కలువే' అనే కాలువ వద్దకు రాగానే చెడు వాసన వస్తుండడం పసిగట్టింది. రేవతి తన స్నేహితులతో కలిసి రెండు రోజులు అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ప్రాంతంలోని మెట్రో కార్మికులు ట్యాంకర్లను తీసుకొని వచ్చి రసాయనాలను నీటిలో కరిగించి కాలువలోకి విడుదల చేస్తున్నారు. వీరిని పోలీసులకు సాక్ష్యాధారాలతో పట్టించాలనుకున్నది రేవతి. వారంరోజుల తర్వాత తెల్లవారుజామున ట్యాంకర్ కాలువవైపు వెళ్తున్నట్లు గమనించింది. ట్యాంకర్‌ను అనుసరిస్తూ ఆమె కూడా వెళ్లింది. డ్రైవర్ ఆమెను చూసి ట్యాంకర్ వదిలేసి అక్కడి నుంచి పరార్ అయ్యాడు. ట్యాంకర్‌లో దాదాపు 12,000 లీటర్ల రసాయన కాలుష్యం ఉన్నట్లు వెల్లడైంది. ఈ సంఘటన గురించి బైతారాయణపుర స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఆ కేసును పట్టించుకోలేదు. 'ఈ సంఘటనకు సంబంధించిన వీడియో నా దగ్గరే ఉంది. మీరు గనుక యాక్షన్ తీసుకోకపోతే పై అధికారుల వద్దకు తీసుకెళ్తాను' అని పోలీసులతో ధైర్యంగా మాట్లాడింది. దీంతో పోలీసులు ట్యాంకర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగించారు. రేవతి ధైర్య సాహసాలకు కర్ణాటక ప్రజలు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

సమయాన్ని ఆదా చేయండి

- ఇకనుండి ప్రతిరోజు మొబైల్ వాడకాన్ని అరగంటకు మాత్రమే పరిమితమయ్యేలా జాగ్రత్త తీసుకోవాలి. రోజులో పొద్దున 10 నిమిషాలు, మధ్యాహ్నం 10 నిమిషాలు, రాత్రి 10 నిమిషాలు వాడేలా ప్లాన్ చేయాలి. కేటాయించిన సమయాల్లో మనకు వచ్చిన ముఖ్యమైన కాల్స్, మేసేజ్‌లకు రిప్లై ఇవ్వాలి.
- అలాగే ఏదైనా ముఖ్యమైన పనిని మొదలు పెట్టేటప్పుడు మన మొబైల్ ఫోన్‌ని సైలెంట్ మోడ్‌లో ఉంచడం చాలా మంచిది. ఎందుకంటే ఒక పనిని మొదలు పెడతాం. ఏదో ఒక ఫోన్ కానీ మెసేజ్ కానీ రావడం వల్ల మనసు అటువైపు డిస్ట్రాక్ట్ అయ్యి చేయాల్సిన పని మీద ఏకాగ్రతను కోల్పోతాం. ఇలా ప్రతి ఒక్కరికీ జరిగే ఉంటుంది.
- కొంతమంది చిన్న పనిని సైతం చాలా పర్‌ఫెక్ట్‌గా చేయాలనుకుంటారు. కానీ ఎక్కువ సమయం తీసుకుంటారు. ఇలా సమయాన్ని వృథా చేస్తుంటారు. కాలపరిమితిని ముందే విధించుకొని పని మొదలుపెడితే సమయం వృథా కాకుండా ఉంటుంది.
- మల్టీ టాస్కింగ్ అనేది మంచి గుణమే. ఒకరిలా ఉండడానికి ప్రయత్నించి తప్పులు చేయకూడదు. అలా తప్పులు చేసి ఈజీగా పూర్తి చేయాల్సిన పని కోసం సమయం వృథా చేయడం మంచిది కాదు.

చీర కట్టు.. ఫొటో పెట్టు..

పొలిటిషియన్ ప్రియాంక చతుర్వేది పోస్ట్ చేసిన ఫొటో

సారీచాలెంజ్‌లో ప్రముఖ నటి సుజాన్ బెర్నర్ట్

సోషల్ మీడియాలో అప్పడప్పడూ కొన్ని చాలెంజ్‌లు వైరల్ అవుతుంటాయి. ఇప్పుడు ట్విట్టర్‌లో ఓ చాలెంజ్ సాగుతున్నది. అదే 'సారీ ట్విట్టర్' చాలెంజ్!

ఎంత మోడ్రన్ డ్రెస్‌లు అయినా చిన్నబోవాల్సిందే చీరకట్టులో. ఇలాంటి చీరకట్టును ట్రెండ్ చేసి అలవాటులేని వాళ్లతో కూడా చీరకట్టిస్తే ఎలా ఉంటుంది. ఇదో చాలెంజ్‌లా స్వీకరిస్తే చీరకట్టుపై కొత్తవాళ్లకు ఆసక్తి పెరుగుతుంది కదా! ట్విట్టర్ వేదికకగా ఈ చాలెంజ్ నడుస్తున్నది. #SareeTwitter హ్యాష్ ట్యాగ్‌తో వారం రోజులుగా ఈ చాలెంజ్ వైరల్ అవుతున్నది. విదేశీయులు కూడా ఈ చాలెంజ్‌ను స్వీకరించి చీరకట్టు ఫొటోలు ట్వీట్ చేస్తున్నారు. సెలెబ్రెటీలు, వీఐపీలు సైతం ఈ చాలెంజ్‌లో పాల్గొంటున్నారు. దీంతోపాటు #JhumkaTwitter చాలెంజ్ కూడా ఉంది. అమ్మాయిలు అందమైన జుంకాలు ధరించి ఆ ఫొటోలను పోస్ట్ చేస్తున్నారు. దానికి అబ్బాయిలు స్పందిస్తూ పగ్‌డీ (తలపాక) ధరించి ఫొటో పెడుతున్నారు. #paghditwitter హ్యాష్ ట్యాగ్‌తో ఈ చాలెంజ్ నడుస్తున్నది. ఇట్లా వారి వారి సంప్రదాయ కట్టును తెలిపేందుకు ఆయా ప్రాంతాల వారు ఈ చాలెంజ్‌ను స్వీకరిస్తున్నారు.

వంటింటి చిట్కాలు

- ఆమ్లెట్ వేసేటప్పుడు కొద్దిగా శనగపిండి, కొబ్బరికోరు, మసాలా పొడి వేస్తే ఎంతో రుచికరంగా ఉంటుంది.
- టమాటా కూర ఉడికేటప్పుడు చిటికెడు చక్కెర వేస్తే కమ్మని వాసన వస్తుంది.
- గంజిలో కాస్త తేనె, నారింజ రసం కలుపుకొని తీసుకుంటే మంచిది.
- బిర్యానీ వండేటప్పుడు నిమ్మకాయ రసం పిండితే అన్నం గడ్డలుగా కాకుండా పొడిపొడిగా ఉంటుంది.

నల్లటి వలయాల్ని పోగొట్టుకోండిలా..

పనిఒత్తిడి, నిద్రలేమి, డిప్రెషన్ అతిగా మొబైల్ వాడకం, అతిగా కంప్యూటర్లు చూడడం తదితర కారణాల వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఈ చిన్న టిప్స్ పాటిస్తే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడవచ్చు.

- కళ్ల చుట్టూ నల్లటి వలయాలను తొలగించడంలో టమాటా అద్భుతంగా పనిచేస్తుంది. టమాటా రసం, నిమ్మరసాన్ని ఒక గిన్నెలో వేసి కలపాలి. డార్క్ సర్కిల్స్ దగ్గర రాయాలి. పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
- కాస్త దూది తీసుకుని బంగాళా దుంపల రసంలో ముంచండి. కళ్లు మూసుకుని, ఆ దూదిని కళ్లపై పెట్టుకోండి. దూది, డార్క్ సర్కిళ్లు మొత్తం కవరయ్యేలా పెట్టుకోవాలి. పదినిమిషాల తర్వాత వాటిని తీసేసి, కళ్లను శుభ్రం చేసుకోవాలి.
- చల్లటి టీ బ్యాగులను నీటిలో తడిపి, కాసేపు ఫ్రిజ్‌లో పెట్టండి. తర్వాత వాటిని మీ కళ్ల కింద ఉన్న నల్లటి వలయాలపై పెట్టుకోవాలి. ఇలా రోజూ చేస్తే చక్కని ఫలితం కనిపిస్తుంది.
- బాదాంలో విటమిన్ ఇ ఉంటుంది. బాదాం నూనె చర్మాన్ని కోమలంగా ఉంచుతుంది. రాత్రి పడుకునే ముందు ఈ నూనెను కళ్లకింద నల్లటి వలయాలకు రాసి కాసేపు మర్దన చేయాలి. రాత్రంతా అలాగే వదిలేసి, ఉదయం కళ్లను శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే వారంలో సత్ఫలితాలు కనిపిస్తాయి.

నమస్తే తెలంగాణ
విశేష
[కరీంనగర్]
గురువారం 18 జూలై 2019

ఆడవే మగ చేపలవుతున్నాయి!

ఈ రోజుల్లో పురుషులు, స్త్రీలుగా మారిపోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు రక రకాల శస్త్ర చికిత్సలున్నాయి. కానీ ఎటువంటి ఆపరేషన్‌లే కుండానే ఆడ చేపలు మగ చేపల్లా మారిపోతున్నాయి. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది మాత్రం ఓ విశేషమే.

ఇటీవల కొందరు ఆడవారు మగవారిలా, మగవారు ఆడవారిలా మారుతున్నారు. కొన్ని చేపల్లో మాత్రం ఎటువంటి శస్త్రచికిత్సలతో పని లేకుండానే లింగమార్పిడి జరుగుతున్నది. న్యూజిలాండ్‌లోని ఒటాగో శాస్త్రవేత్తలు లింగ మార్పిడి చేసుకునే చేపలపై ప్రత్యేకంగా పరిశోధనలు జరిపారు. నీలి రంగు తల ఉండే ప్రస్సే, క్లోన్‌ఫిష్ జాతికి చెందిన ఆడ చేపలు మధ్యవయసులో మగ చేపలుగా మారుతున్నాయట. ఇదే విషయాన్ని పరిశోధనా బృందంలోని సభ్యుడైన ఎరికా టడ్ అనే శాస్త్రవేత్త తెలిపారు. మొదట్లో ఆడ చేపలు మగ చేపలతో కలిసి జీవిస్తాయి. మగ చేప చనిపోయిన తర్వాత వాటి జీవన ప్రక్రియ పూర్తిగా మారిపోతుంది. పరిస్థితులకు అనుగుణంగా అది నెమ్మదిగా మగ చేపలా ప్రవర్తిస్తుంది. ఆ తర్వాత వాటిలో గర్భం దాల్చేందుకు ఉపయోగపడే ఈస్ట్రోజన్ హార్మోన్ 'అరోమాటసీ' ఉత్పత్తి నిలిచిపోతుంది. అనంతరం శరీర మార్పులు జరుగుతాయి. వృషణాలు ఏర్పడి పూర్తిగా మగ చేపల్లా మారిపోతున్నాయట. అవి నెమ్మదిగా మగ చేపల్లా ఆడ చేపలతో ప్రత్యుత్పత్తిలో పాల్గొంటున్నట్టు పరిశోధకులు తేల్చారు.

ట్వీట్

తాప్సీ
@taapsee

అందరూ ఏదో యాప్‌లో డిజైన్ చేసిన ఫొటోలు పెట్టి క్రేజీగా ఫీలవుతున్నారు. కానీ నా ఫొటో చూడండి. ఏ యాప్ నుంచి చేసింది కాదు. ఇది ఒరిజినల్. 'సాండ్ కీ ఆంఖ్' సినిమా కోసం ఇలా మారాను. ఈ సినిమా దీపావళికి రానుంది.

తాప్సీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
38,03,781

కామన్‌మ్యాన్ వాయిస్

అబద్ధానికి సాక్ష్యం అవసరం లేదు. కానీ నిజాన్ని నిరూపించడానికి సాక్ష్యం అవసరం!
– Anala Mekala

ఉచిత స్కూటీ: అబద్ధం
పెన్షన్‌లో రూ. 800 వాటా: అబద్ధం
అకౌంట్లో 15 లక్షలు: అబద్ధం
నల్లధనం వెనక్కి తేవడం: అబద్ధం
అచ్చేదిన్: అబద్ధం
మధ్యతరగతి సచ్చేదిన్: ఇదొక్కటే నిజం
కాదు అని ఎవరైనా అంటే నిరూపించండి!
– Koteshwar Baggy

వైరల్ వీడియో

సిటీలో కిరాయి ఇల్లు కావాలంటే అంత ఈజీగా దొరుకుతుందా? పోనీ దొరికినా మనకు అనుకూలంగా ఉంటుందా? ఇంటి యజమాని పెట్టే కండీషన్లన్నీ సాధ్యమవుతాయా? కిరాయింటి కష్టాలేంటో చూడండి.

Rent House Kashtalu || Racha Gang || Tamada Media
Total views : 2,10,150+
Published on Jul 15, 2019

సుడోకు

డైలీ సుడోకు 94 సమాధానం

3	5	2	9	1	6	8	4	7
9	1	4	8	7	3	6	5	2
8	6	7	4	5	2	9	1	3
7	3	6	1	8	5	4	2	9
4	9	1	6	2	7	3	8	5
2	8	5	3	9	4	1	7	6
1	7	8	5	6	9	2	3	4
5	4	9	2	3	1	7	6	8
6	2	3	7	4	8	5	9	1

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -95

7	3					4		
					2			9
			6	4			2	1
	4	8		2				7
			4		1			
3				7		2	4	
1	7			8	5			
2			1					
		9					1	4

లగ్జరీ ఫ్రూట్!

సీజన్‌లో కొన్ని పండ్లకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. ఆ సమయంలో మామూలు రోజుల కంటే రెండు మూడు రెట్లు అధిక ధరకు అమ్ముతుంటారు. కానీ ఓ దేశంలో కిలో ద్రాక్ష ధర ఏకంగా లక్ష దాటింది. ఎందుకంత రేటు?

జపాన్‌లో 'రుబీ రోమన్ గ్రేప్స్'గా పిలిచే ఈ ద్రాక్ష పండ్లను చాలా అరుదుగా పండిస్తారు. వీటికి ప్రతి ఏటా గిరాకీ పెరుగుతూ వస్తున్నది. జపాన్‌లోని ఇషికావా దీవిలో వీటిని పరిమితంగా పండిస్తారు. పంట కోతకు వచ్చాక మొదటి విక్రయంలో ఒక ద్రాక్ష గుత్తిని వేలం వేస్తారు నిర్వాహకులు. ఒక్కో ద్రాక్ష గుత్తిని కొనుగోలు చేయడానికి వందల మంది పోటీపడుతుంటారు. ఇటీవల జరిగిన వేలంలో కిలో ద్రాక్ష 11వేల డాలర్లు (భారత కరెన్సీలో రూ.7.5 లక్షలు) వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ గుత్తిని ఎవరు సొంతం చేసుకున్నారన్న విషయాన్ని మాత్రం నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. 11 ఏండ్ల నుంచి నిర్వహిస్తున్న ఈ వేలంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి అధిక ధర పలికింది. ధరకు తగ్గట్టే ఈ ద్రాక్ష పండ్లు చాలా రుచిగా ఉంటాయట. సాధారణ రోజుల్లో కూడా రోమన్ గ్రేప్స్ గుత్తి ధర రూ.31,537 వరకు ఉంటుంది. కొన్ని హోటళ్లలో ధనికులకు ప్రత్యేకంగా అందిస్తారు. సంపన్నులు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. కాబట్టి దీన్ని 'లగ్జరీ ఫ్రూట్' అని కూడా పిలుస్తారు.

విచిత్ర వజ్రాల బావి!

కాల గర్భంలో కలిసిపోయిన రహస్యాలు చాలానే ఉన్నాయి. అటువంటి రహస్యాలు ఇప్పటికీ అంతు చిక్కకుండా మిస్టరీలుగానే మిగిలిపోయాయి. ఓ అటవీ ప్రాంతంలో విచిత్ర బావి ఉన్నది. అది వింత బావిగా ఎందుకు మారిందో తెలుసా!

అసోంలోని గౌహతికి దక్షిణ దిశలో 80 మైళ్ల దూరంలో ఎత్తైన కొండపై ఓ వింత బావి ఉన్నది. అక్కడి గిరిజనులు దానిని వజ్రాలకొండగా పిలుస్తారు. ఆ బావికి ఓ కథ ఉన్నది. పూర్వం ఆ కొండ ప్రాంతంలో దేవతల రాజు ఇంద్రుడికి వజ్రాసుడు అనే రాక్షసుడికి భయంకరమైన యుద్ధం జరిగిందట. ఆ సమయంలో ఇంద్రుడి వజ్రాయుధం పొరపాటుగా నిలువుగా ఆ కొండ మీదకి జారడంతో దాని ప్రభావంతో కొండ లోపల మరొక బావి ఏర్పడింది. ఇప్పుడు కూడా ఆ బావి ఆకృతి ఆయుధం అచ్చు పడినట్లుగా కనిపిస్తుందట. అలా పడిన వజ్రాయుధాన్ని ఇంద్రుడు తన చేతిలోకి తీసుకుని ఆ రాక్షసుడిని వధించాడట. ఆ సమయంలో రాక్షసుడి తలతోపాటు వజ్రాయుధం బావిలోనే పడిపోయాయట. వజ్రాయుధం బావిలో పడడం వల్ల ఇప్పటికీ అందులో వజ్రాలు దొరుకుతాయని చెబుతుంటారు. అందులోకి వెళ్లడానికి ప్రత్యేకంగా మెట్లు లేవు. పెద్ద పెద్ద గోడలు మాత్రమే ఎక్కడానికీ, దిగడానికీ అనువుగా ఉంటాయి. ఈ బావి గురించి తెలుసుకున్న వారు వజ్రాలు తెచ్చుకోవచ్చనే ఆశతో వెళుతుంటారు. కానీ అలా వెళ్లిన వారెవరి శవం కూడా లభ్యం కాలేదు. అసలు అక్కడికి వెళ్లిన వారెందుకు కనిపించకుండా పోతున్నారో ఇప్పటికీ రహస్యంగానే మిగిలిపోయింది.

అరుదైన పక్షులకు ఆత్మీయుడు!

మలుకాన్, మండేరిన్ డక్స్, కరోలినా డక్స్, మకావ్ ఈ పేర్లు ఎప్పుడైనా విన్నారా? ఇవన్నీ విదేశీ పక్షి జాతుల పేర్లు. వాటిని చూడాలంటే విదేశాలకు వెళ్లాల్సిన పనిలేదు. రంగురంగుల్లో ఉండే ఈ పక్షులు ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

2001లో హైదరాబాద్‌లో ఓ వ్యక్తి నల్లహంసలను పెంచడం చూశారు. వాటిని చూసినప్పటి నుంచి శ్రీనివాసరావుకు అరుదైన పక్షులను పెంచాలనే ఆలోచన కలిగింది. 2007లో ఓ వ్యక్తి శ్రీనివాసరావు దగ్గరకు మలుకాన్ అనే విదేశీ పక్షిని తీసుకువచ్చాడు. దానిని చూడగానే ఆయన ముచ్చట పడి రూ.1,50,000 లకు కొనుగోలు చేశారు. కొన్నాళ్లకు దానికి తోడుగా మరో జంట పక్షిని తీసుకువచ్చారు. అలా ఒక్కో పక్షి జాతిలో ఆడ, మగ పక్షులను పెంచడం ప్రారంభించారు. మొదట్లో అవి మన వాతావరణాన్ని తట్టుకోలేక ఇబ్బంది పడ్డాయి. శ్రీనివాసరావు ఆయా పక్షులు పెరిగేందుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 200లకు పైగా ఫారెన్ బర్డ్స్‌తో 'మినీ జూ' ఏర్పాటు చేశారు.

> మూగ జీవులు పంచే ప్రేమ ఎంతో విలువైనది. వాటితో గడపడం వల్ల మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉండగలుగుతున్నాం. మన దగ్గర విదేశీ పక్షులు లేవు. వాటిని చూడడానికి ప్రతి రోజూ చాలామంది సందర్శకులు వస్తుంటారు.
> –పానుగోటి శ్రీనివాసరావు, జంతు ప్రేమికుడు

రంగురంగుల పక్షులతో..

రంగురంగుల పక్షుల కిలకిలరావాలతో ప్రతి రోజూ శ్రీనివాసరావు ఫామ్‌హౌజ్ సందడిగా కనిపిస్తుంటుంది. మండేరిన్ డక్స్, కరోలినా డక్స్, మకావ్ వంటి పక్షి జాతులున్నాయి. మన దేశానికి చెందిన పక్షులను పంజరంలో పెట్టకూడదనే నిబంధన ఉన్నది. విదేశీ పక్షులకు అటువంటిదేమీ లేదు. ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోగలిగే వాటినే ఎంపిక చేసుకుని తీసుకువస్తారు. అలాంటి బర్డ్స్‌నే ఇక్కడ పెంచుతుంటారు.

జాగ్రత్తలు తీసుకుంటారు..

ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటే గానీ పక్షుల పెంపకం సాధ్యం కాదు. వీటిని రాత్రింబవళ్లు చూసుకోవడానికి నలుగురు వ్యక్తులున్నారు. పక్షులకు అనువైన వాతావరణాన్ని అందించడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాటి కోసం రెల్లుగడ్డి పాకలు నిర్మించారు. దీని వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. శ్రీనివాసరావు దంపతులిద్దరూ ఉదయం, సాయంత్రం పక్షుల ఆలనా పాలనా దగ్గరుండి మరీ చూసుకుంటారు. పక్షుల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా వైద్యుణ్ణి నియమించారు. ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవి నివసించే గదుల్లోకి పాములు, ఎలుకలు చేరకుండా పరిశుభ్రంగా ఉంచుతారు. వాటికి ప్రత్యేకంగా ఓ ఫుడ్ మెనూ ఉన్నది. ఉదయం ఉడికించిన ధాన్యాలు, మధ్యాహ్నం పండ్లు, కూరగాయ ముక్కలు, సాయంత్రం ఆయిల్‌తో చేసిన ఆహారం అందిస్తుంటారు. వాటి జీవిత కాలం? అవి ఏ కాలంలో పిల్లలను పొదుగుతాయి? ఇటువంటి సమాచారాన్ని సేకరించి వాటిని మాత్రమే పెంచుతుంటారు. వాటి పోషణ విషయంలో ఏదైనా సందేహం వస్తే విదేశాల్లో ఉన్న పెంపకందారులను అడిగి తెలుసుకుంటారు. హైదరాబాద్‌లోని జెన్‌టెక్‌లో వాటికి పరీక్షలు చేయించి అవి ఆడ,మగ అని నిర్ధారణ అయిన తర్వాత జంట పక్షిని తెప్పిస్తుంటారు. మన దేశంలో పక్షుల వలే ఇవి కూడా గుడ్లు పెట్టి పొదిగి పిల్లలను చేస్తాయి.

అవార్డులందుకున్నారు..

పక్షులతోపాటు శ్రీనివాసరావు అరుదైన ఆవులను కూడా సంరక్షిస్తున్నారు. వీటిలో పుంగనూరు, సాహివాల్, గిర్, నగోరి, కాంక్రెజ్, కపిల వంటి అరుదైన ఆవు జాతులున్నాయి.'క్షీర ధార' పేరుతో డైరీ ఉత్పత్తులను అందిస్తున్నారు. వాటిని సాంప్రదాయ పద్ధతిలోనే రూపొందిస్తున్నారు. అరుదైన జాతి ఆవులను సంరక్షించినందుకు శ్రీనివాసరావుకు బయోడైవర్సిటీ అవార్డు, పాడి రైతు అవార్డులు వచ్చాయి.

జగిత్యాల జిల్లా వెల్గటూరుకు చెందిన పానుగోటి శ్రీనివాసరావు హైదరాబాద్‌లో ఫామ్‌హౌజ్‌లో ఇలా విదేశీ పక్షులను పెంచుతున్నారు. రంగురంగుల పక్షులు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాటితోపాటు అంతరించిపోతున్న అరుదైన జాతి ఆవులను సంరక్షిస్తున్నారు.

...✍ పసుపులేటి వెంకటేశ్వరరావు

భార్యను మోసే పోటీలు!

ప్రతి ఏటా ఓ దేశంలో భార్యను మోసే పోటీలు జరుగుతాయి. మోయడమంటే అంత సులువేం కాదు. సాహసంతో కూడిన పోటీలనే చెప్పాలి. ఎందుకంటే అందులో ఉండే షరతులు అలా ఉంటాయి మరి. ఇంతకీ ఎక్కడంటే?

ఫిన్‌ల్యాండ్‌లో భార్యను మోసే పోటీలు నిర్వహిస్తుంటారు. 24ఏండ్లుగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎంపిక పోటీలు (ప్రిలిమినరీస్) కూడా ఉంటాయి. వెబ్‌సైట్‌ల ద్వారా ప్రచారం చేసి.. ప్రిలిమినరీస్ నిర్వహించి అందులో ఎంపికయిన వారిని మాత్రమే ఫైనల్స్‌కు పంపిస్తారు. ఫైనల్స్ ఫిన్‌ల్యాండ్‌లో జరుగుతాయి. పోటీల్లో భాగంగా భార్యను మోసుకుంటూ 253.5 మీటర్ల దూరం వరకూ పరిగెత్తాల్సిఉంటుంది. నీళ్లు, బురద గుంటలను దాటుకుంటూ ఆమెను నేలకు తగలకుండా నిర్దేశించిన లక్ష్యం వరకూ తీసుకెళ్లాలి. అలా ఎవరు తక్కువ సమయంలో టార్గెట్ రీచ్ అవుతారో వారిని విజేతలుగా ప్రకటిస్తారు. 19 వ శతాబ్దానికి చెందిన రాంకైనెన్ రాబర్ అనే దొంగ కథ నుంచి స్ఫూర్తి పొంది ఈ పోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. దొంగతనాలకి పనికి వస్తారో లేదో తెలుసుకోవడానికి రాంకైనెన్ ఇటువంటి పోటీ పెట్టేవాడట.



మొదట్లో జరిగిన పోటీల్లో ధాన్యం కానీ, బతికి ఉన్న పందుల్ని గానీ మోసేవాళ్లట. ప్రస్తుతం ఆ పోటీలే భార్యను మోసుకెళ్లే పోటీలుగా మారాయి. ఈ పోటీల్లో పాల్గొనడానికి, చూడటానికి ప్రపంచవ్యాప్తంగా ఇక్కడకు వస్తారు. ఈ ఏడాది పోటీల్లో మొత్తం 12 జంటలు పాల్గొన్నాయి. వారిలో వైటాటాస్ కిర్కియాస్కాస్, అతని భార్య నెరింగా కిర్కియాస్కీన్ విజేతలుగా నిలిచారు. వీరి జంట ఈ పోటీలో గెలువడం వరుసగా రెండోసారి. గతంలో ఆరుసార్లు విజేతలుగా నిలిచిన టైస్టో మియెట్టినెన్,కట్జా కోవనెన్ జంటపై ఈ ఏడాది వైటాటాస్ కిర్కియాస్కాస్ దంపతులు విజయం సాధించారు. అది కూడా తక్కువ సమయంలో అంటే కేవలం 0.1 సెకన్లు తేడాతో గెలువడం విశేషం.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

ఎయిర్ ఇండియాలో ఖాళీలు

న్యూఢిల్లీలోని ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్) వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- ఏఐఈఎస్ఎల్ అనేది ఎయిర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచే సంస్థ. ఈ పోస్టులను ఐదేండ్ల కాలానికి భర్తీచేస్తారు. అభ్యర్థి పనితీరును బట్టి మరో ఐదేండ్లవరకు పొడిగిస్తారు.
- **పోస్టు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్
- **మొత్తం ఖాళీలు:** 125 (జనరల్-51, ఈడబ్ల్యూఎస్-12, ఓబీసీ-35, ఎస్సీ-18, ఎస్టీ-9)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్ లేదా 10+2 (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) ఉత్తీర్ణత. B737-700/800/900 ఎయిర్‌క్రాఫ్ట్‌లో పనిచేసి ఉండాలి.

నోట్: ఈ పోస్టులను ముంబై, నాగ్‌పూర్, ఢిల్లీతోపాటు దేశంలోని ఎక్కడైనా భర్తీచేస్తారు.

- **పే స్కేల్:** రూ.95,000-1,28,000/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/- ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.500/-
- **ఎంపిక విధానం:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** అర్హత కలిగిన అభ్యర్థులందరూ నిర్ణీత నమూనాలో దరఖాస్తును నింపి, డిమాండ్ డ్రాఫ్ట్, సంబంధిత సర్టిఫికెట్లతో నేరుగా పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 26-30
- **వెబ్‌సైట్:**www.airindia.in

ప్రాజెక్టు అసోసియేట్లు

చెన్నైలోని సీడాక్‌లో ప్రాజెక్టు అసోసియేట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- ప్రాజెక్టు అసోసియేట్-7 ఖాళీలు (ఢిల్లీ-2, ముంబై-1, విశాఖపట్నం-1, కోల్‌కతా-2, కొచ్చి-1)
- **అర్హతలు:** బీఈ/బీటెక్/ఎంసీఏ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత లేదా బీ లెవల్‌తోపాటు ఏడాది అనుభవం ఉండాలి లేదా పీజీ సీఎస్ఈ/ఎలక్ట్రానిక్స్ లేదా ఐటీ ఉత్తీర్ణత. 35 ఏండ్లు మించరాదు.
- ప్రాజెక్టు అసోసియేట్-4 ఖాళీలు
- **అర్హతలు:** బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** https://cdac.in

ఓయూలో దూరవిద్య

ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య విధానంలో 2019-20 విద్యాసంవత్సరానికి గాను వివిధ యూజీ, పీజీ, పీజీ డిప్లామా కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **అర్హత:** పీజీ కోర్సులకు సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఇంటర్, పీజీ డిప్లామా కోర్సులకు ఏదైనా డిగ్రీ/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. ఎంబీఏ/ఎంసీఏ కోర్సులకు డిగ్రీతోపాటు టీఎస్/ఏపీ ఐసెట్-2019 లేదా పీజీఆర్ఆర్‌సీడీఈ నిర్వహించే అర్హత పరీక్షలో పాసవ్వాలి.
- **పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు:** ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ (ఇంగ్లిష్, హిందీ, తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సైకాలజీ), ఎంకామ్, ఎమ్మెస్సీ (మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్)
- **గ్రాడ్యుయేట్ కోర్సులు:** బీఏ, బీకాం జనరల్, బీబీఏ, బీఏ (మ్యాథ్స్ & స్టాటిస్టిక్స్)
- **పీజీ డిప్లామా కోర్సులు (ఏడాది):** మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్

గమనిక: ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, పీజీ డిప్లామా ఇన్ డాటా సైన్స్ కోర్సులను ప్రారంభించనున్నారు.

- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 30
- **వెబ్‌సైట్:** www.oucde.net

కర్ణాటక బ్యాంకులో క్లర్కులు

మంగళూరులోని కర్ణాటక బ్యాంక్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న ప్రొబేషనరీ క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు:** ప్రొబేషనరీ క్లర్క్
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ప్రాంతీయ భాషతోపాటు హిందీ, ఇంగ్లిష్ మాట్లాడాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 2019, జూలై 1 నాటికి 26 ఏండ్లు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **జీతం:** నెలకు రూ.37,000/-
- **ప్రొబేషనరీ పీరియడ్:** ఆరు నెలలు
- **అప్లికేషన్ ఫీజు:** రూ.600/-, ఎస్సీ/ఎస్టీలకు రూ.500/-)
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)
- **పరీక్ష కేంద్రాలు:** బెంగళూరు, ఢిల్లీ, ధార్వాడ్-హుబ్లీ, మంగళూరు, ముంబై, మైసూర్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** www.karnatakabank.com

స్టయిఫండరీ ట్రెయినీలు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో స్టయిఫండరీ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** స్టయిఫండరీ ట్రెయినీ (సైంటిఫిక్ అసిస్టెంట్)
- **మొత్తం పోస్టులు:** 37
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్ ఇంజినీరింగ్-12, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్-6, బీఎస్సీ ఫిజిక్స్-2, కెమికల్ ఇంజినీరింగ్-10, ఎలక్ట్రానిక్స్-4, కెమిస్ట్రీ-6, సివిల్ ఇంజినీరింగ్-3
- **వయస్సు:** 2019 ఆగస్టు 3 నాటికి 18-25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత బ్రాంచీలో డిప్లామా ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.

(పదోతరగతి తర్వాత డిప్లామా చేసి ఉండాలి), బీఎస్సీ పోస్టులకు ఫిజిక్స్/కెమిస్ట్రీ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **స్టయిఫండ్:** మొదటి ఏడాది రూ.16,000/- రెండో ఏడాది రూ.18,000/-
- శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న తర్వాత నెలకు కనీస జీతం రూ.35,400/- (లెవల్-6) చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

III.
నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 18 జూలై 2019
raithubadi@ntnews.com

ప్రస్తుత పరిస్థితుల్లో..

గోరుచిక్కుడు సాగు మేలు

ప్రస్తుతం వర్షపాతం లోటు ఉన్నది. ఈ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికీ నీటి ఎద్దడిని తట్టుకుని కచ్చిత దిగుబడి ఇచ్చే పంటల్లో ప్రధానమైంది గోరుచిక్కుడు. ఈ నెల చివరి వరకు సమృద్ధిగా వానలు పడకున్నా ఈ పంటను సాగు చేసుకోవచ్చు. గోరుచిక్కుడు కాయగూరగ, పశుగ్రాసంగా, జిగురు ఉత్పత్తి కోసం దేశవ్యాప్తంగా సాగులో ఉన్న పంట ఇది. వర్షాధారంగా అంతగా సారవంతం కాని భూముల్లోనూ బాగా పండుతుంది. నీటి ఎద్దడిని సమర్థవంతంగా తట్టుకుని నిలబడుతుంది. పశుగ్రాసం కోసం వరికి ప్రత్యామ్నాయంగా పూర్తిగా పశుగ్రాస పంటగా కూడా దీన్ని వాడుకోవచ్చు.

గోరుచిక్కుడు పోషకాల గని కూడా. ఈ కాయ గింజల్లో 18 శాతం ప్రోటీన్, 32 శాతం పీచు పదార్థాలు, 30-33 శాతం జిగురు ఉంటుంది. భారత్ నుంచి విదేశాలకు ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో 'గోరు చిక్కుడు' జిగురు ప్రధానమైనది. రాజస్థాన్ లాంటి నీటి ఎద్దడి రాష్ట్రాల్లోనూ రైతులకు మేలైన ఆదాయాన్ని అందిస్తున్న పంట. మన రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పాటు తక్కువ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో ఈ పంట సాగు చేయడానికి అనుకూల వాతావరణం ఉన్నది.

వాతావరణం: గోరు చిక్కుడు ఉష్ణమండల పంట. సాగు చేయడానికి వేడి వాతావరణం అవసరం. తొలిదశలో ప్రత్యేకించి మొలకెత్తే సమయంలో పంటకు 30-35 డిగ్రీల ఉష్ణోగ్రత అవసరం. శాఖీయ దశలో 32-38 డిగ్రీల ఉష్ణోగ్రత కావాలి. పూత దశలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే పంట పొడువుగా ఎదుగుతుంది. గాలిలో అధికంగా తేమతో ఆకు మాడు, వేరు కుళ్లు సమస్య ఎక్కువవుతుంది.

నేల: ఉదజని సూచిక 7-8.5 మధ్య ఉండి మధ్యస్థ, తేలికపాటి నేలల్లో ఈ పంట బాగా పెరుగుతుంది. నీటి నిల్వ ఉండే భూములు, నల్లరేగడి భూముల్లో ఈ పంటను వేయరాదు. అధికంగా తేమను అధికంగా నిలుపుకునే నేలల్లో ఈ పంట వేయకపోవడమే మంచిది.

నేల తయారీ: నేలలో నీళ్లు ఇంకే విధంగా తయారుచేయాలి. ముందుగా లోతు దుక్కి చేసి, ఆ తర్వాత రెండు, మూడుసార్లు దుక్కి చేయాలి. ఇది పప్పుధాన్యపు పంట. కాబట్టి భూమిలో నత్రజనిని స్థాపించి భూసారాన్ని పెంచుతుంది.

విత్తనం నాటే సమయం: వర్షాధార ప్రాంతాల్లో జూలై చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనం నాటడం పూర్తి చేయాలి. ఆ తర్వాత వేసే పంటలో దిగుబడి తగ్గిపోతుంది.

విత్తటం: చాలామంది రైతులు విత్తనం వెదజల్లుతుంటారు. అయితే సిఫార్సు మేరకు ఎకరాలో నిర్దేశించిన మొక్కల సాంద్రత ఉండేలా చేసేందుకు, అలాగే మొలక శాతం పెరిగేందుకు, అంతర సేద్యపు పనులకు వరుసలలో నాటాలి. శాఖలు, కొమ్మలు ఉత్పత్తి చేసే రకాలను వరుసల మధ్య 50 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ దూరంతో నాటుకోవాలి. ఏక కాండం ఉండే రకాలైతే వరుసల మధ్య 30 సెం.మీ దూరం సరిపోతుంది. నాగలితో లేదా సీడ్ డ్రిల్‌తో విత్తనం వేయాలి.

విత్తన మోతాదు: ఎకరాకు 6 కిలోల చొప్పున విత్తనం వాడాలి. కిలోగ్రాము విత్తనానికి 4 గ్రాముల ట్రైకోడెర్మా లేదా 2 గ్రాముల కార్బండిజంతో శుద్ధి చేయాలి. ఆ తర్వాత రసం పీల్చే పురుగుల మందుతో శుద్ధి చేయాలి. సిఫార్సు చేసిన రైజోబియం జీవన ఎరువును కిలో విత్తనాలకు 40 గ్రాముల చొప్పున పట్టించాలి. 200 గ్రాముల బరువున్న రైజోబియం కల్చర్‌ను 250 గ్రాముల బెల్లం ద్రావకంతో కలిపి ఒక లీటరు నీటిలో ఉంచి ద్రావణం తయారుచేయాలి. అలాంటి రైజోబియం మిశ్రమ ద్రావణాన్ని విత్తనాలపై పొరగా ఏకరీతిగా పట్టించాలి. ఆ తర్వాత నీడలో అరగంట పాటు ఆరబెట్టాలి. 24 గంటలలోపు ఆరిన విత్తనాలను నేలలో విత్తాలి.

ఎరువులు: ఇది పప్పుజాతి పంట. కాబట్టి తొలి దశలో కొద్ది మొత్తంలోనే ప్రారంభ సిఫార్సుగా నత్రజని అవసరం. హెక్టారుకు 20 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం అవసరం. వీటిని విత్తనం నాటేటప్పుడే వేయాలి. విత్తటానికి 15 రోజుల ముందు హెక్టారుకు 2.5 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం: ఉష్ణ, ఉప ఉష్ణ ప్రాంతాలలో గోరు చిక్కుడును పూర్తిగా వర్షాధారంగా పండించవచ్చు. అయితే పూత, విత్తనం ఏర్పడే దశలో నీటి ఎద్దడి ఉంటే ఒక నీటి తడిని తప్పకుండా ఇవ్వాలి. పంట వ్యర్థాలను హెక్టారుకు 3-5 టన్నుల చొప్పున వేస్తే నేలలో తేమ శాతం పెరుగుతుంది. వర్షాధార పరిస్థితులలో పంట విత్తిన 25, 45 రోజుల తర్వాత 0.1 శాతం థయోయూరియా పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయి.

రకాలు

కాయగూరల కోసం: పూసా నవబాహార్, పూసా సదా బాహార్, దుర్గా బాహార్
విత్తనాల జిగురు కోసం: హెచ్‌జీ-365, హెచ్‌జీ-563, ఆర్‌సీజీ-1066, ఆర్‌సీజీ-1003
పశుగ్రాసాల కోసం: హెచ్‌ఎఫ్‌జీ-119, హెచ్‌ఎఫ్‌జీ-156

రకం	దిగుబడి హెక్టారుకు క్వింటాళ్లు	పంటకాలం రోజులలో	లక్షణాలు
ఆర్‌సీజీ-1003	10-12	85-95	మొక్కలు శాఖలుగా ఉంటుంది. 50-85 సెం.మీ ఎత్తు పెరుగుతుంది. వర్షాధార సాగుకు అనుకూలం. విత్తనంలో 30 శాతం జిగురు ఉంటుంది.
ఆర్‌సీజీ-1066	10-15	85-90	ఏక కాండం కల్గిన రకం. మొక్కలు 60-90 సెం.మీ ఎత్తు పెరుగుతాయి. వాన కాలం, ఎండకాలం సాగుకు అనుకూలం.
హెచ్‌జీ 365	12-15	85-90	వర్షాధార సాగుకు, నీటి వసతి పరిస్థితులలో సాగుకు అనుకూలం.
హెచ్‌జీ 563	12-13	85-90	గింజలు 33 శాతం జిగురు కలిగిఉంటాయి. 60-100 సెం.మీ పొడవు పెరుగుతుంది. కాయల పొడవు 5-7 సెం.మీ

కలుపు యాజమాన్యం: గడ్డి జాతి, వెడల్పాటి ఆకు జాతి కలుపు సమస్య వానకాలంలో ఎక్కువ. పంట తొలి 30-35 రోజులలో కలుపు నివారణ చేపట్టాలి. 25,45 రోజులలో రెండుసార్లు చేతితో కలుపు తీయాలి. కూలీల కొరత ఉంటే హెక్టారుకు 2.5-3.3 లీటర్ల పెండిమిథాలిన్ కలుపు మందును 500 లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు నాటిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి. లేదా పంట విత్తిన తర్వాత 20-25 రోజులకు హెక్టారుకు 400 గ్రాముల చొప్పున ఇమజితాపిర్ కలుపు మందును 500 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేసి కూడా కలుపు నివారించవచ్చు.

పంటను ఆశించే తెగుళ్లు-నివారణ

బ్యాక్టీరియా తెగులు: ఐదు గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లేదా 50 గ్రాముల ప్లాంటామైసిన్ 100 గ్రాముల నీటిలో కలిపి 35-40 రోజుల పంటకు హెక్టారులో పిచికారీ చేయాలి.
ఆల్టర్ నేరియా ఆకుమచ్చ: తెగులు లక్షణాలు గమనించిన వెంటనే హెక్టారుకు 2 కిలోల జినెబ్ శిలీంధ్ర నాశినిని 500 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
బూడిద తెగులు: దీని నివారణకు హెక్టారుకు 20-25 కిలోలు పొడి గంధకం పౌడర్ లేదా 2-3 కిలోల తడి గంధకం లేదా లీటరుకు 1.5 మి.లీ. డినోక్యాప్ పిచికారీ చేయాలి.

దిగుబడి: వర్షాధార పంటలో హెక్టారుకు 7-8 క్వింటాళ్లు. నీటి వసతిలో హెకార్టుకు 12-15 క్వింటాళ్లు. జిగురు పంట సాగు చేసే రైతులు ముందుగా కొనుగోలుదారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకోవడం మేలు.

విత్తనోత్పత్తి: గోరుచిక్కుడు స్వతహాగా స్వపరాగ సంపర్కం చెందే పంట. కాబట్టి రైతులు తమ స్థాయిలో సొంతంగా నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. ఇది సులభం కూడా. అందుకు అంతకు ముందు కాలంలో గోరుచిక్కుడు పంట వేయని పొలాన్ని ఎన్నుకోవాలి. ఇతర రకాలకు కనీసం 10 మీటర్ల వేర్పాటు దూరం పాటించాలి. ఇతర రకాల మొక్కలు, తెగులు సోకిన మొక్కలు, కేళీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు కలుపు నివారణ చేపట్టాలి. కోత సమయంలో పంట చుట్టూ 5-10 మీటర్ల దూరం మొక్కలు వదిలి మిగిలిన మొక్కల నుంచి విత్తనాలు సేకరించాలి. బాగా ఆరబెట్టిన కాయల నుంచి నేరుగా విత్తనాన్ని సేకరించి శుభ్రపరుచాలి. విత్తన తేమ శాతాన్ని 8-9 శాతానికి తీసుకురావాలి. అందుకు నీడలో ఆరబెట్టాలి. కార్బండింజతో శుద్ధి చేసిన విత్తనాలను సంచులలో, డబ్బాలలో నిల్వ చేసుకోవాలి. వీటిని ఆ తర్వాత కాలంలో విత్తనాలుగా వాడుకోవచ్చు. భారతీయ కనీస విత్తన చట్ట ప్రమాణాలను అందుకోవచ్చు. ట్రూత్‌ఫుల్ విత్తనాలుగా ఇతరులకు కూడా అమ్ముకొని ఆర్థికంగా లాభపడవచ్చు.

డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322

పల్లి పంటలో మెళకువలు

నూనె గింజల పంటల్లోకెల్లా పల్లి పంట ముఖ్యమైంది. వానకాలం పల్లి పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఈ పంటను సాగునీటి ఆధారంగా, వర్షాధారంగా సాగు చేయవచ్చు. ఈ పంట సాగు చేసేందుకు వర్షాధారంపై ఆధారపడిన రైతులు ఇప్పటికే దుక్కులు దున్నుకొని సరైన వానల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో పల్లిలో చీడపీడల సమస్య అధికంగా ఉంటుంది. కాబట్టి రైతులు దుక్కులు దున్నే నాటి నుంచే తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

వాతావరణం

పూతదశ, ఊడలు దిగే దశ నుంచి గింజ ఏర్పడే వరకు పంట కోత సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగితే పంటకు మేలు జరుగుతుంది. పల్లి పంట సాగుకు ఎర్రనేలలు అనుకూలంగా ఉంటాయి. ఎక్కువ బంకమన్ను గల నల్లరేగడి నేలల్లో పంటలు వేయకూడదు.

విత్తన మోతాదు

వానలు సమృద్ధిగా పడితే ఈ పంటను జూలై మాసం చివరి వరకు విత్తుకోవచ్చు. గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తన మోతాదు మారుతుంది. ఎకరాకు సుమారుగా 60 నుంచి 70 కిలోల విత్తనం అవసరం.

విత్తనశుద్ధి

విత్తనశుద్ధి కోసం మాంకోజెబ్ లేదా కార్బండిజమ్ మందును విత్తనానికి పట్టించాలి. ఈ పంట కొత్తగా సాగు చేసేటప్పుడు రైజోబియం కల్చరును పట్టించాలి. విత్తేటప్పుడు సాలుసాలుకు మధ్యన, మొక్కమొక్కకు మధ్యన 5 నుంచి 10 సెంటీమీటర్ల దూరం ఉండాలి. విత్తనాన్ని గొర్రుతో గానీ లేదా నాగలిసాళ్లతో గాని విత్తాలి. విత్తనాన్ని 5 సెంటీమీటర్ల లోతు మించకుండా విత్తుకుంటే పదునులోపు మొలకెత్తే అవకాశం ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు

దుక్కిలో విత్తనాలను విత్తేటప్పుడు నత్రజని 12 కిలోలు, భాస్వరం 16 కిలోలు, పొటాషియం 20 కిలోలు చొప్పున ఒక ఎకరాకు వేసుకోవాలి. ఆఖరిదుక్కిలో 5 టన్నుల సేంద్రియ ఎరువులు వేసుకోవాలి. ఎకరాకు 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. అలాగే 12 కిలోల యూరియాను విత్తే సమయంలో, 9 కిలోల యూరియాను 30 రోజుల తర్వాత అంటే తొలిపూత దశలో వేసుకోవాలి. ఎకరాకు 200 కిలోల జిప్సంను తొలిపూత సమయంలో మొక్కల మొదళ్ల వద్ద సాళ్లల్లో వేసి మట్టిని కప్పాలి. తర్వాత పంట పెరిగే కొద్దీ నిపుణుల సూచనల ప్రకారం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

–నగిరి హరీశ్, త్రిపురారం

ఈ ఇంటికి పంటే పందిరి

ఇంటి పంట

నిజమే..నగరం యిరుకు.
కలల కుదుళ్లను కత్తిరించి
ఆశల కొమ్మల్ని విరిచేసి
లైఫ్‌ను మీనియేచర్ సైజుకు కుదించి
బోన్సాయ్ కుండీలో కుదురుగా కూర్చోబెడుతుంది.
ఇక్కడి వీధుల ఎడారుల్లో పచ్చదనాలు లేవ్
గుండెల అగాధాల్లో తడి జాడల్లేవ్..
చేసుకున్న గాయాల్ని తడిమి చూసుకుంటున్న క్షణాల్లో
నిరంతరాయంగా కలలేవో చిట్లుతున్న శబ్దాలు
చెమ్మ లేక మట్టిలోనే మరణాన్ని మోస్తున్న స్వప్నాలు.

ఇది నిజమే.. కానీ ఈ నిజాన్ని కొంతమంది తమ ఆచరణతో అక్కడక్కడా అబద్ధం చేస్తున్నారు. వట్టిపోయిన గుండెల్లో కొత్త ఆశల్ని చిగురిస్తున్నారు. చిన్న చిన్న చిగుళ్లతో రేపటి చుట్టూ అనంతమైన నమ్మకాన్ని అల్లుతున్నారు. అసలు ఇష్టం,కష్టం రెండూ కలిస్తే చాలు చిన్న స్థలంలోనే, మన చుట్టూతా పచ్చని ప్రపంచం నిర్మించవచ్చని నిరూపిస్తున్నారు. ప్రకృతి ప్రేమికురాలు శారదకు మొక్కలంటే పిచ్చి ప్రేమ. తమ కుటుంబం హెచ్.ఎం.టిలో తమ బంధువులకు చెందిన స్థలంలో చిన్న ఇల్లు కట్టుకుని అందులో అన్నిరకాల కూరగాయలు పండించారు. ఇంట్లో అవసరాలకు పోను మిగిలిన వాటిని చుట్టుపక్కల వారికి అందించే వారు. తరువాత నాచారంలో ఇళ్లు కట్టుకున్నాక కింద ఫ్లోర్‌లో ఉన్నపుడు పెద్ద మనుమడి అన్నప్రాసనకు ఆకుకూరలు వేసి వండితే బాగుంటుందన్న సలహాతో కొన్ని ఆకుకూరలు పండించారు. బియ్యం బస్తాలో మట్టి పోసి అందులో పాలకూర, టమాటా, బెండ వేసారు. వారం రోజుల్లో చిగుర్లు కనిపించాయి. అదే ఉత్సాహంతో కొత్తిమీర, చుక్కకూర, మెంతి, వేసారు. ఎలాంటి ఎరువు వాడకున్నా మొక్కలు పచ్చగా చిగురించాయి. భర్త దూరమై మానసికంగా కుంగిపోతున్న దశలో ఈ మిద్దెతోట శారదను తన ఒడిలో లాలించి అక్కున చేర్చుకుంది.

తోటే ప్రపంచంగా గడుపుతున్న సమయంలో ఒక కాపు కాసిన తరువాత బియ్యం బస్తాలు ఎండకు పగిలిపోవడం గమనించింది. అందుకు ప్లాస్టిక్ కవర్లు పరిష్కారంగా భావించింది. హైకోర్టు గేటు ఎదురుగా ఉన్న నర్సరీ స్టోర్‌లో 150 రూపాయలతో 70 కవర్లు (రెండు కేజీలవి) తెచ్చుకున్నారు. మొక్కలు గుబురుగా పెరిగాక కవర్ కనిపించకపోవడంతో నీళ్లు పోయడం కష్టమైంది. అపుడు పొడవు తక్కువ, వెడల్పు ఎక్కువున్న కవర్లు (ఐదు కేజీలవి) తెచ్చారు. ఒక దశలో 10 కేజీల కవర్లు కూడా తెచ్చుకున్నారు. కానీ జీవామృతం పోసేటపుడు రంధ్రాల నుంచి అది బయటకుపోతోంది. ఇందుకు పరిష్కారంగా ఆమె అతి తక్కువ ఖర్చులో ప్లాస్టిక్ టబ్‌లను తెచ్చుకున్నారు. ఇవి అన్నిరకాలుగా అనుకూలంగా ఉన్నాయి. దీంతో తన మిద్దె మీది 850 చదరపు అడుగుల స్థలంలో 100 టబ్బులు, 20 బకెట్లు, 20 కవర్లు పెట్టి మొక్కలను పెంచుతున్నారు. ఇదంతా చూస్తే అడవిలో ఒక చిన్న ముక్క కత్తిరించి ఇక్కడ అతికించినట్టుగా ఉంటుంది.

నిజానికి టబ్బుల కంటే కవర్ల ఖర్చు చాలా తక్కువ. రెండు టబ్బుల ఖర్చుతో మొత్తం ప్లాస్టిక్ కవర్లు వస్తాయి. ఐతే టబ్బులు ఎంచుకోవడానికి ఆమె మూడు కారణాలు వివరిస్తున్నారు. జీవామృతం బయటకు పోకపోవడం, ఎండాకాలం స్లాబ్ వేడివల్ల కవర్లు వేడెక్కి తద్వారా మొక్కల వేర్లు దెబ్బతినే పరిస్థితి తప్పడం, వర్షాకాలం కవర్ల కింద పెట్టిన థర్మాకోల్ మెత్తబడి కవర్లలోకి దిగబడటం వంటి సమస్యలు ఈ టబ్బుల వల్ల తీరాయి. అసలు టబ్బుల్లో పండిస్తుంటే భూమి మీద పండించినట్టుగానే ఉన్నది అంటారు శారద.

ఇళ్లు కట్టినపుడు మిగిలిన కర్రలు, తడకలతో బీమ్స్‌కి మధ్యన వంతెనలా వేసి వాటి మీద ప్లాస్టిక్ కవర్స్‌లో టమాటా, బెండ, తీగ జాతులు పెంచుతున్నారు. తీగజాతులను తడకల మీద పెంచడం వల్ల అవి కింది నుంచి పైదాకా పాకనవసరం లేకుండా, తక్కువ ఎత్తులోనే పందిరికి సులువుగా అల్లుకుంటున్నాయి. థర్మాకోల్ బాక్స్‌లు, ప్లాస్టిక్ టబ్స్, ఇనుప బకెట్‌లో మొక్కలు ఆరోగ్యకరంగా పెంచుకోవచ్చు అంటారు శారద. ఒక టబ్బులో మధ్యన కమల చెట్టు (పెద్ద చెట్టు),దాని చుట్టూ 4 బెండ చెట్లు, ఒక తీగజాతి (సొర, బీర, పొట్ల) పెంచుకోవచ్చు. చిన్న కవర్‌లో మూడు మిరప, మూడు బెండ మొక్కలు పెంచుకోవచ్చు. థర్మాకోల్ బాక్స్ లో ఆరు ఇంచులలోపు వేర్లు పాదుకునే ఆకుకూరలు పెడితే మంచిది. లోతైన వాటిలో పెడితే నీరు ఎక్కువ నిలువ ఉండి వేర్లు మురిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఇక ఒక కవర్‌కు ఒకటే వంగ పెడితే మంచిది. వంగ రెండు ఇంచుల లోపే వేరును విస్తరిస్తుంది.

ఇందులో వేరే మొక్క ఎదగదు. ఐతే వంగ వేరు తగలని చోట క్రీపర్ పెట్టుకుంటే అది లోపలికి వెళుతుంది కాబట్టి సమస్య లేదు అంటూ తన అనుభవాలను వివరించారు శారద.

పాలేకర్ విధానం చాలా మంచిది. యూట్యూబ్ చూసి ఆయన విధానాలను అర్థం చేసుకున్నాను. నా తోట ఇంత పచ్చగా ఉండటానికి ఆయన రూపొందించిన జీవామృతమే కారణం. దానివల్ల ప్రతి కుండీలో వానపాములు వృద్ధి చెందాయి. ఇవి పైకి కిందకు తిరగడం వల్ల మొక్కల వేర్లకు సులువుగా గాలి అందుతున్నది. కిచెన్‌వేస్ట్‌ను థర్మాకోల్ బాక్స్‌లో వేసి పైన జీవామృతం పోస్తున్నారు. దీనివల్ల వానపాములు బాగా వృద్ధి చెంది మంచి ఎరువు తయారవుతున్నది. ముఖ్యంగా ఒక వంతు మట్టి, ఒక వంతు పశువుల ఎరువు లేదా వర్మికంపోస్ట్, ఒక వంతు కిచెన్ వ్యర్థాల కంపోస్ట్, ఎండిన పశువుల ఎరువు, కొంచెం వేపపిండి కలిపి పాటింగ్ మిక్స్ తయారుచేసుకుంటే మొక్కలు మంచిగా ఎదుగుతాయంటారు. ఇక తెగుళ్ల నియంత్రణకు వస్తే పచ్చిమిర్చి, వెల్లుల్లి, వేపాకు మెత్తగా నూరి ఉదయం మరగబెట్టి, రోజంతా అలాగే ఉంచి మరుసటిరోజు సాయంత్రం మొక్కల మీద పిచికారీ చేయడం వల్ల పురుగుల గుడ్లు నశిస్తాయి. ఎప్పటికపుడు ఇలా చేసుకోవడం వల్ల పురుగులను నియంత్రించవచ్చు అంటారు.

ప్రతీ తోటలో నేలిబీర పెడితే చాలా మంచిది. ఒక్కొక్క పువ్వు చాలా పెద్దగా ఉంటుంది. దానిలో పుప్పొడి విపరీతంగా ఉంటుంది. దానికోసం తేనెటీగలు, పిట్టలు, సీతాకొకచిలుకలు విపరీతంగా రావడంతో పరపరాగ సంపర్కానికి అవకాశం ఎక్కువగా ఉండి అధిక ఉత్పత్తులు పొందవచ్చు అంటారు శారద. ఇక మా మిద్దె మీద ముల్లంగి, కారట్, బీట్‌రూట్ అన్నీ పండించగలిగాను గానీ, కాలిఫ్లవర్ పండించడం సాధ్యం కాలేదు. ఎన్నిసార్లు వేసినా పురుగు సమస్యను నియంత్రించలేకపోయాను. జీవామృతం పిచికారీ చేస్తే పువ్వు మొత్తం ముడుచుకుపోయి గట్టిపడుతున్నది. ఏం చేయాలో అర్థం కావడంలేదంటారు.

ముందు చెప్పినట్టు ఆమెకు పచ్చదనమంటే పిచ్చి. ఎంతంటే మూడవ కొడుకు పుట్టే సమయంలో ఉదయం మూడున్నరకు లేచి, మొక్కలకు నీళ్లు పోసి తొమ్మిదన్నరకు సిజేరియన్‌కు వెళ్లారట. అదీ ఆమెకు మొక్కల మీద ఉన్న పిచ్చి.

– కె.క్రాంతికుమార్‌రెడ్డి, 9603214455
నేచర్స్ వాయిస్

శారద మిద్దెతోట పంటలు

ఆకుకూరలు: పాలకూర,చుక్కకూర, గోంగూర, బచ్చలి, పొన్నగంటి, తోటకూర, గంగవావిలి, గలిజేరు (పునర్నవ),మెంతి,కొత్తిమీర, పుదీనా
కూరగాయలు: వంకాయ, బెండ, టమాటా, చెట్టు చిక్కుడు, గోరుచిక్కుడు, చాలారకాల వంగ, పచ్చి మిర్చి, మునగ, కాలిఫ్లవర్, క్యాబేజి
దుంపజాతులు: కందగడ్డ, ముల్లంగి, బీట్‌రూట్, చామ దుంప
తీగజాతులు: సొర, బీర, పొట్ల, దోస, చిక్కుడు, నేతి బీర, కాకర, దొండ (పొడుగు, పొట్టి)
పండ్ల మొక్కలు: దానిమ్మ, జామ, సపోటా, కమలా ఫలం, స్వీట్ లైమ్, లెమన్, అంజీర్
పూల మొక్కలు: గులాబీ, మల్లె, చామంతి, లిల్లీ, బంతి (రెండు రకాలు)

ఇతర వివరాలకు చందుబట్ల శారదను సంప్రదించవలసిన నెంబర్..63012 16815

రకుల్‌ప్రీత్‌సింగ్

మన్మథుడి ప్రేమాయణం

నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మన్మథుడు-2'. మనం ఎంటర్‌ప్రైజెస్, ఆనంది ఆర్ట్స్, వయాకామ్ 18 స్టూడియోస్ పతాకాలపై నాగార్జున అక్కినేని, పి.కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. ఆగస్ట్ 9న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'లేటు వయసులో అవంతిక అనే అందాల భామతో ప్రేమలో పడిన ఓ మన్మథుడి కథ ఇది. వారి ప్రేమప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రతి ఒక్కరిని అలరిస్తుంది. నాగార్జున పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతూ నవ్యమైన అనుభూతిని పంచుతుంది. అవంతికగా రకుల్‌ప్రీత్‌సింగ్ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నాగార్జున తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. లక్ష్మి, వెన్నెలకిషోర్, రావురమేష్, ఝాన్సీ, దేవదర్శిని కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ఎం.సుకుమార్.

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

26న 'డియర్ కామ్రేడ్'

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. మైత్రీమూవీమేకర్స్, బిగ్ బెన్ పతాకాలపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి, యష్ రంగినేని సంయుక్తగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 26న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఇటీవల నాలుగు భాషల్లో ట్రైలర్ విడుదల చేశాం. ఆకట్టుకునే కథనం, లవ్, ఎమోషన్స్.. ఇలా అన్ని రకాల భావోద్వేగాల సమ్మిళితంగా సినిమా వుంటుందని ట్రైలర్‌తోనే ప్రేక్షకులకు చెప్పే ప్రయత్నం చేశాం. దీనికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పటి వరకు 13 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి. ఇటీవల విడుదల చేసిన పాటలకు మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ నెల 12, 13 తేదీల్లో బెంగళూరు, కొచ్చిలో నిర్వహించిన మ్యూజిక్ ఫెస్టివల్‌కు అనూహ్య ఆదరణ లభించింది. బెంగళూరులో జరిగిన కార్యక్రమానికి హీరో యష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 18న చెన్నైలో, 19న హైదరాబాద్‌లో మ్యూజిక్ ఫెస్టివల్స్‌ని నిర్వహించనున్నాం. ఈ నెల 26న దక్షిణ భారతీయ భాషల్లో భారీ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: సుజిత్ సారంగ్, ఎడిటింగ్, డీఐ: శ్రీజిత్ సారంగ్, మాటలు: జె.కృష్ణ.

స్మిత

ఇరవై ఏళ్ల ప్రయాణానికి గుర్తుగా..

'నా కెరీర్ ఆరంభమై ఇరవై ఏళ్లయిందంటే నమ్మలేకపోతున్నాను. ఈ ప్రయాణంలో నేను వేసిన ప్రతి అడుగు ఓ మధుర జ్ఞాపకాన్ని మిగిల్చింది' అని చెప్పింది స్మిత. పాప్‌గాయనిగా కెరీర్ ప్రారంభించి ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 22న 'ఏ జర్నీ ఆఫ్ 1999-2019' పేరుతో ప్రత్యేకంగా స్మిత మ్యూజిక్, డాన్స్ వేడుకను నిర్వహించనుంది. ఈ కార్యక్రమ విశేషాల్ని గురించి మంగళవారం హైదరాబాద్‌లో ఆమె పాత్రికేయులతో ముచ్చటిస్తూ '1996లో గాయనిగా తొలి అడుగు వేశాను. 1999లో మొదటి పాప్ ఆల్బమ్ విడుదల చేశాను. అయినా ఇప్పుడే కొత్తగా కెరీర్ ప్రారంభించిన అనుభూతి కలుగుతుంది. ఇక నుండే అసలైన జర్నీ మొదలుపెట్టబోతున్నాను. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఇండీపాప్ గాయని నేనే అయినందుకు గర్వపడుతున్నాను. పది భాషల్లో పాటలు, 12 ఆల్బమ్స్, 17 మ్యూజికల్ వీడియోలు..ఇలా ఎన్నో అనుభూతుల్ని మరోసారి గుర్తు చేసుకోవాలనే తపనతో మ్యూజిక్, డాన్స్ వేడుకను నిర్వహించబోతున్నాను. ఈ ఈవెంట్ చేయాలనే ఆలోచన వచ్చిన వెంటనే హీరో నాగార్జునను కలిశాను. ఆయన్ని నేనో గురువుగా భావిస్తున్నాను. ఆయనతో పాటు కీరవాణి, నాని, నరేష్, జగపతిబాబు చాలా మంది వేడుకకు హాజరుకాబోతున్నారు' అని తెలిపింది.

ప్రవీణ, అనఘ, కార్తికేయ, అనిల్ కడియాల, బోయపాటి శ్రీను, అల్లు అరవింద్, అర్జున్ జంధ్యాల, తిరుమలరెడ్డి

నా హృదయానికి దగ్గరైన సినిమా!

కార్తికేయ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గుణ 369'. అర్జున్ జంధ్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అనఘ కథానాయిక. ప్రవీణ కడియాల సమర్పణలో స్ప్రింట్ ఫిలింస్, జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ కడియాల, తిరుమలరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న విడుదల కానున్న ఈ చిత్ర ట్రైలర్‌ని బుధవారం హైదరాబాద్‌లో అల్లు అరవింద్, దర్శకుడు బోయపాటి శ్రీను సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'బోయపాటి శ్రీను సినిమా ట్రైలర్ చూసినట్టుగా వుంది. 'సరైనోడు' సినిమా సమయంలో బోయపాటికి వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి అర్జున్ జంధ్యాల. అప్పుడే అతని ప్రతిభ ఏంటో అర్థమైంది. ఈ చిత్రానికి ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్న తిరుమల రెడ్డి నాకు మంచి మిత్రుడు. అతనికి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి. దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఓ భారీ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ 'హిట్, సూపర్‌హిట్ అనే పదాలు ఈ సినిమాకు వాడను. ఎందుకంటే ఇది నా హృదయానికి చాలా దగ్గరైన సినిమా. కథ చెప్పగానే అర్జున్ జంధ్యాల ఎవరనేది కూడా ఆలోచించలేదు. అంత బాగా కథ చెప్పాడు. స్క్రిప్ట్ మొత్తం వినకుండానే అంగీకరించాను. నేను ఎందుకు ఈ సినిమా చేశానో రేపు మీకే అర్థమవుతుంది. నా కెరీర్‌లో 'ఆర్‌ఎక్స్100' ఓ కల్ట్ సినిమా. దాన్ని మించి వుంటుంది. సినిమా చేస్తున్నప్పుడు నేనేనా నటించింది అన్న అనుమానం కలిగింది. అంత అద్భుతంగా నా నుంచి నటనను దర్శకుడు రాబట్టారు. ఆగస్టు 2న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలరెడ్డి, అనఘ, ప్రవీణ కడియాల, అనిల్ కడియాల, చైతన్ భరద్వాజ్, కెమెరామెన్ రామ్, హేమ తదితరులు పాల్గొన్నారు.

నయనతార

మణిరత్నం దర్శకత్వంలో..

'నవాబ్' చిత్రంతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు ప్రముఖ దర్శకుడు మణిరత్నం. ఈ సినిమా ఇచ్చిన సక్సెస్ జోష్‌లో వున్న ఆయన ప్రస్తుతం తన తదుపరి చిత్రాన్ని తెరకెక్కించే పనిలో వున్నారు. కల్కి కృష్ణమూర్తి నవల 'పొన్నియన్ సెల్వన్' ఆధారంగా చారిత్రాత్మక చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇప్పటికే రెండు సార్లు బడ్జెట్ కారణంగా వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ సారి పక్కా ప్లానింగ్‌తో దర్శకుడు మణిరత్నం తెరపైకి తీసుకురాబోతున్నారు. ఇప్పటికే జయం రవి, విక్రమ్, ఐశ్వర్యారాయ్ వంటి క్రేజీ తారల్ని పలు కీలక పాత్రల కోసం ఎంపిక చేసుకుని ప్రీప్రొడక్షన్ వర్క్‌ని మొదలుపెట్టిన ఆయన మరో కీలక పాత్ర కోసం నయనతారని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇందులో ఆమె కుందవాయి అనే రాజకుమారి పాత్రలో కనిపించనుందని తమిళ చిత్ర వర్గాలు చెబుతున్నాయి. మణిరత్నం దర్శకత్వంలో నయనతార నటించనున్న తొలి చిత్రమిదే. ప్రస్తుతం నయన సైరా నరసింహారెడ్డి, బిగిల్, దర్బార్ చిత్రాల్లో నటిస్తోంది.

ఓల్డ్ సిటీ నేపథ్యంలో..

అజీజ్ నాసర్, సూఫీఖాన్, అలీ రజా

అలీ రజా, అజీజ్ నాసర్, ఫరాఖాన్, సూఫీఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హైదరాబాద్ నవాబ్స్-2'. నటుడు ఆర్.కె నటించి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆర్.కె. మాట్లాడుతూ 'ఓల్డ్ సిటీ నేపథ్యంలో సాగే కథ ఇది. రియల్ ఎస్టేట్ కాన్సెప్ట్‌తో ఈ కథని ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కించాను. రెండు గంటల పాటు నవ్విస్తుంది. హైదరాబాద్ లోకల్ కల్చర్ నేపథ్యంలో చిత్రాన్ని రూపొందించాం. కొత్త తరహా చిత్రాన్ని చూసిన అనుభూతిని కలిగిస్తుంది' అన్నారు. అలీ రజా మాట్లాడుతూ '2006లో వచ్చిన 'హైదరాబాద్ నవాబ్స్' చిత్రం నాకు బాగా నచ్చింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రంలో నటించే అవకాశం దక్కడం ఆనందంగా వుంది. ఖచ్చితంగా ఈ సీక్వెల్ అందరికి నచ్చుతుందనే నమ్ముముంది' అన్నారు. అజీజ్ నాజర్ మాట్లాడుతూ 'స్క్రిప్టే ఈ చిత్రానికి హీరో. కామెడీ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చుతుంది. ఈ శుక్రవారం విడుదల కానున్న ఈ చిత్రం తప్పకుండా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకముంది' అన్నారు. ఈ కార్యక్రమంలో సూఫీఖాన్, ఫరాఖాన్, సమైరా, తబర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరహాసన్

నాన్న సలహాలు ఇవ్వరు

'అందరిలా కాకుండా వైవిధ్యంగా ఆలోచించడం అంటే నాకు ఇష్టం. ఆ దృక్కోణమే విభిన్నమైన కథాంశాల్ని ఎంచుకుంటూ సినిమాలు చేయడానికి కారణమైంది' అని అంటోంది అక్షర హాసన్. కమల్‌హాసన్ తనయగా చిత్రసీమలోకి అరంగేట్రం చేసింది అక్షరహాసన్. నాలుగేళ్ల ప్రయాణంలో కేవలం నాలుగు సినిమాలే చేసినా చక్కటి అభినయంతో ఆకట్టుకున్నది. 'మిస్టర్ కె.కె' సినిమాలో కీలక పాత్రను పోషిస్తున్నది అక్షర హాసన్. ఈ సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గురించి ఆమె మాట్లాడుతూ 'నాకు సరిపోయే కథలేమిటి? ఎలాంటి సినిమాలు చేయాలి? అనే విషయంలో నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా ముందుకు సాగుతున్నాను. నెమ్మదిగానే అయినా నాకు నచ్చిన సినిమాలే చేస్తాను. కెరీర్ విషయంలో అమ్మానాన్నల సహాయం తీసుకోవడం ఇష్టం ఉండదు. సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను ఇచ్చారు. నా అభిప్రాయాల్ని ఆలోచనలకు విలువనిస్తారు. నటనకు మాత్రమే పరిమితం కాకుండా భవిష్యత్తులో దర్శకత్వం వహిస్తాను. సొంతంగా కథలు రాసుకుంటున్నాను' అని తెలిపింది.